

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 199

సోమవారం 10-10-2022


SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'శత'క్కొట్టిన శ్రేయస్
రెండో వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం - 12లో



పెట్టుబడికీ 'ఓకే బంగారం'
కష్టకాలంలో ఆదుకునే సాధనం.. దీర్ఘకాలంలోనే రాబడులు - 13లో



ఢిల్లీలో వరుణుడి ఉగ్రరూపం
ఢిల్లీలో శనివారం నుంచి ఆదివారం వరకు 74 మి.మీ వర్షం కురిసింది. 2007 తర్వాత నగరంలో ఒక్కరోజులో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇది రెండోసారి.
వివరాలు 6లో



సోనాలీ ఫోగాట్ హత్యకు రూ.10 కోట్ల డీల్!
బీజేపీ నేత, నటి సోనాలీ ఫోగాట్ హత్యకు రూ.10 కోట్ల డీల్ కుదిరినట్లు తమ కుటుంబానికి ఇటీవలే రెండు లేఖలు అందాయని ఆమె బావ అమన్ పూనియా చెప్పారు.
వివరాలు 6లో

రాళ్లేయడమే లక్ష్యమా?
యనమలపై ఆర్థిక మంత్రి బుగ్గన మండిపాటు



- ప్రజలను ఆదుకుంటుంటే టీడీపీ ఓర్వలేకపోతోంది
- నిన్నటి దాకా శ్రీలంక.. ఇప్పుడేమో నైజీరియా, జింబాబ్వేనా?
- ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందిస్తుంటే సహించలేరా?
- కోవిడ్ ఏడాది కాకుండా 2021–22 గురించి మాట్లాడలేరా?
- టీడీపీ హయాంలో అప్పులు అసాధారణంగా పెరిగాయి
- ఇప్పుడు మూలధన వ్యయం మెరుగుపడింది

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై రాళ్లు విసరడమే లక్ష్యంగా విపక్షం వ్యవహరిస్తోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజమెత్తారు. రైతులు, ప్రజల అవసరాలను తీరుస్తుంటే టీడీపీ నేత యనమల తదితరులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. నిన్నటి దాకా శ్రీలంక అంటూ దుష్ప్రచారం చేసి ఇప్పుడు
మిగతా 2వ పేజీలో ▶

జగనన్న విద్యా కానుక
ఇక మరింత మెరుగ్గా..
చిన్నపాటి లోపాలు సైతం లేకుండా పగడ్బందీగా పథకం అమలు

- పిల్లలు, తల్లిదండ్రులు, టీచర్ల నుంచి అభిప్రాయ సేకరణ
- నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అన్ని వస్తువులు ఉండేలా జాగ్రత్తలు.. 2023–24 నుంచి ప్రతి విద్యార్థికీ సరిపడేలా అదనపు యూనిఫాం క్లాత్
- లావుగా ఉన్న పిల్లలకు కూడా క్లాత్ సరిపోయేలా చర్యలు
- కుట్టు కూలీ ధర పెంపుపై పరిశీలన.. బ్యాగుల్లో మార్పులు
- 1–5 తరగతులకు మీడియం సైజ్ బ్యాగ్.. 6–10 తరగతులకు పెద్ద సైజ్.. నోట్‌బుక్‌లు, పాఠ్య పుస్తకాలు అన్నీ అమరే విధంగా వెడల్పాటి బ్యాగ్
- షూ సైజులు తీసుకోవడానికి మండల స్థాయిలో సరఫరాదారులతో మేళాలు
- వచ్చే ఏడాది పంపిణీకి ఇప్పటి నుంచే విద్యా శాఖ సన్నాహాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జగనన్న విద్యా కానుక కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న వివిధ వస్తువులు మరింత నాణ్యంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నిర్దీత ప్రమాణాలకు ఎక్కడా తగ్గకుండా వస్తువులను పంపిణీ చేయించేలా పాఠశాల విద్యా శాఖ దృష్టి సారించింది. జగనన్న విద్యా కానుక వస్తువులకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. అక్కడక్కడ తలెత్తిన చిన్న చిన్న లోపాలు కూడా భవిష్యత్తులో ఉండకుండా చూసుకోవాలని నిర్ణయించింది. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులందరికీ మరింత నాణ్యమైన వస్తువుల పంపిణీకి ఇప్పటి నుంచే సన్నాహాలు చేపట్టింది.

ఏటేటా పెరుగుతున్న నాణ్యత

- గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, 2 జతల యూనిఫారం మాత్రమే ఇచ్చేవారు. అదీ విద్యా సంవత్సరం ఆరంభమై ఏడెనిమిది నెలలు గడిచినా అందేవి కావు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచే విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారు. పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారం అందించేలా

మిగతా 2వ పేజీలో ▶





మృతురాలు దేవిక (ఫైల్) నిందితుడు సూర్యనారాయణ

దేవిక కుటుంబానికి రూ.10 లక్షల సహాయం

- భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- దోషికి కఠిన శిక్ష పడేలా తగిన చర్యలు తీసుకోవాలి
- బాధితులకు అండగా నిలవాలని అధికారులకు ఆదేశం.. నిందితుడికి 21వ తేదీ వరకు రిమాండ్

2లో

ఇదండీ సంగతి



గుర్తు వాడొద్దన్నారని సైగలతో ప్రచారం చేసుకుంటున్నారు!

పాడేరులో వికేంద్రీకరణకు జై కొడుతున్న అల్లూరి జిల్లాలోని ఎమ్మెల్యేలు, అఖిలపక్ష నేతలు



జనం చూపు వికేంద్రీకరణ వైపు

- పాలనా రాజధాని విశాఖతో వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి
- వికేంద్రీకరణతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి
- సీఎం నిర్ణయానికే సర్వత్రా మద్దతు.. ప్రతి నగరం, పట్టణం అభివృద్ధి జరగాలి
- రాజధాని పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం
- అల్లూరి జిల్లాలో అఖిలపక్ష నేతలు, నిడదవోలులో వక్తల స్పష్టీకరణ

సాక్షి, పాడేరు/నిడదవోలు: రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అఖిలపక్ష నేతలు, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాడేరులోని ప్రభుత్వ కాఫీ అతిథి గృహం సమావేశ మందిరంలో అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో, నిడదవోలులోని రోటరీ ఆడిటోరియంలో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం వికేంద్రీకరణకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు వికేంద్రీకరణకే జై కొట్టారు. పాడేరులో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, గ్రూప్–1 రిటైర్డ్ అధికారి ఓంద్రు రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. వికేంద్రీకరణతో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని
మిగతా 3వ పేజీలో ▶

పరిశ్రమలకు సముద్రపు నీరు



- పైడి భీమవరంలో రాష్ట్రంలో తొలి డీశాలినేషన్ ప్లాంట్
- తొలిదశలో రూ.400 కోట్లతో రోజుకు 35 మిలియన్ లీటర్ల నీటిశుద్ధి.. ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచిన ఏపీఐఐసీ
- పైడి భీమవరం క్లస్టర్‌లో 26కుపైగా ఫార్మా, కెమికల్ కంపెనీలు
- ప్రస్తుతం భూగర్భ జలాలను వినియోగిస్తున్న యూనిట్లు

- వివరాలు 10లో



ఈ-గవర్నెన్స్‌లోనూ అదుర్స్

- దేశంలో టాప్–10 రాష్ట్రాల్లో ఏపీకి నాల్గో స్థానం
- తొలి మూడు స్థానాల్లో పశ్చిమ బెంగాల్, యూపీ, తమిళనాడు
- 2021–22 ఆర్థిక ఏడాదిలో ఏపీలో 52.90 కోట్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలు
- చట్టబద్ధ.. చట్టబద్ధత లేని లావాదేవీలు 4.16 కోట్లు.. యుటిలిటీ బిల్లుల చెల్లింపులు 10.76 కోట్ల లావాదేవీలు
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడి

- వివరాలు 3లో

క్లుప్తంగా

అల్లా దీవెనలతో అందరికీ మంచి జరగాలి
సీఎం వైఎస్‌ జగన్‌



సాక్షి, అమరావతి: మహ్మద్‌ ప్రవక్త పుట్టినరోజు మిలాద్‌ ఉన్‌ నబీ సందర్భంగా ఆదివారం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల ముస్లిం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'సాటి మనుషుల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత, ప్రపంచ శాంతి... మహ్మద్‌ ప్రవక్త మానవాళికి ఇచ్చిన గొప్ప సందేశాలు. ముస్లిం సోదరసోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు. అల్లా దీవెనలతో అందరికీ మంచి జరగాలని మనసారా కోరుకుంటున్నాను..' అని వైఎస్‌ జగన్‌ ట్వీట్‌ చేశారు.

వాల్మీకి అందించిన గొప్ప గ్రంథం రామాయణం : సీఎం జగన్‌

ఆదికవి వాల్మీకి జయంతి సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. 'మహా ఇతిహాసమైన రామాయణాన్ని, వ్యక్తిత్వ పరంగా రాముడి సుగుణాలను, సీతమ్మ గొప్పదనాన్ని గ్రంథస్తం చేసి మానవాళికి అందించిన మహర్షి వాల్మీకి' అని వైఎస్‌ జగన్‌ ట్వీట్‌ చేశారు. 'ఆదికవి అయిన వాల్మీకి జయంతి నేడు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయన కీర్తి ఆయన రచన ద్వారా చరితార్థం!' అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలు ఎలీజా, గణేష్‌లకు సీఎం పరామర్శ



శస్త్ర చికిత్స అనంతరం ఎమ్మెల్యే ఎలీజా



ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఉమాశంకర్‌ గణేష్‌

చింతలపూడి/నర్సీపట్నం: ఏలూరు జిల్లా చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఇటీవల అస్వస్థతకు గురవ్వడంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్‌ ఆస్పత్రిలో శనివారం శస్త్రచికిత్స చేశారు. ఆయనను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను కోరారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే సతీమణి ఝాన్సీరాణితో కూడా ఫోన్‌లో మాట్లాడిన సీఎం ఆమెకు ధైర్యం చెప్పారు. అలాగే మూడు రాజధానులకు మద్దతుగా నిర్వహించిన బైక్‌ ర్యాలీలో గాయపడి విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌ గణేష్‌ను ఆదివారం ఫోన్‌లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్‌ వాహనం

- ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు
- ఈ నెల 31 వరకు దరఖాస్తులకు గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్‌ వాహనాలు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌ విభిన్న ప్రతిభావంతులు, సీనియర్‌ సిటిజన్స్‌ సహకార సంస్థ (ఏపీడీఏఎస్‌సీఏసీ) మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆన్‌లైన్‌ ద్వారా ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. 70 శాతంపైగా వైకల్యం కలిగిన 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులు. కనీసం పదో తరగతి పాసవ్వాలి. రూ.3లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలి. లబ్ధిదారుల ఎంపికకు రెండు నెలల ముందు డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉండాలి. వారికి సొంత వాహనం ఉండకూడదు. గతంలో ఇటువంటి వాహనాలు తీసుకుని ఉండకూడదు. గతంలో దరఖాస్తు చేసినప్పటికీ ఇవి మంజూరు కాకపోతే కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే. జిల్లా మెడికల్‌ బోర్డు వారు ఇచ్చిన సదరం ధ్రువపత్రం, ఆధార్‌ కార్డు, ఎస్‌ఎస్‌సీ ధ్రువపత్రం, ఎస్సీ, ఎస్టీ అయితే కుల ధ్రువీకరణపత్రం, దివ్యాంగుల పూర్తి ఫొటోను పాస్‌పోర్టు సైజులో ఉన్నది దరఖాస్తుతోపాటు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేయాలి.

ఐఎన్‌టీయూసీ తెలుగు రాష్ట్రాల కార్యదర్శిగా ఆస్కార్‌రావు



సాక్షి, అమరావతి: ఐఎన్‌టీయూసీ తెలుగు రాష్ట్రాల కార్యదర్శిగా ఆస్కార్‌రావు ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా ఉన్న ఎ.సంజీవరెడ్డి ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంజీవరెడ్డి ప్యానల్‌లో తెలుగు రాష్ట్రాల కార్యదర్శిగా ఎన్నికైన ఆస్కార్‌రావు ఆదివారం ధ్రువీకరణపత్రం అందుకున్నారు. ఆస్కార్‌రావు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు.

దేవిక కుటుంబానికి రూ.10 లక్షల సహాయం

భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి/కరప : కాకినాడ జిల్లా పెదపూడి మండలం కాండ్రేగుల కూరాడ గ్రామంలో హత్యకు గురైన దేవిక కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. దేవిక హత్య ఘటనపై ఇప్పటికే దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి జగన్‌.. దిశ చట్టంలో పేర్కొన్న విధంగా త్వరితగతిన కేసు విచారణ పూర్తి చేసి, నిర్ణీత సమయంలోగా ఛార్జిషీటు దాఖలు చేయాలని చెప్పారు. దోషి రెడ్‌ హేండెడ్‌గా పట్టుబడ్డ కేసుల విషయంలో దిశ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం ముందుకు సాగాలని, తద్వారా నేరం చేసిన వ్యక్తికి కఠిన శిక్ష పడేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.10 లక్షల సాయాన్ని దేవిక కుటుంబ సభ్యులకు రెండు రోజుల్లో అందజేస్తారని కాకినాడ రూరల్‌ ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తెలిపారు. ఆదివారం కరపలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విషయాన్ని కూరాడ సర్పంచ్‌ వాసంశెట్టి వెంకటరమణ, పీఏసీఎస్‌ అధ్యక్షుడు రావుల ప్రసాద్‌, ఇతర నాయకులకు వివరించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

న్యాయమూర్తి ఎదుట హాజరు

ప్రేమను నిరాకరించిందన్న కక్షతో యువతి కాదా దేవికను హత్య చేసిన నిందితుడు గుబ్బల వెంకట సూర్యనారాయణను పోలీసులు న్యాయమూర్తి ముందు హాజరు పరచి, రిమాండ్‌కు తరలించారు. కాకినాడ రూరల్‌ సీఐ కె.శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన కాదా రాంబాబు కుమార్తె దేవిక.. కాకినాడ జిల్లా కరప మండలం కూరాడలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ డిగ్రీ చదువుకుంటోంది. అదే గ్రామంలో మేనమామ ఇంటి వద్ద ఉండే గుబ్బల వెంకట సూర్యనారాయణ అనే యువకుడు తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని ఏడాది కాలంగా దేవికను వేధిస్తున్నాడు. అందుకు నిరాకరించిందన్న అక్కసుతో శనివారం ఆమెను పెదపూడి మండలం కాండ్రేగుల–కూరాడ గ్రామాల మధ్య కత్తితో అతి దారుణంగా నరికి హతమార్చిన విషయం విదితమే. నిందితుడు వెంకట సూర్యనారాయణను కాకినాడ రూరల్‌ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. ఆదివారం కోర్టుకు సెలవు కావడంతో కాకినాడ రెండో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి నివాసంలో ఆమె ఎదుట హాజరు పరిచారు. నిందితుడికి ఈ నెల 21వ తేదీ వరకూ రిమాండ్‌ విధించగా, అతడిని కాకినాడ సబ్‌ జైలుకు తరలించారు.

'ఆక్వా'ను ముఖ్యమంత్రి అన్ని విధాలా ఆదుకుంటున్నారు

మంత్రుల కమిటీపై ఆక్వా రైతుల హర్షం



కైకలూరు: రాష్ట్రంలో ఆక్వా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలవడంతో ఆ రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడంపై శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన సీఎం.. ఆ తర్వాత ముగ్గురు మంత్రులు, సీనియర్‌ అధికారులతో సాధికారత కమిటీని ఏర్పాటుచేయడం, వారం రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించడాన్ని వారు స్వాగతిస్తున్నారు. నిజానికి.. ఆక్వా ఉత్పత్తుల విక్రయ ప్రక్రియలో సిండికేట్లు చెప్పిందే రేటు. రొయ్యల సాగును చంటి బిడ్డల్లా సాకిన రైతుల కష్టానికి వీరి చర్యలతో తగిన ప్రతిఫలం దక్కడంలేదు. సిండికేట్లు ఎంత చెబితే అంత రేటుకు రైతు అమ్ముకోవాల్సి వస్తోంది. వాస్తవానికి అంతర్జాతీయ మార్కెట్‌ రొయ్యల ధరను నిర్ణయిస్తోంది. ఏపీలో ఆ రేట్లు అమలుకావడంలేదు. మరోవైపు మేతల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. సిండికేట్లు ఇలా దోపిడీ చేస్తుండడంతో రైతులు, రైతు సంఘాల నేతలు శనివారం సీఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకురాగా.. ఆయన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవడంపై ఆక్వా రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఆక్వా రంగాన్ని సీఎం జగన్‌ అన్ని విధాలా ఆదుకుంటున్నారు. కోవిడ్‌ విపత్కర పరిస్థితుల్లో సైతం ఉత్పత్తుల రవాణాకు అవకాశం కల్పించారు. ఆక్వా సాగులో మేతల రేట్లు పెరిగి, విక్రయ రేట్లు తగ్గాయి. మేతల ధరల పెంపుపై సీఎం కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయం. ఆయనకు రుణపడి ఉంటాం.

– బలే నాగరాజు, ఏలూరు జిల్లా ఉత్తమ ఆక్వా రైతు, కొవ్వాడలంక, మండవల్లి మండలం

ఆక్వాకు సర్కార్‌ అధిక ప్రాధాన్యం



ఆక్వా రంగం ఆటుపోట్ల మధ్య సాగుతోంది. ముఖ్యంగా రొయ్యల సాగులో గిట్టుబాటు ధర రావడంలేదు. రేట్ల నిర్ణయంలో ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. ప్రభుత్వం ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తోంది. రేట్లు, మేతల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలి.

– మంగినేని రామకృష్ణ, రొయ్యల రైతు, కైకలూరు

కీచకుల పార్టీగా టీడీపీ

- మహిళలపై టీడీపీ నేతల అకృత్యాలకు బాబు సమాధానం చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత



సంధ్యారాణి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తనకల్లు : మహిళలపై టీడీపీ నాయకులు చేస్తున్న అకృత్యాలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత డిమాండ్‌ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రబల్లిలో టీడీపీ నేత వేధింపులకు బలైన ఇంటర్‌ విద్యార్థిని సంధ్యారాణి తల్లిదండ్రులను ఎమ్మెల్యే డాక్టర్‌ సిద్దారెడ్డితో కలిసి ఆదివారం ఆమె పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సంధ్యారాణి తల్లిదండ్రులు శ్రీనివాసులు, రాధమ్మలకు భరోసా ఇచ్చారు. సంధ్యారాణి బలవన్మరణానికి కారణమైన టీడీపీ నేత రాళ్లపల్లి ఇంతియాజ్‌కు ఆ పార్టీ నాయకులు అండగా నిలవాలని చూడడం దారుణమన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరిగిన దాడులు, వేధింపులను ప్రజలు మరచిపోలేదన్నారు. టీడీపీ కీచకుల పార్టీగా మారిపోయిందని, ఆ పార్టీ నాయకులు మృగాళ్లలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ కార్యకర్త కుమార్తెను ఆ పార్టీ నాయకుడే కాలయముడిగా మారి ప్రాణాలు తీసుకోవడానికి కారణమయ్యాడని, అలాంటి దుర్మార్గుడిని రక్షించాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని చంద్రబాబును పోతుల సునీత ప్రశ్నించారు.

ఆ భూములపై రైతులకే హక్కులు

- రాయదుర్గం సోలార్‌ పార్క్‌ కోసం భూములను సేకరించడం లేదు
- అది లీజు అగ్రిమెంటు మాత్రమే
- కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమన్న నెడ్‌క్యాప్‌

సాక్షి, అమరావతి: రాయదుర్గం సోలార్‌ పార్క్‌ కోసం రైతుల నుంచి భూములను సేకరించడం లేదని, ప్రభుత్వం కేవలం లీజు అగ్రిమెంట్‌ మాత్రమే చేసుకుంటోందని ఆంధ్రప్రదేశ్‌ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ) స్పష్టం చేసింది. దీనికి సంబంధించి కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదని స్పష్టం చేస్తూ నెడ్‌క్యాప్‌ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

- రైతులకు ఆ భూములపై పూర్తి హక్కులుంటాయి. ఎకరానికి ఏటా ఇచ్చే లీజును ప్రభుత్వం రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పెంచి రైతులకు సోలార్‌ పార్కు ద్వారా అధిక ఆదాయం సమకూరేలా చేసింది. రైతులకు ఇంత అధిక ఆదాయం వచ్చేలా చేస్తుంటే ప్రతిపక్షం రైతులకు ద్రోహం చేసేలా వ్యవహరించడం బాధ్యతారాహిత్యం.
- రైతుల ఆదాయం పెంచేలా ప్రభుత్వం పాలసీ తెచ్చింది. రైతుల నుంచి లీజుకు తీసుకునే భూమికి ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు చెల్లించడమే కాకుండా ప్రతి రెండేళ్లకు ఐదు శాతం పెంచుతుంది. భూములను లీజుకు తీసుకోవడంలో నెడ్‌క్యాప్‌ నోడల్‌ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. రైతులు పూర్తిగా అంగీకారం తెలిపాకే లీజుకు తీసుకుంటోంది. రాష్ట్రంలో నాలుగు సోలార్‌ పార్కులను అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌ సోలార్‌ పవర్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (ఏపీఎస్పీసీఎల్‌) జాయింట్‌ వెంచర్‌ కంపెనీ ఏర్పాటైంది.
- నెడ్‌క్యాప్‌ అనుభవం లేని సంస్థ అనడంలో అర్థంలేదు. నెడ్‌క్యాప్‌ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సంస్థ. దీర్ఘకాలంగా పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల్లో పనిచేస్తోంది.

మహానది టు కావేరి వయా గోదావరి!

సాక్షి, అమరావతి: మహానది–గోదావరి–కృష్ణా–పెన్నా–కావేరి నదుల అనుసంధానం ద్వారా 477 టీఎంసీలను వినియోగించుకోవచ్చని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ కేంద్రానికి ప్రతిపాదించింది. మహానది నుంచి 230, గోదావరి నుంచి 247 టీఎంసీలను తరలించడం ద్వారా ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో సరఫరా చేయొచ్చంది. అనుసంధానంపై ఏకాభిప్రాయానికి ఆ నదుల పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర జల్‌ శక్తి శాఖ నిర్ణయించింది.

మహానది – గోదావరి అనుసంధానం ఇలా..

ఒడిశాలో బర్మూర్‌ నుంచి 408 టీఎంసీల మహానది జలాలను గోదావరికి మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఇందులో 178 టీఎంసీలను ఒడిశా చేపట్టిన ఐదు ప్రాజెక్టులకు కేటాయించింది. మిగతా 230 టీఎంసీలను ధవళేశ్వరం బ్యారేజీకి ఎగువన గోదావరిలోకి తరలిస్తారు.

గోదావరి–కావేరి అనుసంధానం ఇలా..

జూన్‌ నుంచి అక్టోబర్‌ మధ్య 143 రోజుల్లో ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా(నాగార్జునసాగర్‌), పెన్నా (సోమశిల), కావేరి (గ్రాండ్‌ ఆనకట్ట)కి తరలించడం ద్వారా గోదావరి-కావేరిలను అనుసంధానించేలా ఎన్‌డబ్ల్యూడీఏ గతేడాది ఏప్రిల్‌లో డీపీఆర్‌ను సిద్ధం చేసింది. దీనిపై ఆ నదుల పరిధిలోని రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతోంది. ఈ 247 టీఎంసీల గోదావరి జలాలకు మహానది నుంచి గోదావరిలోకి వచ్చిన 230 టీఎంసీలను జతచేసి.. మొత్తం 477 టీఎంసీలను మహానది–గోదావరి–కృష్ణా–పెన్నా–కావేరి అనుసంధానం ద్వారా తరలించాలని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది.

రాళ్లేయడమే లక్ష్యమా?

▶ మొదటి పేజీ తరువాయి

నైజీరియా, జింబాబ్వే అంటూ యాగీ చేస్తున్నారని దుయ్యబట్టారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని యనమలకు సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై టీడీపీ ఆరోపణలను ఖండిస్తూ బుగ్గన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇబ్బందులున్నా వెనుకంజ వేయలేదు..

సానుకూల దృక్పథం చంద్రబాబు బృందం డిక్షనరీలోనే లేదు. కోవిడ్‌తో ప్రపంచమంతా అల్లాడిన 2020–21 ఆర్థిక పరిస్థితి గురించే యనమల పదేపదే మాట్లాడుతుంటారు. కోవిడ్‌తో జనజీవితం అతలాకుతలం అయింది. ఆదాయ వనరులకు గండి పడింది. కరోనా వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం సుమారు రూ.8 వేల కోట్లు తగ్గింది. మహమ్మారి కట్టడి, వైద్య సదుపాయాలు, టెస్టింగ్‌, కోవిడ్‌ కేర్‌ సెంటర్ల నిర్వహణ, ఉచిత బియ్యం సరఫరాకు ప్రభుత్వం అదనంగా రూ.7,130 కోట్లు వ్యయం చేసింది. ఇలాంటి పరిస్థితిలోనూ నవరత్నాల అమలులో ఎక్కడా వెనకడుగు వేయలేదు.

నాడు అసాధారణ అప్పులు..

ఐదేళ్ల టీడీపీ హయాంలో అప్పులు 19.6% పెరిగితే వైఎస్సార్‌సీపీ పాలనలో మూడేళ్లలో పబ్లిక్‌ సెక్టార్‌ యూనిట్లు తీసుకున్న అప్పులతో కలిపి (రెండేళ్లు కోవిడ్‌ కష్టాలున్నప్పటికీ) 15.5% మాత్రమే పెరిగాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకున్నా 19.6% వృద్ధితో అప్పులు చేశారు. గత సర్కారుతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ ఎంతో మెరుగ్గా ఉంది.

డీబీటీతో రూ.57,512 కోట్లు

రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు కరోనా వేళ ఉపాధి కోల్పోయి ఇళ్ల నుంచి కదలలేకపోయారు. వారి ప్రాణాలను కాపాడుకుంటూనే డీబీటీ ద్వారా నేరుగా రూ.57,512 కోట్లు పారదర్శకంగా జమ చేసి ఆదుకున్నాం. ప్రభుత్వం ఇంత మొత్తాన్ని ప్రజలకు అందించడం కోవిడ్‌ సమయంలో ఎక్కడా లేదు. అయినా ఆర్థిక పరిస్థితి దిగజారిందంటూ యనమల పదేపదే బురద చల్లుతున్నారు. కరోనా చెలరేగిన 2020–21 గురించి కాకుండా 2021–22 గురించి టీడీపీ నేతలు ఎందుకు మాట్లాడరు?

ఆ నిర్వాకాలతోనే ఆంక్షలు

గత సర్కారు ఆర్థిక ఉల్లంఘనలు, అవకతవకలు కాగ్‌ నివేదికలో స్పష్టంగా ఉన్నాయి. టీడీపీ పాలనలో ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.17,000 కోట్లు అదనంగా అప్పు చేయటాన్ని కేంద్ర ఆర్థిక శాఖ గుర్తించి తీవ్రంగా తప్పుబట్టింది. గత సర్కారు నిర్వాకాలను కారణంగా చూపిస్తూ ఇప్పుడు రుణ పరిమితిపై ఆంక్షలు విధిస్తోంది.

యనమలవి పచ్చి అబద్ధాలు

రాష్ట్ర అప్పులు రూ.8,00,000 కోట్లు అనే లెక్కలు యనమలకు ఎక్కడ నుంచి వచ్చాయో మాకు తెలియదు. అది పచ్చి అబద్ధం. గణాంకాలతో వాటిని రుజువు చేయగలరా? పబ్లిక్‌ సెక్టార్‌ యూనిట్లు తీసుకున్న వాటితో కలిపి రాష్ట్ర అప్పు రూ.1,71,176 కోట్లు మాత్రమే. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. 2019లో టీడీపీ సర్కారు దిగిపోతూ పెండింగ్‌లో పెట్టిన రూ.40,000 కోట్ల బిల్లులు పెనుభారంగా మారాయి. విద్యుత్తు కొనుగోలు, పంపిణీ సంస్థలకు సంబంధించిన అప్పు రూ.46,200 కోట్ల మేర అదనంగా పెంచేసి విద్యుత్తు రంగాన్ని కోలుకోలేని రీతిలో దెబ్బతీశారు. దురదృష్టకరమైన రాష్ట్ర విభజన, టీడీపీ అస్తవ్యస్త పాలన, కోవిడ్‌ వల్ల దెబ్బతిన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నాం.

నిబంధనల ప్రకారమే..

ఆయా ప్రభుత్వాల ఆర్థిక అవసరాలను బట్టి ఎన్నిసార్లైనా వేస్‌ అండ్‌ మీన్స్‌కు వెళ్లవచ్చు. ఆది ఆర్బీఐ కల్పించిన సదుపాయం. మేం నిబంధనలకు విరుద్ధంగా వెళ్తే ఎందుకు అనుమతిస్తుంది? ఓవర్‌ డ్రాఫ్ట్‌ అదనపు అప్పు కాదు. 2018 –19లో ఒకసారికి రూ.1,510 కోట్లు ప్రకారం 144 రోజులకు ఓడీకి అనుమతిస్తే రూ.19,654 కోట్లు తీసుకున్నారు. అంటే 107 రోజులు (74.30%) ఓడీ పొందారు. 2019 20లో ఒకసారికి రూ.1,510 కోట్లు ప్రకారం 144 రోజులు ఓడీకి అనుమతిస్తే రూ.17,631 కోట్లు తీసుకున్నాం. అంటే 57 రోజులు (39.58%) ఓడీ పొందాం 2020 –21లో ఒకసారికి రూ.2,416 కోట్లు ప్రకారం 200 రోజులు ఓడీకి అనుమతిస్తే రూ.31,812 కోట్లు తీసుకున్నాం. అంటే 103 రోజులు (51.50%) ఓడీ పొందాం. మరి యనమల చెబుతున్న కాకి లెక్కలు (330 రోజులు) ఎక్కడ నుంచి వచ్చాయి?

మెరుగ్గా మూలధన వ్యయం

2014–19లో మూలధన వ్యయం రూ.15,227 కోట్లు కాగా వైఎస్సార్‌సీపీ పాలనలో సగటున రూ.18,362 కోట్లు ఉంది. మూలధన వ్యయాన్ని ప్రధానంగా విద్య, ఆరోగ్యంపై వెచ్చిస్తున్నాం.

అప్పులపై వడ్డీలు – వడ్డీ రేట్లు

టీడీపీ హయాంలో సగటున 8.49% వడ్డీలతో అప్పులు తెస్తే మా ప్రభుత్వం 6.96 శాతానికే అప్పు తెచ్చింది. టీడీపీ సర్కారు ఎడాపెడా చేసిన అప్పులకు ఇప్పుడు వడ్డీలు కడుతున్నాం. గత సర్కారు రకరకాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అప్పుల రూపంలో ప్రజాధనాన్ని పక్క దోవ పట్టించలేదా? రైతు సాధికార సంస్థ, ఏపీ సివిల్‌ సప్లయిస్‌ కార్పొరేషన్‌, రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌, పవర్‌ సెక్టార్‌, డ్రింకింగ్‌ వాటర్‌ కార్పొరేషన్ల పేరుతో టీడీపీ సర్కారు అప్పులను దారి మళ్లించడం నిజం కాదా? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయికీ లెక్క ఉంది. నేరుగా రూ.1,70,000 కోట్లను ప్రజలకు పారదర్శకంగా అందచేసింది.

విద్యా కానుక.. ఇక మరింత మెరుగ్గా

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలు తీసుకున్నారు. కార్పొరేట్‌ స్కూళ్ల విద్యార్థులకు దీటుగా పాఠ్య పుస్తకాలు, యూనిఫారంతో పాటు నోట్సులు, వర్కు బుక్కులు, షూలు, సాక్సులు, బెల్టులు, బ్యాగులు అందించేలా జగనన్న విద్యా కానుక పథకానికి శ్రీకారం చుట్టారు.

- రెండు జతల యూనిఫారం కాకుండా మూడు జతలు అందిస్తున్నారు. దీనికి అదనంగా విద్యార్థులకు ఇంగ్లిష్‌, తెలుగు డిక్షనరీలను పంపిణీ చేయిస్తున్నారు. 2020–21లో 42,34,322 మంది విద్యార్థులకు రూ.648.10 కోట్లతో, 2021–22లో 45,71,051 మందికి రూ.789.21 కోట్లతో, 2022–23లో 4,740,421 మందికి రూ.931.02 కోట్లతో జగనన్న విద్యా కానుకను అందించారు. మూడేళ్లలో ఈ వస్తువుల కోసం రూ. 2,368.33 కోట్లు వెచ్చించారు.
- అయితే వేలాది స్కూళ్లలో లక్షలాది మంది విద్యార్థులకు పంపిణీకి సంబంధించిన కార్యక్రమం కావడంతో క్షేత్ర స్థాయిలో అక్కడక్కడ చిన్న చిన్న లోపాలు తలెత్తడం సహజం. వాటిని ఎప్పటికప్పుడు విద్యా శాఖ అధికారులు పరిష్కరిస్తున్నారు. మౌలికమైన అంశాల్లో కూడా ఏమైనా సమస్యలు ఉంటే వాటినీ పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నారు.
- ఇలా ఏటేటా ఈ పథకాన్ని మరింత పగడ్బందీగా అమలు చేసేందుకు ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల నుంచి కూడా అభిప్రాయాలు తీసుకుంటున్నారు. తాజాగా వారి నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఇకపై మరింత నాణ్యమైన వస్తువులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

■ తిరుపతికి చెందిన వంశీ అనే విద్యార్థి ఇప్పుడు ఆరవ తరగతి చదువుతున్నాడు. ఒబేసిటీ కారణంగా ఈ విద్యార్థిలావుగా ఉంటాడు. దీంతో ప్రభుత్వం ఈ ఏడాది ఇచ్చిన యూనిఫారంతో మూడు జతల డ్రస్‌ కుట్టించడం వీలు పడలేదు. రెండు జతలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇలాంటి విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ ఉండొచ్చు. ఇలా ఒకరిద్దరికి క్లాత్‌ సరిపోనంత మాత్రాన.. అందరికీ సరిపోలేదని దుష్ప్రచారం చేసే ప్రబుద్ధులున్నారు. అందువల్ల ఇకపై ఇలాంటి చిన్న చిన్న సమస్యలు కూడా తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇకపై మార్పులు ఇలా..

- అన్ని ఊళ్లలో ఒక్కో తరగతిలో ఒకరో ఇద్దరో పిల్లలు లావుగా ఉండొచ్చు. వారికి యూనిఫాం క్లాత్‌ సరిపోకపోయి ఉండొచ్చు. ఇకపై ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని అందరికీ సరిపడా రీతిలో మూడు జతల యూనిఫారం క్లాత్‌ ఇచ్చేందుకు చర్యలు.
- కుట్టు కూలీ మరింత పెంచి ఇచ్చే విషయమూ విద్యా శాఖ పరిశీలన చేస్తోంది.
- బ్యాగుల పరిమాణంపై నిపుణుల సూచనల మేరకు మార్పులు చేయిస్తోంది. 1–5 తరగతుల విద్యార్థులకు మీడియం సైజు, 6–10 తరగతుల విద్యార్థులకు పెద్ద సైజు బ్యాగులు అందించనున్నారు. ఈసారి బ్యాగు వెడల్పు పెంచనున్నారు.
- బ్యాగులో నోట్‌బుక్కులు, పాఠ్య పుస్తకాలు అన్నీ పట్టేలా కొత్త టెండర్‌లో స్పెసిఫికేషన్లు సవరించనున్నారు.
- పిల్లల షూ సైజులను తీసుకొనేందుకు మండల స్థాయిలో ఆయా కంపెనీల ద్వారా షూ మేళాలు నిర్వహించేలా చేయడమో, లేదా కూపన్లు అందించి ఆయా కంపెనీల దుకాణాలలో వాటిని రీడీమ్‌ చేసుకొని షూలు పొందేలా చేయడమో చేయాలని ప్రతిపాదించారు.
- విద్యా కానుక పంపిణీలో జాప్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేకుండా ఇప్పటి నుంచే విద్యా శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. బడ్జెట్‌ ఎస్టిమేట్లను త్వరగా పూర్తి చేసి ఆర్థిక అనుమతులు పొందడం, టెండర్‌ డాక్యుమెంట్లు ఫైనల్‌ చేయడం, టెండర్లను పిలవడం, కంపెనీల ఎంపిక, వర్కు ఆర్డర్ల జారీ, ఒప్పందాలు చేసుకోవడం వంటివి ఈ ఏడాది నవంబర్‌ చివరికల్లా ముగించాలని భావిస్తున్నారు.
- వచ్చే ఏడాది ఏప్రిల్‌ మొదటి వారానికి జిల్లా.. మండల స్థాయికి ఆయా వస్తువులను చేర్చడం. ఏప్రిల్‌ 15 నాటికి కిట్ల రూపంలో వాటిని సిద్ధం చేయడం. పాఠశాలలు తెరిచే రోజున విద్యార్థులందరికీ వాటిని పంపిణీ చేయించడం. వచ్చే ఏడాది విద్యా కానుక అమలు కోసం రూ.958.34 కోట్లు అవసరమవుతాయని విద్యాయ శాఖ అంచనా వేసింది.

2023-24లో జగనన్న విద్యా కానుక అంచనా

కేటగిరీ	విద్యార్థులు	వస్తువులు	నిధులు (రూ.కోట్లలో)
నోట్‌బుక్స్‌ (6-10 తరగతులు)	23,11,951	2,40,92,886	1,04,80,40,541
బెల్టులు	29,56,188	29,56,188	10,34,66,580
(1-10 బాలురు, 1-5 బాలికలు)			
షూలు	41,38,322	41,38,322	82,76,64,400
బ్యాగులు (1-5)	18,26,371	18,26,371	47,41,25,911
బ్యాగులు (6-10)	23,11,951	23,11,951	62,74,63,501
యూనిఫారం వస్త్రం (1-8)	32,03,801	--	2,75,18,40,793
యూనిఫారం వస్త్రం (9-10)	9,34,521	--	1,36,79,79,875
డిక్షనరీ (1-5)	3,07,251	3,07,251	2,13,44,726
డిక్షనరీ (6-10)	4,56,393	4,56,393	7,66,74,024
టెక్ట్స్‌ బుక్స్‌ (1-8)	32,03,801	2,82,28,176	1,22,56,67,402
టెక్ట్స్‌ బుక్స్‌ (9-10)	9,34,521	79,75,590	51,12,35,319
వర్కు బుక్స్‌ (1-5)	18,26,371	1,55,94,375	54,79,86,337

నేటి నుంచి డ్యామ్‌ల భద్రతపై అంతర్జాతీయ సదస్సు

సాక్షి, అమరావతి : వరద నియంత్రణ, జలాశయాల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర జల్‌ శక్తి శాఖ ఆధ్వర్యాన జైపూర్‌లో సోమవారం నుంచి మూడు రోజులు అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల స్టేట్‌ డ్యామ్‌ సేఫ్టీ ఆర్గనైజేషన్‌ (ఎస్‌డీఎస్‌వో) చీఫ్‌ ఇంజనీర్ల నేతృత్వంలోని అధికారుల బృందాలు, ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల జలవనరుల శాఖల అధికారులు, నిపుణులు పాల్గొంటారు. దేశంలో ఏకరీతి నిబంధనలను రూపొందించి జలాశయాలకు మరింత భద్రత చేకూర్చేందుకు డ్యామ్‌ సేఫ్టీ యాక్ట్‌(జలాశయాల భద్రత చట్టం)ను కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం అమలులో భాగంగా జాతీయ స్థాయిలో నేషనల్‌ కమిటీ ఆన్‌ డ్యామ్‌ సేఫ్టీ (ఎన్‌సీడీఎస్‌)ని ఏర్పాటు చేసింది. కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ఎస్‌డీఎస్‌వోలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పాటు చేశాయి. ఈ రెండు కమిటీలు సమన్వయంతో పనిచేసి జలాశయాలకు ఎలాంటి వరద ముప్పు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం అంతర్జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పాల్గొనేందుకు ఎస్‌డీఎస్‌వో సీఈ కుమార్‌, ఒంగోలు ప్రాజెక్ట్స్‌ సీఈ మురళీనాథ్‌రెడ్డి, నార్త్‌ కోస్ట్‌ సీఈ సుగుణాకర్‌రావు నేతృత్వంలో బృందం జైపూర్‌కు చేరుకుంది.

ఈ-గవర్నెన్స్‌లోనూ అదుర్స్

దేశంలో టాప్-10 రాష్ట్రాల్లో ఏపీకి నాలుగో స్థానం



సాక్షి, అమరావతి: గత ఆర్థిక సంవత్సరం (2021–22)లో దేశవ్యాప్తంగా ఈ–గవర్నెన్స్ అమలులో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. టాప్–10 రాష్ట్రాలకు తొలి మూడు స్థానాల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వరుసగా నిలిచాయి. పశ్చిమ బెంగాల్ అత్యధికంగా 136.07 కోట్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలతో తొలి స్థానంలో నిలవగా ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ 109.27 కోట్లతో రెండో స్థానంలోనూ.. 84.23 కోట్లతో తమిళనాడు మూడో స్థానంలో నిలిచినట్లు నివేదిక వెల్లడించింది. అదే ఏపీలో 52.90కోట్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలు జరిగినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది.

ఆరు కేటగిరీలుగా ఎలక్ట్రానిక్ సేవలు

ఇక ఎలక్ట్రానిక్ సేవల లావాదేవీలను ఆరు కేటగిరీలుగా నివేదిక వర్గీకరించింది. చట్టబద్ధమైన, చట్టబద్ధతలేని సేవలు, బిజినెస్ సిటిజన్ సేవలు, సమాచార సేవలు, మొబైల్ గవర్నెన్స్, యుటిలిటీ బిల్లుల చెల్లింపులు, సామాజిక ప్రయోజనాలుగా వర్గీకరించింది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ 52.90 కోట్ల ఎలక్ట్రానిక్ సేవల లావాదేవీలను నిర్వహించినట్లు నివేదిక వెల్లడించింది. ఇందులో చట్టబద్ధత, చట్టబద్ధతలేని సేవల లావాదేవీలు 4.16 కోట్లని నివేదిక పేర్కొంది. ఇక యుటిలిటీ బిల్లుల చెల్లింపుల లావాదేవీలు 10.76 కోట్లు.. సమాచార సేవల లావాదేవీలు 4.13 కోట్లు.. సామాజిక ప్రయోజనాల లావాదేవీలు 33.83 కోట్లు.. బిజినెస్ సిటిజన్ సేవల లావాదేవీలు 23 వేలు నిర్వహించినట్లు నివేదిక పేర్కొంది.

ఎలక్ట్రానిక్ విధానంలోనే ఏపీలో పాలన

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలన్నింటినీ కంప్యూటర్ల ద్వారానే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేకంగా డిజిటల్ కార్యదర్శులను నియమించారు. గ్రామ, వార్డు సచివాలయాల నుంచి రాష్ట్ర సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల వరకు పరిపాలన ఎలక్ట్రానిక్ లావాదేవీల ద్వారానే కొనసాగుతోంది. ప్రజలకు అన్ని సేవలను ఎలక్ట్రానిక్ లావాదేవీల ద్వారానే ప్రభుత్వం నిర్వహిస్తోంది. నవరత్నాల్లోని పథకాల లబ్ధిదారులందరికీ ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే కంప్యూటర్‌లో బటన్ నొక్కడం ద్వారా నేరుగా నగదు బదిలీ జరుగుతోంది. ఈ లావాదేవీలను సామాజిక ప్రయోజనాలుగా నివేదిక వర్గీకరించింది. దీంతో ఈ–గవర్నెన్స్‌లో ఏపీ నాలుగో స్థానం సాధించినట్లు నివేదిక వెల్లడించింది.

2021-22లో దేశంలోని టాప్-10 రాష్ట్రాల్లో ఈ-లావాదేవీల వివరాలిలా.. (కోట్లలో)

రాష్ట్రం	సంఖ్య
పశ్చిమ బెంగాల్	136.07
ఉత్తరప్రదేశ్	109.27
తమిళనాడు	84.23
ఆంధ్రప్రదేశ్	52.90
మహారాష్ట్ర	43.21
తెలంగాణ	41.84
బీహార్	40.41
గుజరాత్	37.04
రాజస్థాన్	35.74
హరియాణ	32.40

సకలజన ఉద్యమం కావాలి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



అనకాపల్లి టౌన్: మూడు రాజధానులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు న్యాయం జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు ఇందుకోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. తెలంగాణలో సకలజన ఉద్యమం జరిగిన స్థాయిలో అందరూ కదిలిరావాలని కోరారు. అనకాపల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వికేంద్రీకరణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీ నామా చేయడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమవి దొంగ రాజీనామాలని వ్యాఖ్యానించడం తగదన్నారు. అమరావతి కొందరిది.. విశాఖ అందరిది.. అనే నినాదంతో ఉమ్మడి విశాఖ జిల్లా జేఏసీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈనెల 10 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

వికేంద్రీకరణకే బీసీల మద్దతు

రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్



మాట్లాడుతున్న డాక్టర్ మారేష్

పటమట (విజయవాడ తూర్పు): మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మారేష్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమట ఆర్టీసీ కాలనీలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో 'పరిపాలన వికేంద్రీకరణతోనే బీసీల అభివృద్ధి' అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి బీసీ సామాజికవర్గానికి చెందిన 25కు పైగా కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మారేష్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఉత్తరాంధ్ర జనాభాలో 70 శాతానికి పైగా బీసీలున్నారని, విశాఖను పరిపాలన రాజధానిగా చేయడం వల్ల ఆ నగరానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో బీసీలు ఆర్థికంగా లబ్ధి పొందుతారని, పరిపాలనలో భాగస్వాములవుతారని, యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు. సీఎం వైఎస్ జగన్ తీసుకునే ప్రతి నిర్ణయంలో సామాజిక న్యాయం ఉంటోందన్నారు. బీసీ సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఓర్సు బాలా, రజక సంఘం నాయకులు రేగళ్ల శ్రీనివాసరావు, వడ్డెర సంఘం నేతలు రామాంజనేయులు ప్రసంగించారు.

అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సీతమ్మధార (విశాఖ ఉత్తర): అభివృద్ధి వికేంద్రీకరణకు తమ పార్టీ కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రజాపోరు సభలు ముగిసిన సందర్భంగా ఆదివారం సీతమ్మధారలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపోరు సభలకు 10 లక్షల మంది హాజరయ్యారని చెప్పారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఈ సమావేశంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి మాధవ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి జి.మధుకర్, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలది రాజీనామా డ్రామా: విష్ణువర్ధన్

కర్నూలు కల్చరల్: మూడు రాజధానులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలది రాజీనామా డ్రామాలా ఉందని.. చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలులో ఆదివారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. స్పీకర్ ఫార్మాట్‌లో ఎమ్మెల్యేలు రాజీనామా చేయకపోవడం అంటే వారిలో చిత్తశుద్ధి లేకపోవడమేనన్నారు. టీడీపీ కూడా డ్రామాలాడుతోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేల కంటే టీడీపీ ఎమ్మెల్యేలు ముందుగా రాజీనామా చేస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. కరోనా సమయంలో ఏపీ అంబులెన్సులు తెలంగాణలోకి రానివ్వకుండా అడ్డుకున్న కేసీఆర్.. ఇప్పుడు బీఆర్ఎస్ పేరుతో జాతీయ పార్టీ పెడతాడంట.. అంటూ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ ఏపీ ప్రజలకు క్షమాపణ చెప్పి రాష్ట్రంలో అడుగు పెట్టాలన్నారు.

ఉత్తరాంధ్రలో పాదయాత్రను విజయవంతం చేస్తాం: బండారు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో అమరావతి రైతుల యాత్రకు స్వాగతం పలికి విజయవంతం చేసి తీరతామని టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, అందుకే రాజీనామా డ్రామాలు ఆడుతున్నారన్నారు.

జనం చూపు వికేంద్రీకరణ వైపు

▶ మొదటి పేజీ తరువాయి

అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఒకే రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు అనే నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. వికేంద్రీకరణకు మద్దతుగా అల్లూరి జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పోరాటానికి ముందుకు రావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. త్వరలోనే జిల్లాలో నాన్ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు చేసి, వికేంద్రీకరణకు మద్దతుగా పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు.



నిడదవోలులో వికేంద్రీకరణకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు, మేధావులు

వికేంద్రీకరణతోనే అభివృద్ధి

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నారు. మూడు రాజధానులతోనే అభివృద్ధి సాధ్యం. దేశంలో అనేక ప్రాంతాల ప్రజలు తమ రాష్ట్రాల్లో వికేంద్రీకరణను కోరుకుంటున్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా జరిగే పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నాను.

– గొడ్డేటి మాధవి, అరకు ఎంపీ

వికేంద్రీకరణను అడ్డుకోవడం తగదు

రాష్ట్రంలో వికేంద్రీకరణ ద్వారా మూడు ప్రాంతాల్లో రాజధానుల ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటే ఓర్వలేక చంద్రబాబు అడ్డుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పోలవరం ముంపు గ్రామాలను పట్టించుకోని చంద్రబాబు అమరావతిలోని రైతుల కోసం మాత్రమే మాట్లాడడం దారుణం. విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటును గిరిజనులంతా స్వాగతిస్తున్నారు.

– నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే

విశాఖ రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి

విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేయడం ద్వారా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుంది. అమరావతిలో కొంతమంది రైతులు చేస్తున్న అమరావతి రాజధాని ఉద్యమం వెనుక అనేక కుట్రలు ఉన్నాయి. గతంలో హైదరాబాద్‌ను ఏకైక రాజధానిగా అభివృద్ధి చేయడం వల్ల ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వెనుకబడి పోయాయి. ఆ పరిస్థితి మళ్లీ తలెత్తకుండా మూడు రాజధానుల ఏర్పాటును స్వాగతిస్తున్నాం.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

చంద్రబాబు నాటకాలు ప్రజలకు తెలుసు

అమరావతి రైతుల పాదయాత్ర పేరుతో టీడీపీ నాయకులు ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు. నాడు అమరావతికి భూములు ఇవ్వడానికి రైతులు వ్యతిరేకత చూపారు. వారిని చంద్రబాబు మోసం చేశారు. మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి.

– బూరుగుపల్లి సుబ్బారావు, తూర్పు గోదావరి జిల్లా రైతు సలహా మండలి చైర్మన్

ఒక్క రాజధానితో బాబుకే లాభం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయానికి అన్ని ప్రాంతాల ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. అభివృద్ధి మొత్తం ఒకే ప్రాంతానికి పరిమితమైతే మిగిలిన ప్రాంతాలు నష్టపోతాయి. అమరావతి వల్ల చంద్రబాబు, ఆయన అనుచర గణానికి మాత్రమే ఉపయోగం ఉంటుంది. 5 వేల ఎకరాలు రాజధాని కోసం సరిపోతుంది. అయితే చంద్రబాబు 35–40 వేల ఎకరాలు ఎందుకు తీసుకున్నారో సమాధానం చెప్పాలి. రైతులు నష్టపోకూడదని సీఎం జగన్ అక్కడి రైతులందరికీ కౌలు ఇస్తున్నారు.

– జి.శ్రీనివాసనాయుడు, నిడదవోలు ఎమ్మెల్యే

వికేంద్రీకరణతోనే సుపరిపాలన

వికేంద్రీకరణతోనే సుపరిపాలన సాధ్యమవుతుంది. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం సీఎం జగన్ మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నారు. చంద్రబాబు తన బినామీల సౌలభ్యం కోసం అమరావతి పాదయాత్ర చేయిస్తున్నారు. అమరావతిని రాజధానిగా ప్రకటించక ముందే టీడీపీ నాయకులు, వారి వర్గీయులు భూములు కొన్నారు. ఇప్పుడు వారు నష్టపోకూడదనే దొంగ యాత్రలకు శ్రీకారం చుట్టారు.

– భూపతి ఆదినారాయణ, మున్సిపల్ చైర్మన్, నిడదవోలు

జార్ఖండ్‌లో నాలుగు రాజధానులు

వికేంద్రీకరణపై సీఎం జగన్‌ను అభినందిస్తూ జార్ఖండ్ సీఎం కూడా వికేంద్రీకరణకు సిద్ధమయ్యారు. జార్ఖండ్‌లో నాలుగు ప్రధాన పట్టణాలను గుర్తించి రాజధానుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. మూడు రాజధానుల ఏర్పాటుతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. గిరిజన ప్రాంతాల ప్రజలంతా మూడు రాజధానులను కోరుకుంటున్నారు.

– కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే

వికేంద్రీకరణకు రెడ్డి జేఏసీ మద్దతు



వికేంద్రీకరణకు మద్దతు ప్రకటిస్తున్న జేఏసీ నేతలు

రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ప్రకటన

సింహాచలం(విశాఖపట్నం): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి, కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం ఏర్పాటుకు తాము మద్దతు ఇస్తున్నామని రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకటించారు. రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఆత్మీయ కలయిక ఆదివారం విశాఖపట్నం జిల్లా సింహాచలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రెడ్డి జేఏసీ గౌరవాధ్యక్షుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడిగా, ఆయన ఆశయసాధకుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.1.67లక్షల కోట్ల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వేర్పాటువాదం తలెత్తకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతోనే మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధాని అయితే ముంబయితో సమానంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులంతా వికేంద్రీకరణకు, విశాఖపట్నం రాజధానిగా ఏర్పాటుకు తమ మద్దతు ప్రకటించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి 'భారతరత్న' ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు మారం బాలబ్రహ్మానందరెడ్డి, వ్యవస్థాపక చైర్మన్ నవల్ల సత్యనారాయణరెడ్డి, వాస్తు సిద్ధాంతి కేవీ రెడ్డి, డాక్టర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.వెంకటరావురెడ్డి, ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ మాజీ చైర్మన్ కొయ్య ప్రసాదరెడ్డి, జాతీయ ఓసీ సంఘ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి, ఏపీ ఉమెన్స్ ఫైనాన్స్ కో–ఆపరేటివ్ చైర్‌పర్సన్ బల్లాడ హేమమాలిని రెడ్డి, రాష్ట్ర సిడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, విశాఖ–గోదావరి రెడ్డీస్ అసోసియేషన్ నాయకుడు సత్తి వీరరాఘవరెడ్డి, గౌతమి ఫైనాన్షియర్స్ అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, ఎస్ఆర్ షాపింగ్ మాల్స్ అధినేత ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి, కాకి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన పిల్లలను నాయకులు అభినందించి బహుమతులు అందించారు.

వెనుకబడిన ఉత్తరాంధ్రలో రాజధాని అవసరం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆరిలోవ (విశాఖ తూర్పు): ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో పరిపాలన రాజధాని అవసరమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. విశాఖపట్నం ఆరిలోవ ప్రాంతంలో ఆదివారం ఒక ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాలన వికేంద్రీకరణలో భాగంగా విశాఖలో రాజధాని ఏర్పాటుకు పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ఆలోచన సరైనదేనని చెప్పారు. విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటుచేస్తే అన్ని రంగాల్లో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే దూరదృష్టితో సీఎం ఆలోచిస్తున్నారన్నారు. ఎప్పటినుంచో ఉత్తరాంధ్ర వెనుకబడి ఉందన్నారు. వెనుకబాటుతనం, ఆకలి మంటల కారణంగా ఈ ప్రాంతంలో ఉద్యమకారులు పుట్టారని తెలిపారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం గురించి న్యాయమూర్తులు, మేధావులు, విద్యావేత్తలు ఆలోచించాలని కోరారు. ఉత్తరాంధ్రకు రాజధాని వద్దంటూ పాదయాత్రగా అరసవల్లి సూర్యనారాయణమూర్తిని కోరడానికి రావడం విడ్డూరంగా ఉందని చెప్పారు. విశాఖలో రాజధాని ఏర్పాటు విషయంలో ఒక్క ఇంచ్ కూడా వెనక్కి తగ్గేదిలేదని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొన్నారు.

రాజీనామా చేసి గెలిచే దమ్ముందా బాబూ..

742వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



రిలే దీక్షల్లో బహుజన నేతలు

తాడికొండ: మూడు రాజధానులు వద్దని టీడీపీ ప్రజా ప్రతినిధులతో రాజీనామాలు చేయించి మళ్లీ గెలిచే దమ్ముందా చంద్రబాబూ.. అని బహుజన పరిరక్షణ సమితి నేతలు సవాల్ విసిరారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 742వ రోజు కూడా కొనసాగాయి. ఈ దీక్షలో పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ నేతలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐడియాలజీతో అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి కోసం మూడు రాజధానులకు కట్టుబడి రాజీనామాలకు సిద్ధపడ్డారని, మరి బాబు అండ్ కో ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, కులవాదంతో ఓ సామాజిక వర్గం చేస్తున్న దొంగ యాత్రలను నిలిపివేయకపోతే ప్రజలు అడ్డుకుని తరిమి కొట్టడం ఖాయమన్నారు. రాష్ట్రంలో మరే ప్రజా సమస్యలు లేనట్లు అమరావతి పేరుతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అత్యంత ఖరీదైన పాదయాత్ర చేస్తున్న వారిలో అసలు రైతులే లేరనేది స్పష్టమైందన్నారు. రాజధానిని తమ కనుసన్నల్లో నిర్మించుకుని తరతరాల పెత్తనం కోసం అర్రులు చాస్తున్న కులవాదుల ఆగడాలు ఎప్పటికీ ఫలించవన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానుల కోసం దేనికైనా సిద్ధం

కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



కర్నూలు(సెంట్రల్): అభివృద్ధి వికేంద్రీకరణ, మూడు రాజధానుల కోసం 151 మంది ఎమ్మెల్యేలు దేనికైనా సిద్ధంగా ఉన్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ చెప్పారు. ఆయన ఆదివారం కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ అన్ని ప్రాంతాల ప్రజల అభిప్రాయం తీసుకున్న తరువాతే మూడు రాజధానుల కోసం ముందుకెళ్లారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీరు చూస్తుంటే ఆయన అమరావతిలో భూములు కొన్నట్టు అర్థమవుతోందన్నారు. అందుకోసమే చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. కర్నూలుకు హైకోర్టును తరలించే విషయంలో ఒక్కమాట మాట్లాడని రామకృష్ణ.. అమరావతి కోసం రోజూ టీవీ చానళ్లలో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జేఏసీగా ఏర్పడి న్యాయ రాజధాని కోసం పోరాడతామన్నారు.



ప్రతి ఒక్కరూ ప్రపంచాన్ని మార్చడం గురించి ఆలోచిస్తారు. కానీ ఏ ఒక్కరూ తమను మార్చుకోవడం గురించి ఆలోచించరు.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, అక్టోబర్, 10

ఒంటరి సమూహం

సుమారు ఆరు దశాబ్దాలుగా అలుపెరగకుండా రాస్తున్న 'అత్యంత ప్రాధాన్యం గల స్త్రీవాద రచయిత్రి' ఆనీ ఎర్నోను 2022 నోబెల్ సాహిత్య పురస్కారం వరించింది. ఈ గౌరవం దక్కిన తొలి ఫ్రెంచ్ మహిళ ఆమె. ప్రపంచవ్యాప్తంగా ఈ పురస్కారం పొందిన పదిహేడో మహిళ.

సాహిత్యానికి తక్షణ ప్రయోజనం ఉండకపోవచ్చు; అయినా కూడా మహిళలు, అణిచివేతకు గురైనవారి పోరాట గాథలను సజీవంగా ఉంచుతున్నానంటారు 82 ఏళ్ల ఆనీ ఎర్నో. శరీరం, లైంగికత; సాన్నిహిత్య సంబంధాలు; సామాజిక అసమానతలు; చదువు ద్వారా వర్గాన్ని మార్చుకునే ప్రయత్నం ఆమె రచనల్లో కనబడతాయి.

ఫ్రాన్స్‌లోని చిన్న పట్టణం నార్మండీలో వారి కుటుంబం నివసించింది. బతకడానికి నాకు పుస్తకాలు అక్కర్లేదని కరాఖండీగా చెప్పే తండ్రిని కలిగిన అతి సాధారణ నేపథ్యం. ఒక కెఫే యజమానిగా అలెగ్జాండర్ డ్యూమా, ఫ్లొబర్ట్, ఆల్బర్ట్ కామూ లాంటి రచయితలను చదవడం వల్ల తనకేం ఒరుగుతుందని ఆయన నిశ్చితాభిప్రాయం. కానీ ఆనీలో అది పూర్తి విరుద్ధంగా పనిచేసింది. పుస్తకాలు మాత్రమే తనకు అత్యంత ప్రీతికరమైనవనీ, ఎంత చెడ్డ జీవితంలోనూ తనను తాను ఒక 'అ-పాఠకురాలిగా' ఊహించలేననీ అంటారామె. ఆరేళ్ల వయసు నుంచే అక్షరంలోని గమ్మత్తుకు ఆకర్షితురాలయ్యారు. వందలాది పుస్తకాలను ఉచితంగా చదువుకోవడం కోసమే పుస్తకాల షాపులో పనిచేయాలని కలగన్నారు. ఒక శ్రామిక కుటుంబంలో పుట్టి, బుద్ధెరిగాక మధ్యతరగతి జీవితాలతో పోల్చుకున్నప్పుడు తమ పరిస్థితి పట్ల సిగ్గుపడిన ఆనీ ఎర్నో చదువుకోవడం ద్వారా జీవితాలను మార్చుకోగలమన్న అభిప్రాయానికి చాలా త్వరగా వచ్చారు. దానికి అనుగుణంగానే ముందు టీచర్‌గా, అనంతరం లిటరేచర్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

వర్జీనియా వూల్ఫ్ అంటే ఆనీకి పిచ్చి అభిమానం. సైమన్ ది బోవా ఆమె చైతన్యాన్ని విస్తృతపరిచారు. స్త్రీవాదం అనేది తప్పనిసరైనది అన్న అవగాహనతో ఇరవై ఏళ్ల వయసు నుంచే తన రచనా వ్యాసంగం మొదలుపెట్టారు. తన కుటుంబానికి తెలియకుండా చేయించుకున్న అవాంఛిత గర్భస్రావం గురించి 'క్లీన్డ్ ఔట్' రాశారు. ఆ అనుభవంలోని జుగుప్స, భయానకాలకు వెరవకుండా, దీన్నే పునర్దర్శనంలాగా 'హ్యాపెనింగ్' రాశారు. ఒక స్త్రీ తన శరీరం మీద తన నియంత్రణనూ, స్వాతంత్ర్యాన్నీ స్థాపించుకోవడానికి సంబంధించిన అతిముఖ్యమైన నవలగా ఇది నిలిచిపోయింది. తను దాటివచ్చిన జీవిత దశలనే ఆనీ పుస్తకాలుగా మలిచారు. ఆమె కౌమార జీవితం ఒక పుస్తకం. వైవాహిక జీవితం ఒక పుస్తకం. తూర్పు యూరోపియన్ మనిషితో ప్రేమ వ్యవహారం(ప్యాషన్ సింపుల్) ఇంకో పుస్తకం. తల్లి మరణం ఒక పుస్తకం. బ్రెస్ట్ క్యాన్సర్ అనుభవాలు మరో పుస్తకం. ఫ్రాన్స్ చరిత్రతో ముడిపడిన 'ది ఇయర్స్'ను ఆమె మ్యాగ్నమ్ ఓపస్‌గా పరిగణిస్తారు. ఉత్తమ పురుష(నేను) కథనాలకు భిన్నంగా దీన్ని థర్డ్ పెర్సన్‌లో రాశారు.

ఏ వ్యక్తిగత అనుభవమో 'పొరపాటున' సాహిత్యంలోకి వస్తే- దానికీ, తనకూ ఏ సంబంధమూ లేదని ఒక డిస్‌క్లెయిమర్ లాంటిది ఆ రచయిత తగిలించడం కొత్త సంగతేం కాదు. మరీ ముఖ్యంగా సంక్లిష్ట కుటుంబ సంబంధాలు, సన్నిహిత మానవ సంబంధాలు వచ్చినప్పుడు ఈ జాగ్రత్తలు మరీ ఎక్కువ. ఇక వ్యక్తిగతం అన్నదే కొందరికి నిషిద్ధాక్షరి. వ్యక్తి నుంచి కూడా సమాజాన్ని దర్శించవచ్చునన్న అవగాహన ఉన్నవాళ్లు తక్కువ. కానీ ఆనీ ఎర్నో సాహిత్య సర్వస్వం ఆత్మకథాత్మకమే. ఇది కల్పన అని చెబితే రచయితకో రక్షణ కవచం ఉంటుందన్న ఆలోచన ఆమెకు లేక కాదు. కానీ అది మోసం చేయడంలా భావించారు. వ్యక్తిగత జీవితాన్ని ఒక ప్రయోగశాలలో పరీక్షించుకున్నంత కచ్చితత్వంతో తన అనుభవాలను నమోదు చేశారు. అందువల్లే ఆమె 'గ్రేట్ ట్రూత్ టెల్లర్ ఆఫ్ ఫ్రాన్స్'గా నిలవగలిగారు. నార్మండీ లాంటి చిన్నపట్టణంలో తన జీవితాన్నీ, తండ్రితో తన సంబంధాన్నీ 'ఎ మ్యాన్స్ ప్లేస్'గా రాస్తున్నప్పుడు తన రచనాపద్ధతిని గురించి ఆమె ఘర్షణపడ్డారు. తండ్రిని ఒక కాల్పనిక పాత్రగా మలవడంలో తన రచనా ఉద్దేశమే నెరవేరదని భావించారు. అందుకే ఉన్నది ఉన్నట్టే రాయడానికి సంకల్పించారు. అందుకే ఆమెను ఫిక్షన్ రచయిత అనాలా, నాన్-ఫిక్షన్ రచయిత అనాలా అన్న చర్చకూడా వచ్చింది. కొందరు ఆమెను 'మెమొయిరిస్ట్' (జ్ఞాపకాల రచయిత) అన్నారు. నవలగా, ఆత్మకథగా కాకుండా తన రచనలను ఆటోసోషియోబయోగ్రాఫికల్(సామాజిక ఆత్మకథ)గా మలవగలగడం ఆమె ప్రత్యేకత. చరిత్ర, ఆత్మకథల కలగలుపు ఆమె పద్ధతి.

ఇంట్లో పుస్తకాలను చూసి, ఇవన్నీ చదువుతావా అని ఆశ్చర్యపోయిన తన కజిన్, పుస్తకాలతో మనుషులకేం పని అన్నట్టుగా బతికిన తన తండ్రిలాంటివాళ్లు నిజానికి తనకు ఎక్కువ స్ఫూర్తి కలిగించారని చెప్పే ఆనీ... మర్చిపోయి అంతర్ధానమయ్యే లోపల జ్ఞాపకాలను పదిలపరుస్తున్నానంటారు. ఫ్రాన్స్ ఉమ్మడి జ్ఞాపకాలను ఆమె తన ద్వారా వ్యక్తం చేస్తున్నారు. అనువాదాల ద్వారా అవి ప్రపంచ స్మృతులుగా కూడా మారాయి.

తన ప్రపంచంగా అనిపించని పారిస్ విలాసాలకు దూరంగా ప్రకృతి, నిశ్శబ్దాల కోసం సబర్బన్ ప్రాంతంలో నివసించే ఆనీ ఎర్నో... ఒక దశలో 'మహిళా విప్లవం' చూడకుండానే చచ్చిపోతానేమో అని భయపడ్డానంటారు. కానీ అబార్షన్ హక్కులు రావడానికీ, స్త్రీ శరీరం మీద మారుతున్న పురుష ప్రపంచ ధోరణికీ ఆమె కూడా ఒక కారణం అయ్యారు. సాహిత్యానికి తక్షణ ప్రయోజనం ఉండకపోవచ్చు; కానీ ప్రయోజనం లేకుండా మాత్రం ఉండదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.1.44 వరకు
తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి సా.5.06 వరకు, తదుపరి అశ్విని
వర్జ్యం: తె.5.11 నుండి ఉ.6.46 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.11 నుండి 12.59 వరకు, **అమృతఘడియలు:** ప.12.15 నుండి 1.45 వరకు
తదుపరి ప.2.31 నుండి 3.17 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.40
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

వ్యూహంలో పావు మాత్రమేనా?

కామెంట్



కరణ్ థాపర్

కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో తాను గెలిచే అవకాశం చాలా తక్కువగా ఉందని శశి థరూర్ అంగీకరిస్తుండవచ్చు. అయితే గెలిచే ఉద్దేశంతో ఆయన బరిలోకి దిగలేదని కచ్చితంగా చెప్పవచ్చు. ఆయన అభ్యర్థిత్వం వల్ల మిగతా పార్టీల కంటే కాంగ్రెస్ భిన్నమైనదన్న ఇమేజ్ వచ్చింది. ఆయన మూర్తిమత్వం వల్ల మీడియాలో పార్టీ మీద దృష్టి పెరిగింది. కానీ ప్రశ్న ఏమిటంటే, కాంగ్రెస్ పార్టీ ఆయన్ని తెలివిగా వాడుకున్నదా? తాము ఎవరికీ రహస్యంగా పట్టాభిషేకం చేయబోమని థరూర్‌కు హామీ ఇచ్చిన సోనియా గాంధీ కుటుంబ సభ్యులు ఆ మాట తప్పారా? గాంధీ కుటుంబం మద్దతు పొందినట్లయితేనే తాను పోటీ చేస్తానని మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. అధిష్ఠానం మద్దతిచ్చిన అభ్యర్థి ఆయనేనని నామినేషన్ సమయంలోనూ, అనంతరం మీడియాతో ఆయన మాట్లాడినప్పుడూ రుజువైపోయింది. మరి ఈ విషయాలపై శశి థరూర్ అమాయకంగా ఉండిపోయారా?

తదుపరి కాంగ్రెస్ అధ్యక్షుడిగా మారే అవకాశాలు తనకు చాలా తక్కువగానే ఉన్నాయని శశి థరూర్ సైతం ఇప్పుడు సులువుగా అంగీకరిస్తారనడంలో సందేహమే లేదు. కానీ నిజం చెప్పాలంటే ఇది ఆయన అభ్యర్థిత్వాన్ని తప్పు ధోరణితో చూసినట్లే అవుతుంది. శశి థరూర్ బహిరంగంగా చెప్పలేనప్పటికీ, గెలిచే ఉద్దేశంతో ఆయన బరిలోకి దిగలేదని నేను కచ్చితంగా చెప్పగలను. కానీ పార్టీ అధ్యక్ష పదవికి ఆయన పోటీపడటానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. ఒకటి- అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉంటాయని ఆయన అభ్యర్థిత్వం ద్వారా పార్టీ చెప్పుకోవచ్చు. దీని ఫలితంగా ఇతర పార్టీలు తమ నాయకులను ఏకాభిప్రాయం ద్వారా ఎంపిక చేసుకునేలాగా కాకుండా, కాంగ్రెస్ ఒక భిన్నమైన పార్టీగా ప్రజల ముందు కనిపిస్తుంది. రెండు- అధ్యక్ష పదవికి జరగనున్న ఎన్నికకు సంబంధించి విశ్వసనీయతకు హామీ ఇవ్వడం. వీటికి మీరు మూడో కారణాన్ని కూడా జోడించుకోవచ్చు. థరూర్ మూర్తిమత్వం, ప్రజాదరణ వల్ల కాంగ్రెస్ పార్టీ మీద మీడియా దృష్టి విపరీతంగా పెరిగింది. ఇది పార్టీకి ప్రయోజనం చేకూర్చగలదని భావించవచ్చు. కానీ ఇక్కడ కలవరపెట్టే అంశం ఏమిటంటే, థరూర్ ఇప్పుడు తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిన ఒక ప్రశ్న ఉంది. ఆయన్ని కాంగ్రెస్ పార్టీ చాలా తెలివిగా వాడుకున్నదా?

దీన్ని నన్ను వివరించనీయండి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి ముందుగా సోనియా కుటుంబ సభ్యులు ముగ్గురినీ శశి థరూర్ కలిశారు. తమకు ఇష్టమైన అభ్యర్థి అంటూ ఎవరూ లేరనీ; ఎవరికీ రహస్యంగా గానీ, అనధికారికంగా గానీ తాము మద్దతివ్వబోమనీ సోనియా కుటుంబం తనకు హామీ ఇచ్చారని శశి థరూర్ బహిరంగంగా వెల్లడించారు. రహస్యంగా ఎవరికీ పట్టాభిషేకం చేయడం అనేది లేదు. తాము ఇష్టపడిన అభ్యర్థి ఫలానా అని సంకేతిస్తూ ఆ మాటను పార్టీలో కిందిస్థాయి దాకా చేర్చడం జరగదు.

అయితే సోనియా గాంధీ కుటుంబం చెప్పినట్లు మాత్రం జరగలేదు. అశోక్ గెహ్లోత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి అభ్యర్థిగా పరిగణనలోకి వచ్చినప్పుడు ఆయనే సోనియా కుటుంబం ఎంచుకున్న మనిషి అని స్పష్టంగా తెలిసిపోయింది. కానీ ఉన్నట్లుండి సీనియర్ కాంగ్రెస్ నేత, సోనియా విధేయుడు అయిన మల్లికార్జున్ ఖర్గేకి దారి ఇస్తూ గెహ్లోత్ రంగం నుంచి తప్పుకొన్నారు.

ఇక్కడ ఒక విషయం మనం గమనించి తీరాలి. మీడియా వార్తల ప్రకారం, గాంధీ కుటుంబం మద్దతు పొందినట్లయితేనే తాను పోటీ చేస్తానని ఖర్గే ముందే చెప్పి ఉన్నారు. వాస్తవానికి శశి థరూర్ లాగా మల్లికార్జున్ ఖర్గే పార్టీ అధ్యక్ష ఎన్నికలకు విశ్వసనీయతను తీసుకొచ్చే



పనిలో లేరన్నది స్పష్టం. తాను గెలుస్తానని నమ్మినట్లయితేనే ఖర్గే పోటీలో దిగుతారు. గాంధీ కుటుంబం మద్దతు దాన్నే నిజం చేసింది. స్పష్టపరిచింది కూడా!

మల్లికార్జున్ ఖర్గే నామినేషన్ దాఖలు చేసిన విధానం, ఆ తర్వాత మీడియా ముందు చేసిన వ్యాఖ్యలు తన గెలుపుపై ఆయన ఎంతో ధీమాతో ఉన్నట్లు తెలియపర్చాయి. దాదాపు సీనియర్లందరూ ఆయన నామినేషన్‌ని బలపర్చడానికి క్యూ కట్టిన తీరు, నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో ఆయనకు వారందరూ తోడుగా వచ్చిన తీరు చూసినప్పుడు పార్టీ మొత్తంగా ఆయన వెనక నిలబడిందనడానికి అది తిరుగులేని సంకేతంగా నిలిచింది. గాంధీ కుటుంబం ఖర్గేకి ఇచ్చిన అనుమతి, ఆమోదం స్థాయి అలాంటిది మరి.

నామినేషన్ తర్వాత జరిగిన పరిణామం ఈ అంశంపై మరింత స్పష్టతను ఇచ్చింది. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత తన ఇంటిలోని తోటలో మీడియాతో మాట్లాడిన శశి థరూర్‌తో పోలిస్తే, మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో మీడియాతో మాట్లాడటాన్ని గమనించాలి. కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతిచ్చిన అభ్యర్థి ఆయనేనని ఇది మరింత స్పష్టంగా రుజువు చేసింది.

ఇంకా ఎవరికైనా సందేహాలు మిగిలి ఉంటే, నామినేషన్ పత్రాలు సమర్పించాక మీడియా ముందు నిలబడి ఖర్గే చెప్పిన తొలి మాటలు గుర్తు తెచ్చుకోండి. ''కాంగ్రెస్ పార్టీ తరఫున నేను నా నామినేషన్ దాఖలు చేశాను'' అని ఖర్గే చెప్పారు. ఆయన నోటిలోంచి మాటలు జారి ఉండవచ్చు కానీ అది సత్యదూరమైన విషయం మాత్రం కాదు.

ఇదే నాకు తీవ్ర ఆందోళనను కలిగించింది. తమకు నచ్చిన ఏ అభ్యర్థికీ పట్టాభిషేకం చేయబోమని సోనియా కుటుంబ సభ్యులు మొదట్లో శశి థరూర్‌కి హామీ ఇచ్చినప్పుడు అది వారు నిజంగా ఇచ్చిన హామీయేనా? జాగ్రత్తగా ఆలోచించండి. ఎవరికీ అనుకూలంగా ఉండబోమని అంటున్నారంటే ఎవరో ఒకరి పట్ల తాము అనుకూలంగా వ్యవహరించగలమని వారు ఒప్పుకుంటున్నట్లేనా? మూర్ఖత్వంగా కనబడే నిజాయతీ ఇది. కాబట్టి అలాంటి హామీని కోరినప్పుడు, సోనియా కుటుంబ సభ్యులు ఆ హామీని ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు కనబడాలి. లేకుంటే తాము నిర్దేశించిన అధ్యక్ష ఎన్నికపై తామే ప్రశ్నలు ఎదుర్కోవలసి ఉంటుంది. కానీ, తమకంటూ ఒక ప్రాతినిధ్య అభ్యర్థి లేకుండా ఉండగలిగే రిస్కు వారు చేయగలరా? లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వారి చేతుల్లోంచి జారిపోతుంది. ఎంతమాత్రమూ అది వారి ఉద్దేశం కాకపోవచ్చు.

ఇది రెండు ప్రశ్నలను లేవనెత్తుతోంది. సోనియా గాంధీ కుటుంబ సభ్యులను విశ్వసించడంలో శశి థరూర్ అమాయకంగా ఉండిపోయారా? ఇదే విషయమై ఆయన్ని ప్రశ్నించినప్పుడు, సోనియా గాంధీ చెప్పిన మాటను సందేహించే ప్రశ్నే ఉత్పన్నం కాదని స్పష్టంగా చెప్పారు. నిజంగానే థరూర్ సందేహించి ఉంటే కాంగ్రెస్ అధ్యక్షురాలు ఒక అబద్ధాలకోరు అని ఆయన చెప్పినట్టయ్యేది. ఇది అర్థం చేసుకోదగిందే. కానీ మన ముందున్న ప్రశ్న మాత్రమే అలాగే ఉంటోంది. నిజంగానే సోనియా గాంధీ చెప్పిన మాటల్ని నమ్మేంత అమాయకత్వంలో శశి థరూర్ ఉండిపోయారా?

రెండో ప్రశ్న మరింత కలవరం కలిగిస్తోంది. సోనియా గాంధీ కుటుంబ సభ్యులు శశి థరూర్‌ని తమ ప్రయోజనాల కోసం వాడేసుకున్నారా? తమకు ఇష్టమైన అభ్యర్థిని తాము రంగంలో నిలపడం లేదని హామీ ఇవ్వడం ద్వారా వారు థరూర్‌కి పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడవచ్చని చెప్పారా? శశి థరూర్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల ఆ ఎన్నికకు విశ్వసనీయత వస్తుంది. అంతే కాకుండా మీడియాలో ఆసక్తిని కూడా అది బాగా పెంచుతుంది. దీనంతటి నుంచి పార్టీ గరిష్ఠంగా ప్రయోజనం పొందుతుంది. శశి థరూర్ భాగస్వామ్యం లేకుంటే, అంటే తాను పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేయకపోయి ఉంటే అది విభిన్నమైన కథగా ఉండేది. కాబట్టి థరూర్‌ని వాడుకునేలా వారు ఆయన్ని కూడా ఏమార్చారా? తాము ఎంపిక చేసుకున్న మనిషిని ముందుకు తీసుకురావడానికి శశి థరూర్ విశ్వసనీయతకి సంబంధించిన ముఖాన్ని సోనియా కుటుంబ సభ్యులు తెలివిగా ఉపయోగించుకున్నారా?

ఈ ప్రశ్నలకు సమాధానం మనం ఎన్నటికీ తెలుసుకోలేకపోవచ్చు. అయితే ఈ ప్రశ్న నిజంగానే దాని వెనుక దాగిన సత్యాన్ని మనకు సూచిస్తోంది. శశి థరూర్‌కి నేను ఈ ప్రశ్నే వేసినప్పుడు ఆయన స్పందన ఎంతో విచక్షణతో దీన్ని దాటేసినట్టుగా ఉండటం గమనించాను. ''ఇవన్నీ జర్నలిస్టులు చేయదగిన ఊహలు, విశ్లేషణలు మాత్రమే''. ఇప్పుడు నిజమేమిటో మీకు మీరే నిర్ణయించుకోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



బహుమానం



గత వారం రోజులుగా భగవద్గీత నాకు స్వర్గం నుంచి అందిన బహుమతిలా మారింది. ప్రతి సాయంత్రం చదువుకోవడం, పాడుకోవడం ద్వారా ఒక సాంత్వన, ఒక స్థిరత్వం అందుతోంది.
- గైయా సంస్కృత్, ఇంగ్లండ్ గాయని

మహత్తర శక్తి



వ్యాయామం చాలా శక్తిమంతమైనది. శుక్రకణాలు, అండ కణాల్లోని డీఎన్ఏ కెమిస్ట్రీని మార్చడం ద్వారా ఇంకా పుట్టని పిల్లల జన్యువులను కూడా అది ప్రభావితం చేయగలదు. మూడు నెలల ఏరోబిక్ ఎక్సర్‌సైజుల వల్ల ఆటిజం, ఓసీడీ, అల్జీమర్స్, టైప్ 2 డయాబెటిస్ లాంటివాటితో సంబంధమున్న జన్యువులను అణగదొక్కేలా శుక్రకణ డీఎన్ఏ మారిపోయింది.
- రోండా ప్యాట్రిక్, బయో మెడికల్ సైన్స్ పరిశోధకురాలు

పెరిగిన రిస్కు



కోవిడ్-19 ఎంఆర్ఎన్ఏ టీకాలకు సంబంధించి ప్రజలకు తెలియాల్సిన విశ్లేషణను మేము విడుదల చేశాం. ఈ విశ్లేషణలో 18 నుంచి 39 ఏళ్ల వయసు పురుషుల్లో హృదయ సంబంధిత మరణాల రిస్కు పెరిగినట్టుగా గుర్తించాం. ఈ సత్యం పట్ల నిశ్శబ్దంగా ఉండకూడదు.
- జోసెఫ్ ఎ.లడాపో, ఫ్లోరిడా(యూఎస్) హెల్త్ ఆఫీసర్

మరో పంజాబ్ కావొద్దు



జమ్ము కశ్మీర్‌లో నెలకొంటున్న పరిస్థితులు చూస్తుంటే 'ఉడ్తా కశ్మీర్' మనకు చాలా దగ్గరలోనే ఉన్నట్టు అనిపిస్తోంది. పరిస్థితులు చేయిదాటిపోకముందే మనం మేల్కోవాలి. మాదక ద్రవ్యాల వినియోగాన్ని ఆపాలి.
- మజా ఉల్ హక్, స్టోరీ టెల్లర్

ఇక్కడ తప్ప...



మీరు గమనించారో, లేదోగానీ... చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే భారతీయులకు తప్ప మిగతా అందరికీ నటి ప్రియాంకా చోప్రా మద్దతు పలుకుతుంటుంది.
- అభిషేక్ బక్షీ, డిజిటల్ కన్సల్టెంట్

ఈ కుర్రాళ్లున్నారే...



శుక్రవారం ప్రార్థనల కోసం మసీదుకు వెళ్లాను. నా పక్కన ఉన్న కుర్రాడు, 'మసీదు వై-ఫై పాస్‌వర్డ్ ఏమిటి?' అని అడిగాడు. నేను అతడిని మందలించి, 'బి ఎఫ్రైడ్ ఆఫ్ అల్లా'(అల్లాకు భయపడు) అన్నాను. 'స్పేసులతోనా, స్పేసులు లేకుండానా?' అని బదులిచ్చాడు.
- ఖలీల్ లాహెర్, మతగురువు

ముందు బతకాలిగా!



అన్నీ అమరినవారికే ఫ్రీలాన్స్ జర్నలిజం. ఎన్నో ఏళ్ల తర్వాత నేను గ్రహించిన విషయం ఇదే. కాబట్టి ఎవరైనా తమ ఆదాయం పెంచుకోవడానికి జర్నలిజంతో సంబంధం లేని పనులు స్వీకరిస్తే వారిని అవమానించడం ఆపండి. అది బతకడం కోసం చేసేది. మనం ఏదైనా రాయాలంటే కూడా మన దగ్గర కొంత డబ్బుండాలి.
- రోమితా సలూజా, జర్నలిస్ట్

కొత్త స్త్రీలు వస్తున్నారు జాగ్రత్త!

విశ్లేషణ



కె.ఎన్. మల్లీశ్వరి

'ఒక సమాజపు ప్రగతిని, ఆ సమాజంలోని మహిళలు సాధించిన ప్రగతితో కొలుస్తాను' అన్నారు అంబేడ్కర్. ఏ మార్పుకైనా మహిళలు ఎంత కీలకమో చెప్పే అరుదైన వ్యాఖ్య ఇది. మిగతా అన్ని సమూహాల మాదిరిగానే భారత మహిళల ప్రగతికి కూడా భిన్నత్వం ఉంది. ఆధునిక మహిళ చరిత్ర పునర్లిఖిస్తుందని గురజాడ అంటే, ఆ చరిత్ర స్వేచ్ఛా సమానత్వాలతో అత్యంత ప్రజాస్వామికంగా ఉంటుంది అనుకున్నాము, ఆ వైపు కొన్ని ముందడుగులు పడ్డాయి. అయితే గత యాభై ఏళ్లుగా పాక్షికంగా, గత పదేళ్లుగా వడివడిగా కొన్ని మహిళా సమూహాలు కొత్తచరిత్రని వేగంగా నిర్మిస్తూ పోతున్నాయి. ఆ చరిత్ర ఫాసిస్ట్ భావజాలానికి బలమైన చేర్పుని ఇస్తూ ఉండటం కలవరపరిచే అంశం. 'ఒక దేశపు ఫాసిస్టు భావజాల పురోగతిని, ఆ దేశపు రైట్ వింగ్ మహిళలు సాధించిన పురోగతితో కొలవాల్సి ఉంటుంది.' ఇట్లా కొలిచినపుడు విభ్రాంతి కలిగించే వాస్తవాలు కనిపిస్తున్నాయి. కూడూ, గూడూ, చదువూ, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళూ- వీటిలో కాసింత స్వేచ్ఛకోసం జీవితమంతా పణంగా పెట్టి కొందరు స్త్రీలు పోరాటాలు చేస్తున్నారు. మరో వైపు దేశాన్ని హిందూవర్ణంతో నింపేయడానికి సాయుధ, భావజాల, ప్రచార శిక్షణలతో మరికొందరు స్త్రీలు దూసుకుపోతున్నారు.

భారతదేశంలో ఫాసిజం ప్రధానంగా 'హిందుత్వ బ్రాహ్మణీయ భావజాలరూపం'లో ఉందని విశ్లేషకుల అంచనా. 'ఈ దుష్ట ఫాసిస్ట్ రాజ్యం నశించాలి' అంటూ కేవలం అధికార వ్యవస్థలను శత్రువుల్లా చూస్తూ వచ్చిన కాలాన్ని దాటి ముందుకు వచ్చాము. ఇపుడు ఫాసిస్ట్ భావజాలం రాజ్యంలోనే కాదు... మన ఆఫీసుల్లో, ఎదురింట్లో, మనింట్లో, మనలోపలికి కూడా వచ్చేసింది. మొదటి దశలో రాజ్యవ్యవస్థలు ఎవరినైతే అణచివేస్తాయో, ఆయావర్గాల్లో నుంచే కొందరిని మచ్చిక చేసి, ప్రలోభపెట్టి తమకి అనుగుణంగా మలుచుకోవడం రెండో దశ. పైవర్గాలకి అనధికార బానిసలుగా మారడం, స్వీయవర్గాల మీదనే దాడి చేయడం, ఇదంతా దేశభక్తిగా పరిగణింపబడటం ఒక చట్రం. గుజరాత్ ముస్లిం జాతి హననకాండలో వాఘ్రీస్, చరస్ తెగల ఆదివాసీలు, పట్టణ దళితులు తీవ్రమైన హింసకి, లూటీలకి పాల్పడ్డారు. వారి వల్నరబిలిటీని అక్కడి మతతత్వశక్తులు గురిచూసి వాడుకున్నాయి. అగ్రవర్ణాల హిందూ మహిళలు, నాయకురాళ్ళు కొందరు దగ్గరుండి చప్పట్లు కొట్టి మరీ తమ మగవారు చేసే అత్యాచారాలను ప్రోత్సహించారు. తమలోతాము కొట్లాడుకునే బదులు ప్రతి హిందూ యువకుడూ- ఫలానా మైనార్టీ మతంలోని తలొక పురుషుడినీ చంపితే సంతోషిస్తామని మార్గనిర్దేశం చేశారు.

ఉత్తర భారతదేశంలో 'కొత్తమహిళ' ఆవిర్భవించింది. మతతత్వపార్టీలకూ, సంస్థలకూ అనుబంధంగా మహిళా విభాగాలు విస్తృతంగా ఏర్పడ్డాయి. 'మాత్రీ మండలులు', 'సేవికా సమితులు', 'మహిళా మోర్చాలు' తమ కార్ఖానాల్లో స్త్రీలకి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి. స్త్రీలు మృదువుగా, సుకుమారంగా ఉండాలని భావించే పితృస్వామిక సమాజం వారిని మతసంస్థలు నిర్వహించే పారా మిలిటరీ తరహా సాయుధ శిక్షణకి ఎలా ఒప్పుకుంది? స్త్రీలు ఉద్యోగాల కోసమో, ఇతర



సామాజిక కార్యకలాపాల కోసమో అడుగు బైటపెడితే చాలు అనేక అనుమానాలతో వేధించే కుటుంబం, వారిని ధార్మిక కార్యకలాపాల కోసం రోజుల తరబడి పుణ్యక్షేత్రాలకి ఎలా అనుమతిస్తోంది? పర్పుల్ అంచున్న తెల్లచీరలు కట్టుకుని మత ప్రచారికలుగా, అధ్యాపికలుగా అవివాహిత స్త్రీలు ప్రతిగుమ్మం స్వేచ్ఛగా తిరుగుతూ ఎలా ప్రచారం చేయగలుగుతున్నారు?

ఎందుకంటే ఫాసిస్ట్ మతవ్యాప్తి కోసం అధికారవ్యవస్థలు స్త్రీలకి కాస్త కళ్ళాలు వదులు చేస్తాయి. తాము నిర్ణయించిన అంశాలలో స్త్రీలకి చరిత్రను పునర్లిఖించే బాధ్యతని అప్పగిస్తాయి. 'స్త్రీ స్వేచ్ఛ అంటే, తమమీద జరిగే దాడులు, అత్యాచారాల నుంచి విముక్తి పొందడమే తప్ప భార్యలుగా, తల్లులుగా తమ సాంప్రదాయక విధుల నుంచి విముక్తి పొందడం కాద'ని ఒక మతతత్వ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలి వ్యాఖ్యను ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి.

ఇంతకు ముందు మాత్రం స్త్రీలు అధికారం చలాయించలేదా అంటే చంఘిజ్ ఖాన్ నవలలో చెప్పినట్లు అధికారం వస్తే గడ్డిపరక కూడా తలెత్తి నిలబడుతుంది. రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపారస్థులు, సెలబ్రిటీ కళాకారులు, అగ్రవర్ణాలు, పదవులు హోదాల్లో ఉన్నవారి భార్యలు, తల్లులు, కూతుళ్ళు, అక్కచెల్లెళ్ళు కొందరు తమకి సొంతంగా పవర్ లేకపోయినా తమ మగవారి తరఫున వారికన్నా ఎక్కువ చలాయించడం వాస్తవం. ప్రాబల్యకులం, ధనికవర్గం, హోదా, అధికారం అంతిమంగా జత కడతాయి. అందులో స్త్రీలు ముఖ్యపాత్ర పోషిస్తారు. అయితే కనీసం మాటవరసకైనా - కులం అనాగరికం అనీ, పేద ఓటర్లే తమ దేవుళ్ళనీ, ఢిల్లీకి రాజైనా అమ్మకి కొడుకేననీ - ఇలా బహిరంగంగా పవర్‌ని వ్యతిరేకించడం నైతికవిధిగా ఉండేది. ఇపుడు ఆ భారాన్ని తీసివేస్తూ పైవర్గాల స్త్రీల ఏకీకరణకి మతం అందివచ్చిన సాధనం అయింది.

ఈ సాధనం మొదట సాంస్కృతిక రంగంలో బలమైన పునాదులు వేసుకుంటోంది. వర్గాల, కులాల, హోదాలవారీగా కొంతమంది స్త్రీలు ఏర్పాటు చేసుకునే కిట్టీపార్టీల్లో మత సంబంధ కార్యాచరణ ఏదో ఒకమేరకు సాగుతోంది. పట్టణ, ధనిక, మధ్యతరగతి మహిళలు మత కార్యకలాపాలు నిర్వహించడానికి అపార్ట్‌మెంట్ కల్చర్ చాలా అనువుగా ఉంటోంది. చందాల సేకరణ, ఉత్సవాల నిర్వహణ కమిటీలలో స్త్రీలు చురుకుగా పాల్గొంటున్నారు. దేశభక్తి ముసుగులో మతాన్ని ఉగ్గుపాలతో రంగరించి బిడ్డలకి పోయడానికి తల్లులు సమాయత్తమవుతున్నారు. బాలల వికాసం అంటే కాషాయ దుస్తులు తొడిగి, తలకి కాషాయపట్టీ పెట్టి ప్రతీ పండగలో పిల్లల చేత కోలాటాలు, డీజేలు ఆడించడం విధిగా మారిపోయింది. ఒకప్పుడు శాస్త్రీయ దృక్పథాన్ని అందించడానికి తపన పడిన తల్లులు, ఇప్పుడు పురాణ స్త్రీలను అమ్మాయిలకి ఆదర్శంగా చూపిస్తున్నారు. పాతివ్రత్య నిరూపణ కోసం అగ్నిలో నిలబడి ఉన్న సీత క్యాలెండర్ లక్షలాది కాపీలు అమ్ముడుపోయి ఇంటి గోడలపై ప్రత్యక్షం కావడం ఆడపిల్లలకి ఎటువంటి సంకేతాన్ని ఇస్తుంది?

మతం వ్యక్తిగత విశ్వాసంగా ఉన్నంతవరకూ, దానినుంచి ప్రమాదం లేకపోవచ్చు, కానీ రాజకీయ ఆచరణగా ముందుకు వచ్చినపుడు అనేకమతాల భారతదేశంలో లౌకికతత్వం వెనక్కిపోయి మెజార్టీమతం అందరి నెత్తికెక్కి సవారీ చేస్తుంది. ఇంటి వరండా, హాలు వంటివి అందరూ వచ్చి పోవడానికి వీలైన లౌకికస్థలాలు. అక్కడ స్త్రీలు తమ చేతికళా నైపుణ్యాలతో తయారు చేసిన మత ప్రదర్శనా చిహ్నాలు, ఇతర మతస్థులు తమకి ఎంత పరాయివాళ్ళో చెబుతూ ఉంటాయి.

రాజకీయాలకి ఏమీ సంబంధం లేదేమో అనిపించేంతగా ఈ కొత్త మహిళలు చుట్టుపక్కల కుటుంబాలతో కలిసిపోతారు. పక్కింటి కొత్త కోడలికి వంట నేర్పడమో, ఎదురింటి పెద్దాయనకి అత్యవసర వైద్యసాయమో; ఆందోళన, అభద్రతల్లో ఉన్నవారికి మాటసాయమో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి చేతిసాయమో చేయడం ద్వారా చుట్టుపక్కల అందరికీ ముఖ్యులు అవుతారు. ఆయా సందర్భాల రోజువారీ చర్చల్లో భాగంగా తమ మత భావజాలాన్ని వ్యాప్తిలోకి తెస్తారు. భార్యాభర్తల సమస్యలకి న్యాయసహాయం తీసుకోకుండా ఈ మహిళలే మతసంఘాల ద్వారా పంచాయితీలు పెట్టి సర్దుకుపోవలసిన భారాన్ని స్త్రీల మీద వేస్తారు. ఎన్నికలు, పార్టీ మీటింగుల సమయాల్లో వీరు ప్రచారకర్తలుగా మారి సాయాలు చేయడం ద్వారా తాము పట్టు పెంచుకున్న సర్కిల్స్‌ని సమీకరించి రాజకీయ ప్రయోజనాలకి వాడుకుంటారు.

నాలుగు దశాబ్దాల కిందట స్త్రీలు తమ పిల్లల్నీ, ఇంటినీ చూసుకుంటే చాలన్న దృష్టితో ఉద్యోగాలలో మహిళా రిజర్వేషన్‌ను మూడుశాతానికి కుదించిన ఘనత ఉత్తర భారత రాష్ట్రాలకి ఉంది. అనుకరణలో ఆరితేరిన దక్షిణ భారతదేశం అక్కడి మత రాజకీయాలనే కాదు, అక్కడి కొత్త మహిళలను కూడా ఆవాహన చేసుకుంటోంది. మత రాజకీయాలు మనకి వద్దు అనుకుంటే ప్రజలకు అయిదేళ్ళకాలం చాలు. ఈ కొత్త మహిళలు సర్వరంగాల్లో తెస్తున్న తిరోగతి వద్దు అనుకుంటే పోవడానికి యాభై ఏళ్ల కాలం కూడా చాలదు!

జాతీయ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక
malleswari.kn2008@gmail.com

గడప గడపనా ఘనస్వాగతం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సాగుతోంది. గ్రామాలకు వెళ్తున్న ప్రజాప్రతినిధులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కార్యక్రమం చివరివరకూ నాయకులవెంటే ఉంటూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అన్ని జిల్లాల్లో ఆదివారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

- సాక్షి, నెట్‌వర్క్


పల్నాడు జిల్లా 88 తాళ్లూరులో వృద్ధులకు సంక్షేమ లబ్ధి కరపత్రాలు అందజేస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


చిత్తూరు జిల్లా నింద్ర మండలం మేళంబాకం గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా


తూర్పు గోదావరి జిల్లా కొత్త వెలుగుబంద గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

క్లుప్తంగా

కల్యాణ వైభోగమే..!

వేడుకగా చిన వెంకన్న తిరుకల్యాణ మహోత్సవం


పట్టు వస్త్రాలను అందజేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకా తిరుమల: శ్రీవారి ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా ద్వారకా తిరుమల చిన వెంకన్న కల్యాణోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా, దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన కుమారుడు ఎస్వీ నివృతరావు, కుటుంబ సభ్యులు శ్రీవారికి పట్టు వస్త్రాలను అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ముగ్ధ మనోహర రూప లావణ్యాలను ఒలికిస్తూ మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు పర్యవేక్షించారు.

కాణిపాకంలో పాత టికెట్ ధరలతోనే ఆర్జిత సేవలు



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పాత టికెట్ రేట్లతోనే ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన పాలక మండలి చైర్మన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఇటీవల ఆర్జిత సేవల టికెట్ ధరలు పెంచుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. ఆర్జిత సేవల టికెట్ ధరల పెంపు ప్రతిపాదనపై ఆలయ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణపత్రం విడుదల చేశారని వెల్లడించారు. దీనిని పాలక మండలి, ఉభయదారులు వ్యతిరేకించి, టికెట్ ధరలు పెంచకూడదని నిర్ణయించినట్లు వివరించారు. టికెట్ పెంపు ప్రతిపాదనలను రద్దు చేసినట్లు స్పష్టంచేశారు. ఆలయ పునఃనిర్మాణం తర్వాత భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని చెప్పారు. నిత్యం 10వేల నుంచి 15వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం స్వామివారికి ఆర్జితసేవలు పాత టికెట్ ధరలకే నిర్వహిస్తున్నామన్నారు.

విజయవాడ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. 12వ తేదీన నర్సాపూర్–తిరుపతి (07130), విజయవాడ–ధర్మవరం (07131) ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు తెలిపారు.

ఆస్ట్రేలియాలో మంత్రి కాకాణికి ఆత్మీయ సత్కారం

నెల్లూరు (సెంట్రల్): వెస్టన్ ఆస్ట్రేలియాలోని పెర్త్ పట్టణంలో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగం శ్రేయస్సు కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పెర్త్‌లోని భారత రాయబార కాన్సులేట్ జనరల్ అమర్జీత్‌సింగ్ టకీ పాల్గొన్నారు.

వరంగల్ పోలీసుల అదుపులో మావోయిస్టులు

వరంగల్ క్రైం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వరంగల్‌లో వైద్యం కోసం వచ్చిన మావోయిస్టులను ఆదివారం తెల్లవారుజామున వరంగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో ఇద్దరు మహిళా మావోయిస్టుల తోపాటు ముగ్గురు పురుషులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ ఉన్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం ప్రెస్‌నోట్ ద్వారా వివరాలు విడుదల చేస్తామని చెప్పిన పోలీసులు కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేశారు. ఐదుగురు లేదా ఆరుగురు మావోయిస్టులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. కాంగ్రెస్ నేతతో కలిపి ఆరుగురి వరకు ఉండవచ్చన్న చర్చ జరుగుతోంది. అరెస్ట్ అయిన ఆరుగురు కూడా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారిగా సమాచారం. ఇందులో సౌత్ సబ్ జోనల్ కేడర్ నేత కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆధ్యాత్మికం.. పర్యాటకం!

- తీర్థయాత్రల ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు
- పర్యాటకాకర్షణగా ఆలయాల అభివృద్ధి
- సింహాచలం, అన్నవరం ఆలయాలకు 'ప్రసాదం' నిధులు
- మరో 13 ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన పర్యాటక శాఖ



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు తీర్థయాత్రల ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ చర్యలు చేపడుతోంది. ఎంపిక చేసిన యాత్రా స్థలాల్లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పించి పర్యాటకంగా తీర్చిదిద్దనుంది. తద్వారా స్థానిక సంస్కృతి, కళలు, వంటకాలకు ప్రాచుర్యం తీసుకొచ్చి ఆయా ప్రాంతాల్లోని ప్రజల జీవనోపాధిని మెరుగుపరచనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రాష్ట్రంలోని ఆలయాలను సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక వేదికలుగా మార్చనుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రసాదం పథకంలో భాగంగా విశాఖలోని సింహాచలం ఆలయాభివృద్ధికి రూ.52.57 కోట్లు మంజూరు చేసింది. త్వరలో డీపీఆర్‌కు అనుగుణంగా భక్తులకు వసతి సౌకర్యాలు, పుష్కరిణి, ఘాట్‌రోడ్డు, విద్యుదీకరణ పనులు చేపట్టనున్నారు. కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వసతులను మెరుగుపరిచేందుకు రూ.63.48 కోట్లతో డీపీఆర్‌ను పంపారు. త్వరలో ఆర్థిక అనుమతులూ రానున్నాయి.

వీలైనన్ని ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి

రాష్ట్రంలో వీలైనన్ని ఆలయాలను, ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో మార్పులు చేయాల్సి ఉంది. వాటిని సవరించి.. మరిన్ని ఆలయాలను కూడా అభివృద్ధి చేసే జాబితాలో చేర్చి పంపిస్తాం.

– కె.కన్నబాబు, ఎండీ, ఏపీ పర్యాటక సంస్థ

తాజాగా 13 ఆలయాలకు ప్రతిపాదనలు..

తీర్థయాత్రల గమ్యస్థానాలను ప్రాధాన్యత, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం, రాయచోటి వీరభద్ర స్వామి ఆలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయం, శ్రీకాకుళంలోని శ్రీముఖలింగం దేవస్థానాలను సకల వసతులతో పూర్తి స్థాయిలో మార్పులు చేసేలా ప్రతిపాదనలు రూపొందించింది. వీటితో పాటు తిరుపతి జిల్లాలోని మొల్లకోన, సింగిరికోన, తలకోన, కర్వేటినగరం, కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని ద్రాక్షారామం, పిఠాపురం, సామర్లకోటలోని ఆలయాలను భక్తుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దనుంది. ఆయా ఆలయాల వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, వెయిటింగ్ హాళ్లు, క్లాక్ రూమ్‌లు, ఫోన్, ఇంటర్నెట్ సేవలు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, సమాచార సంకేతాలు, వాహనాల సౌకర్యం, ఏటీఎంలు, అనౌన్స్‌మెంట్ కౌంటర్లు, ప్రయాణికుల రవాణా టెర్మినల్స్ వంటి వాటిని అభివృద్ధి చేయనున్నారు.

నేడు పైడితల్లి తొలేళ్ల ఉత్సవం

విజయనగరం టౌన్/విజయనగరం అర్బన్: శ్రీపైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరానికి విజయనగరం సర్వం సిద్ధమైంది. అమ్మవారి అనుగ్రహంతో వచ్చిన విత్తనాలను వేసి నాగలి (ఏరు)తో తొలుత దున్నాలి. దానినే తొలి ఏరు అని..తొలేళ్లని పిలుస్తారు. అమ్మవారి సిరిమానోత్సవానికి ముందు రోజు దీన్ని నిర్వహిస్తారు. తొలేళ్ల సంబరాలు ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం వరకు అమ్మవారి దర్శనభాగ్యం భక్తులకు కలగనుంది.


చదురుగుడిలో పైడితల్లి అమ్మవారు

ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి అనుసంధానంగా జరిగే విజయనగరం ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సిరిమానోత్సవానికి రెండు రోజుల ముందు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం వర్షం కురుస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఫల పుష్ప ప్రదర్శనలు, కళాజాతాలు, విద్యార్థుల బ్యాండ్ మేళాలు ఉత్సవాల్లో ప్రత్యేకతను చాటాయి. ర్యాలీని శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఉత్సవాలను ఆనందగజపతి ఆడిటోరియంలో మంత్రి బొత్సతో పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.


విజయనగరం ఉత్సవాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, చిత్రంలో మంత్రి బొత్స తదితరులు

తిరుపతిలోనే గదుల కేటాయింపు

- తిరుమల నుంచి త్వరలోనే మార్పు
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: తిరుమలలో ఉన్న గదుల కేటాయింపు వ్యవస్థను తిరుపతికి మార్పు చేయనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తద్వారా తిరుమలలో గదులు దొరకని భక్తులు తిరుపతిలోనే వసతి పొందే అవకాశం ఉంటుందని, త్వరలోనే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఆదివారం 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం కంపార్ట్‌మెంట్లలో రాత్రి వేళ వేచి ఉండే సామాన్య భక్తులకు ఉదయం త్వరగా దర్శనం కల్పించేందుకు వీలుగా వీఐపీ బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 10 గంటలకు మార్పు చేస్తామని చెప్పారు. తిరుమలలో స్వామివారికి జరిగే నిత్య, వార సేవలు, ఉత్సవాలను ఇతర ప్రాంతాల భక్తులు దర్శించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో వైభవోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 32 నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 80,034 మంది స్వామి వారిని దర్శించుకోగా, 47,312 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.24 కోట్లు సమర్పించుకున్నారు. శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దు చేసిన అనంతరం స్వామివారిని సామాన్య భక్తులు దర్శించుకోవడం ఇదే ప్రథమం.

శ్రీగిరిపై భక్తజన సందోహం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తజన సందోహం నెలకొంది. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి దర్శనం కోసం ఆదివారం వేలాది మంది భక్తులు శ్రీగిరికి చేరుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ పూజ వేళల్లో మార్పులు చేసి వేకువజామున 4.30 గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతించారు. స్వామి, అమ్మవార్ల సర్వదర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయం వద్దకు చేరుకోవడంతో క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. శ్రీగిరి ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులతో శ్రీశైల క్షేత్ర పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి.

సీఎం జగన్ బీసీల పక్షపాతి

- పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు మోకాలడ్డుతున్న బీజేపీ ప్రభుత్వం
- ఎంపీ ఆర్.కృష్ణయ్య



తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో బీసీల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ వారి పక్షపాతిగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. తిరుపతిలో ఆదివారం జరిగిన తిరుపతి జిల్లా బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీసీల సంక్షేమానికి 45 ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేపట్టినట్లు చెప్పారు. బీసీల సంక్షేమం విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఎంతో ముందు ఉందన్నారు. రెండేళ్ల కిందట వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి కోరిన వెంటనే పార్లమెంటుకు బీసీల బిల్లు పంపారని చెప్పారు. ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేందుకు 14 పార్టీలు ఒప్పుకున్నా, బీజేపీ మాత్రం నిరాకరించడం దుర్మార్గమన్నారు. బీసీ బిల్లు సాధన కోసం పోరాటంలో తాము అండగా ఉంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారని తెలిపారు. 22 శాతానికి తగ్గిన బీసీల రిజర్వేషన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 44 శాతానికి పెంచారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల చిన్నచూపు చూస్తూ మొండివైఖరిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రం బడ్జెట్‌లో 38.45 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.1,400 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమని చెప్పారు. బీసీలంతా ఐక్యతతో ఉద్యమించి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి బీసీ బిల్లు సాధించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్ర ధనుస్సు.. కనులవిందు

కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆకాశంలో ఇంద్ర ధనుస్సు కనులవిందు చేసింది. ఈ అద్భుత దృశ్యాన్ని చూసి స్థానికులు పులకరించారు. మునుపెన్నడూ ఇంత పెద్ద ఇంద్ర ధనుస్సును చూడలేదని తెలిపారు.

- గుడివాడ టౌన్



వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు, వీజీవో బాలిరెడ్డి, పేష్కార్ శ్రీహరి పాల్గొన్నారు.

- తిరుమల



పక్కా పథకం ప్రకారమే రామకృష్ణారెడ్డి హత్య

- అన్నా అని పిలిచి.. కళ్లల్లో కారం కొట్టి..
- వేట కొడవళ్లతో నరికిన దుండగులు
- భౌతికకాయంతో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అనుచరుల ఆందోళన
- సీఐ జీటీ నాయుడు, ఎస్‌ఐ కరీంలపై చర్యలకు డిమాండ్

హిందూపురం: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి హత్య పక్కా పథకం ప్రకారమే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. శనివారం రాత్రి దుండగులు చౌళూరులోని ఆయన ఇంటి వద్ద మాటు వేసి వేటకొడవళ్లతో నరికి చంపిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయానికి ఆదివారం ఉదయం హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో పోలీసు బందోబస్తు మధ్య పోస్టుమార్టం నిర్వహించారు. రామకృష్ణారెడ్డి శరీరంపై 31 చోట్ల కత్తి గాట్లు ఉన్నాయి. అందులో 11 చోట్ల బలమైన గాయాలయ్యాయి. ఇప్పటికే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తెల్లవారుజామునే క్లూస్‌టీమ్ గ్రామానికి చేరుకుంది. ఘటన స్థలంలో వేలిముద్రలు, అనుమానిత వస్తువులు, ఇతర వివరాలను సేకరించింది.

మాస్కులు పెట్టుకుని..

చౌళూరు రామకృష్ణారెడ్డి శనివారం రాత్రి కర్ణాటక–ఆంధ్రా సరిహద్దులోని తన దాబా నుంచి కారులో చౌళూరు గ్రామానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కారు దిగుతుండగా ఎవరో 'అన్నా..' అని పిలవడంతో వెనక్కు తిరిగి చూశారు. మరుక్షణమే ముఖానికి మాస్కులు పెట్టుకున్న దుండగులు రామకృష్ణారెడ్డి కళ్లల్లో కారం పొడి చల్లి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికారు. ఆయన కేకలకు ఇంట్లో ఉన్న తల్లి బయటకు వచ్చేలోపే దుండగులు ద్విచక్ర వాహనాల్లో పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న రామకృష్ణారెడ్డిని బంధువులు కారులో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి హుటాహుటిన తరలించారు. వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు.


రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మంత్రి శంకరనారాయణ, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉమ్మడి జిల్లాలో కలకలం

కాగా చౌళూరు రామకృష్ణారెడ్డి హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో బలమైన నాయకుడిగా ఉన్నారు. ఆయన భార్య జ్యోత్స్న, కుమారుడు దర్శన్‌రెడ్డి బెంగళూరులో ఉంటున్నారు. ఆయన తల్లితోపాటు స్వగ్రామం చౌళూరులో ఉంటూ బెంగళూరుకు వెళ్లి వస్తుంటారు. ఇటీవల తన దాబా విస్తరణ పనుల్లో ఆయన బిజీగా గడిపారు. రోజూ అక్కడ చీకటిపడే వరకు పనులు చేయించి.. తర్వాత కారులో స్వగ్రామం చేరుకునేవారు. ఈ విషయం పసిగట్టిన దుండగులు ముందస్తు పథకం ప్రకారం రామకృష్ణారెడ్డిని హత్య చేశారు. రాజకీయ విభేదాలు లేదా వ్యాపార లావాదేవీలు హత్యకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా రామకృష్ణారెడ్డి హత్య ఉమ్మడి అనంతపురం జిల్లాలో కలకలం రేపింది. చౌళూరులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు హిందూపురం ప్రభుత్వాస్పత్రి వద్ద, చౌళూరులో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం తర్వాత రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని స్వగ్రామం తరలిస్తుండగా కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు, రామకృష్ణారెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. అంబులెన్స్‌తో నేరుగా హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీఐ జీటీ నాయుడు, ఎస్‌ఐ కరీంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరితో కాకుండా వేరే పోలీసు అధికారులతో హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయించాలని పట్టుబట్టారు. డీఎస్పీ రమాకాంత్ వేరే అధికారులతో సమగ్ర దర్యాప్తు చేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. కాగా రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ శనివారం అర్ధరాత్రి పరిశీలించారు.

అండగా ఉంటాం..

రామకృష్ణారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ తెలిపారు. ఆదివారం వారు చౌళూరులో రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఐదుగురిపై కేసు

రామకృష్ణారెడ్డి హత్యకు సంబంధించి ఆయన తల్లి లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. చౌళూరుకు చెందిన చాకలి రవి, వరుణ్, నాగులు, మురళీతో పాటు గోపీకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా అనుమానితుల్లో ఇద్దరిని పోలీసులు అదుపులో తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

ఢిల్లీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమ్ రాజీనామా



న్యూఢిల్లీ: ఢిల్లీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమ్ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ నెల ఐదున మత మార్పిడిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన హిందూ దేవుళ్లను కించపర్చేలా మాట్లాడారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయనను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో తాను రాజీనామా చేసినట్లు రాజేంద్రపాల్ గౌతమ్ ఆదవారం ట్విట్టర్‌లో వెల్లడించారు. రాజీనామా లేఖను షేర్ చేశారు. తన వల్ల తమ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్, తమ ఆమ్ ఆద్మీ పార్టీ చిక్కుల్లో పడడం తనకు ఇష్టం లేదని తెలిపారు. పార్టీలో ఒక సైనికుడిగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. జీవితాంతం రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్, గౌతమ బుద్ధుడి అడుగు జాడల్లో నడుస్తానని వెల్లడించారు. ఈ నెల 5న జరిగిన కార్యక్రమంలో వేలాది మంది హిందూ మతం నుంచి బౌద్ధ మతంలోకి మారారు.

సంపూర్ణ సౌర గ్రామం మొధెరా

మొధెరా: గుజరాత్ రాష్ట్రం మెహసనా జిల్లాలోని మొధెరా గ్రామాన్ని దేశంలోనే మొట్టమొదటి సంపూర్ణ సౌర గ్రామంగా ప్రధాని మోదీ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మొధెరాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'సూర్య దేవాలయం ఉన్న గ్రామంగానే మొధెరాకు పేరుంది. ఇప్పుడు సౌర గ్రామంగా కూడా పేరు తెచ్చుకుంటుంది' అని మోదీ అన్నారు. నివాస, ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన 1,300 రూఫ్‌టాప్ సిస్టమ్స్ ద్వారా గ్రామానికి అవసరమైన సౌర విద్యుత్ 24 గంటలూ నిరంతరాయంగా అందుతుంది. మిగులు విద్యుత్‌ను నిలువ చేసేందుకు బ్యాటరీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. స్థానికులు ఉచితంగా కరెంటును వాడుకోడంతోపాటు అదనపు కరెంటును విక్రయించుకుని డబ్బు సంపాదించుకోవచ్చునన్నారు. 21వ శతాబ్దంలో స్వయం సమృద్ధ భారత్ సాధనకు ఇటువంటి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రధాని పేర్కొన్నారు. అనంతరం ఆయన రూ.3,900 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపనలు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో ప్రధాని మూడు రోజుల పర్యటన ప్రధాని మొదలైంది.

యూపీలో విద్యుత్ షాక్‌తో ఆరుగురు మృతి

బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బహ్రెయిచ్ జిల్లాలో విద్యుదాఘాతంతో ఐదుగురు బాలురుసహా ఆరుగురు మృత్యువాతపడ్డారు. నాన్‌పారా ప్రాంతంలోని మసుపూర్ గ్రామంలో ఆదివారం ఓ మత ఊరేగింపు జరిగింది. అందులో ఓ బండిపై అమర్చిన ఇనుప రాడ్ పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగను తాకింది. కరెంట్ షాక్‌తో బండిలోని ఆరుగురు చనిపోయారు. వీరిలో ఐదుగురు 16 ఏళ్లలోపు వారే. కుటుంబసభ్యుల వినతి మేరకు మృతదేహాలకు పోస్టుమార్టం చేపట్టలేదని పోలీసులు చెప్పారు. ఘటనకు సంబంధించి ఎవరిపైనా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఢిల్లీలో వరుణుడి ఉగ్రరూపం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వరుణ దేవుడు ఉగ్రరూపం ప్రదర్శించాడు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు.. 24 గంటల వ్యవధిలో ఏకంగా 74 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 2007 తర్వాత నగరంలో ఒక్కరోజులో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం ఇది రెండోసారి. శనివారం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. నగరంలో పలు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వర్షాల వల్ల ఢిల్లీలో కాలుష్యం తగ్గుముఖం పట్టడం విశేషం. వాయు నాణ్యత మెరుగుపడింది. గాలి నాణ్యత సూచి ఆదివారం ఉదయం 9 గంటలకు 54గా నమోదయ్యింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గణాంకాల ప్రకారం ఇది 'గుడ్' కేటగిరీలోకి వస్తుంది. కనిష్ట ఉష్ణోగ్రత 23.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. ఇది ప్రస్తుత సీజన్‌లో సగటు కంటే తక్కువే కావడం గమనార్హం .శుక్రవారం కనిష్ట ఉష్ణోగ్రత 20.8 డిగ్రీలు కాగా, శనివారం గరిష్ట ఉష్ణోగ్రత 23.4 డిగ్రీలు. రెండింటి మధ్య వ్యత్యాసం 2.6 డిగ్రీలు. నగరంలో 1969 తర్వాత ఇదే అతి తక్కువ వ్యత్యాసమని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 1998 అక్టోబర్ 19న ఈ వ్యత్యాసం 3.1 డిగ్రీలు నమోదయ్యిందని చెప్పారు. నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలియజేసింది. ఢిల్లీలో రుతుపవనాలు గత నెల 29న వెనక్కి మళ్లాయి. రుతుపవనాల సీజన్ ముగిసింది. పశ్చిమ వైపు నుంచి వీస్తున్న గాలుల ప్రభావం వల్ల సిటీలో భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

ఉత్తర కాశీ దుర్ఘటన.. 27కు చేరిన మృతులు

ఉత్తర కాశీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మంచుచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 27కు చేరింది. ఘటనాస్థలిలో ఆరు రోజులుగా గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగిస్తున్న సిబ్బంది ఆదివారం మరో నాలుగు మృతదేహాలను వెలికితీశారు. ఈ నెల 4వ తేదీన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెయినీరింగ్(ఎన్‌ఐఎం)లో శిక్షణ పొందుతున్న 27 మంది, ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లు 'ద్రౌపదీ కా దండా-2' శిఖరం నుంచి వెనుదిరిగి వస్తుండగా 17 వేల అడుగుల ఎత్తులో మంచుచరియలు పడిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 21 మృతదేహాలను గుర్తించి, సంబంధీకులకు అధికారులు అందజేశారు. మరో ఇద్దరు ట్రైనీల జాడ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎన్‌ఐఎం పేర్కొంది.



రష్యా బాంబు దాడుల్లో ధ్వంసమైన జపొరిజాజియాలోని నివాస భవన సముదాయం

రష్యా ప్రతీకారం

- జపొరిజాజియాలో భవనాలపై రాకెట్ల వర్షం
- 12 మంది మృతి.. 60 మందికి గాయాలు
- దెబ్బతిన్న పలు అపార్టుమెంట్లు
- రష్యా రాక్షసకాండపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆగ్రహం

జపొరిజాజియా: రష్యా–క్రిమియా ద్వీపకల్పాన్ని అనుసంధానించే కీలక వంతెనపై ఉక్రెయిన్ అనుకూల వర్గాలు పేలుళ్లకు పాల్పడిన నేపథ్యంలో పుతిన్ సైన్యం ప్రతీకార చర్యలకు దిగింది. ఉక్రెయిన్‌లోని జపొరిజాజియా సిటీపై నిప్పుల వర్షం కురిపించింది. శనివారం అర్ధరాత్రి తర్వాత వరుసగా రాకెట్లు ప్రయోగించింది. ఈ ఘటనలో 12 మంది పౌరులు మృతిచెందారు. 60 మందికి పైగా గాయపడ్డారు. రష్యా దాడుల్లో 20 ప్రైవేట్ నివాస గృహాలు, 50 అపార్టుమెంట్ భవనాలు దెబ్బతిన్నాయని సిటీ కౌన్సిల్ కార్యదర్శి అనాతోలివ్ కుర్టెవ్ చెప్పారు. జపొరిజాజియాలో రష్యా రాకెట్ దాడులను ఉక్రెయిన్ సైన్యం ధ్రువీకరించింది. పదుల సంఖ్యలో పౌరులు గాయపడ్డారని పేర్కొంది. రష్యా దాడుల పట్ల స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమ అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. రష్యా అంతర్జాతీయ ఉగ్రవాది అంటూ మండిపడ్డారు. తమను ఎవరూ రక్షించలేరా? అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

అమాయకులను బలి తీసుకున్నారు: జెలెన్‌స్కీ

వాస్తవానికి దక్షిణ ఉక్రెయిన్‌లోని జపొరిజాజియా ప్రస్తుతం రష్యా ఆధీనంలోనే ఉంది. ఈ ప్రాంతాన్ని తమ దేశంలో విలీనం చేస్తూ రష్యా అధినేత పుతిన్ ఇటీవలే సంతకాలు చేశారు. జపొరిజాజియా ప్రావిన్స్ మొత్తం చట్టబద్ధంగా తమదేనని వాదిస్తున్నారు. గత గురువారం ఇదే సిటీపై రష్యా సైన్యం జరిపిన క్షిపణి దాడుల్లో 19 మంది బలయ్యారు. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని రష్యా ఇటీవల తరచుగా దాడులు చేస్తుండడం గమనార్హం. తాజా రాకెట్ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ దయ, కరుణ లేకుండా అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్నారని దుమ్మెత్తిపోశారు. అది అక్షరాలా రాక్షసకాండ అని ధ్వజమెత్తారు. ఈ దాడులకు ఆదేశాలిచ్చినవారు, వాటిని పాటించినవారు తప్పనిసరిగా చట్టానికి, ప్రజలకు జవాబు చెప్పాలన్నారు.

వంతెన భద్రత పెంచాలని ఆదేశాలు

ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియా ద్వీపకల్పాన్ని 2014లో రష్యా ఆక్రమించింది. రష్యా–క్రిమియాను అనుసంధానించే వంతెనపై శనివారం భారీ ఎత్తున పేలుళ్లు జరిగాయి. వంతెన కొంతవరకు ధ్వంసమైంది. ఈ పేలుళ్లకు ఇంకా ఎవరూ బాధ్యత వహించలేదు. ఇదంతా ఉక్రెయిన్ అనుకూలవర్గాల పనేనని రష్యా నిర్ణయానికొచ్చింది. ప్రతీకార చర్యల్లో భాగంగా జపొరిజాజియాను లక్ష్యంగా చేసుకుంది. వంతెనకు, అక్కడున్న ఇంధన రంగ మౌలిక సదుపాయాలకు భద్రత పెంచాలంటూ పుతిన్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. భద్రత కోసం ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్‌ను రంగంలోకి దించారు. పుతిన్ 'ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్' ప్రారంభించారని రష్యా ప్రజాప్రతినిధులు కొందరు తెలిపారు. తూర్పు డొనెట్స్క్ రీజియన్‌లోని బఖ్‌ముత్, అవ్‌దివ్కా నగరాల్లో రష్యా, ఉక్రెయిన్ బలగాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ సాగింది. ఈ విషయాన్ని ఉక్రెయిన్ సైనిక దళాల అధికారి ఆదివారం ఉదయం వెల్లడించారు. ప్రస్తుతం రెండు నగరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ జవాన్ల మధ్య ఘర్షణలో వాటిల్లిన ప్రాణనష్టంపై వివరాలు తెలియరాలేదు.

రష్యా సైన్యానికి కొత్త కమాండర్

రష్యా–క్రిమియా వంతెనపై పేలుళ్ల తర్వాత రష్యా ఒక్కసారిగా అప్రమత్తమయ్యింది. ఉక్రెయిన్‌లో తమ సైనిక బలగాలకు సారథ్యం వహించడానికి ఎయిర్ ఫోర్స్ చీఫ్ జనరల్ సెర్గీ సురోవికిన్‌ను నియమిస్తున్నట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఇకపై ఉక్రెయిన్‌లో సైనిక ఆపరేషన్లను ఆయనే ముందుండి నడిపిస్తారని స్పష్టం చేసింది. సురోవికిన్‌ను కొన్ని నెలల క్రితం దక్షిణ ఉక్రెయిన్‌లో రష్యా సేనలకు ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పుడు పదోన్నతి కల్పించారు. ఆయన గతంలో సిరియాలో రష్యా సైన్యానికి సారథ్యం వహించారు. సిరియాలోని అలెప్పో నగరంలో పెను విధ్వంసానికి సురోవికిన్ ప్రధాన కారకుడన్న ఆరోపణలున్నాయి.

బీజేపీ చీఫ్‌గా మళ్లీ నడ్డాకే అవకాశం?

2024 లోక్‌సభ ఎన్నికల వరకు కొనసాగే ఛాన్స్



న్యూఢిల్లీ: బీజేపీ అధ్యక్షుడిగా జేపీ నడ్డా మరో విడత 2024 లోక్‌సభ ఎన్నికల వరకు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కొనసాగింపు ద్వారా రానున్న రోజుల్లో వరుసగా జరగనున్న కీలక అసెంబ్లీ ఎన్నికలతోపాటు సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి సంస్థాగతంగా మేలు కలుగుతుందని అగ్ర నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. నడ్డా మూడేళ్ల పదవీ కాలం వచ్చే ఏడాది జనవరితో ముగియనుంది. బీజేపీ అత్యున్నత విభాగం పార్లమెంటరీ బోర్డ్ ఆయన పదవీ కాలం మరో విడత పొడిగిస్తూ ఈలోగానే ఒక తీర్మానం ఆమోదిస్తుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. బీజేపీ రాష్ట్ర విభాగాల్లో సంస్థాగత ఎన్నికలు ఇంకా ప్రారంభం కానప్పటికీ, చీఫ్‌గా నడ్డా కొనసాగుతారని తెలిపాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ముందు కనీసం సగం రాష్ట్రాల్లోనైనా సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలనే నిబంధన ఉంది. నడ్డాకు ముందు పార్టీ చీఫ్‌గా ఉన్న అమిత్ షాకు కూడా ఇదే విధమైన కొనసాగింపునిచ్చారు. అప్పట్లో ఎన్నికలు ముగిసిన వెంటనే సంస్థాగత ఎన్నికలు జరిగాయి. అమిత్ షా కేంద్ర కేబినెట్‌లో జాయిన్ కావడంతో జేపీ నడ్డా బీజేపీ చీఫ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాని మోదీకి విశ్వాస పాత్రుడిగా, ఆర్ఎస్ఎస్ నాయకత్వంతో సత్సంబంధాలున్న వ్యక్తిగా నడ్డాకు పేరుంది. పార్టీని విస్తరించి వ్యూహాలను అమలు చేయగల నేతగా నడ్డా పేరు తెచ్చుకున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు, బిహార్‌లో పార్టీ మంచి ఫలితాలను రాబట్టడం వంటివి నడ్డా హయాంలో బీజేపీ సాధించిన విజయాలుగా పేర్కొన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటికీ తెలంగాణలో పార్టీ బలం గణనీయంగా పెరగడం వెనుక నడ్డా కృషి ఉందంటున్నారు.

విద్వేష రాజకీయాల నుంచి యువతను రక్షించాలి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

తుమకూరు: విద్వేష రాజకీయాల నుంచి దేశ యువతను రక్షించాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. విద్య, ఉపాధి అవకాశాలను వారికి కల్పించి మంచి భవిష్యత్తును చూపాలన్నారు. యువతను విద్వేషాల మంటల్లోకి నెట్టివేయడం దేశ భవితను నాశనం చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో భారత్ జోడో యాత్ర ఆదివారం తుమకూరు జిల్లాలో రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా కొందరు యువతీయువకులు పెరుగుతున్న నిరుద్యోగం, మత విద్వేషాలకు వ్యతిరేకంగా బ్యానర్లు ప్రదర్శిస్తూ యాత్రలో పాల్గొన్నారు. రాహుల్ వారితో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. శాంతి, సోదరభావ సందేశాన్ని వ్యాపింపజేసి, దేశాన్ని ఐక్యంగా ఉంచే యాత్రలో పాల్గొనాలని ఆయన వారిని కోరారు. 'కొన్ని రాజకీయ పార్టీలు తమ విద్వేష రాజకీయాల కోసం వారిని నిరుద్యోగులుగానే ఉంచుతూ తప్పుదోవపట్టిస్తున్నాయి. యువత మన దేశ భవిష్యత్తు. ఉపాధి చూపితే వారు తమ, కుటుంబ, దేశ భవిష్యత్తును నిర్మిస్తారు. మనదేశాన్ని మునుపటి మాదిరిగా అందమైన దేశంగా తయారు చేసుకుందాం' అని రాహుల్ పేర్కొన్నారు. చిక్కనాయకనహళ్లిలో చిన్నారులతో కలిసి కారులో కాసేపు ముచ్చటించారు.



చిన్నారులతో కలిసి కారులో రాహుల్ సరదా

ఐఐటీల్లో హిందీ, స్థానిక భాషల్లో బోధించండి

అధికార భాషా పార్లమెంట్ కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ఉన్నత విద్యా సంస్థలుసహా టెక్నికల్, నాన్–టెక్నికల్ విద్యా సంస్థల్లో హిందీ, స్థానిక భాషల్లో బోధించాలని అధికార భాషా పార్లమెంట్ కమిటీ సిఫార్సు చేసింది. ఇంగ్లిష్ భాష వాడకాన్ని కాస్త తగ్గించి భారతీయ భాషలకు తగిన ప్రాధాన్యతను కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ కమిటీ సిఫార్సులు పంపింది. ఇంగ్లిష్‌ను ఐచ్ఛికంగా వాడాలని హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీ తన 11వ నివేదికను ఇటీవలే రాష్ట్రపతికి సమర్పించింది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం అధికారిక లేదా ప్రాంతీయ భాషలనే వాడాలన్న సూచన మేరకు ఈ సిఫార్సులు చేసినట్లు కమిటీ ఉపాధ్యక్షుడు, బీజేడీ నేత భర్తృహరి మహతాబ్ చెప్పారు. 'ఐక్యరాజ్యసమితి అధికారిక భాషల్లో హిందీని చేర్చాలి. ఏ–కేటగిరీ రాష్ట్రాల్లో హిందీకి '100 శాతం' ప్రాధాన్యత ఇవ్వాలి. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని ఐఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాల్లో హిందీలోనే బోధించాలి. వేరే రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో అక్కడి స్థానిక భాషల్లో బోధించాలి. వలస వాసనను వదిలించుకుంటూ విదేశీ భాష ఇంగ్లిష్‌ను కాస్త పక్కనబెట్టాలి' అని కమిటీ సిఫార్సు చేసింది. 'హిందీ ఎక్కువగా మాట్లాడే ప్రాంతాల్లో ఉన్న బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఢిల్లీ వర్సిటీ, జమియా మిలియా ఇస్లామియా, అలీగఢ్ ముస్లిం వర్సిటీలలో పూర్తిగా హిందీలోనే బోధిస్తే మేలు. ఇక కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆఫీస్‌లు, మంత్రిత్వ శాఖల మధ్య లేఖలు, ఫ్యాక్స్‌లు ఈ–మెయిల్‌లలో హిందీ లేదా స్థానిక భాషలను వాడాలి. అధికారిక కార్యక్రమాల్లో, ప్రసంగాల్లో, ఆహ్వాన పత్రాల్లో సులభంగా ఉండే హిందీ/స్థానిక భాషలనే వాడాలి' అని సూచించింది. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, హరియాణా, హిమాచల్, రాజస్థాన్, ఢిల్లీ ఏ–కేటగిరీలో ఉన్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ బి–కేటగిరీలో ఉన్నాయి. మిగతావి సి –కేటగిరీలో ఉన్నాయి.

రెండోసారి ఏకగ్రీవంగా..



చెన్నై: ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) సారథిగా ఎంకే స్టాలిన్ మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చెన్నైలో డీఎంకే పార్టీ కొత్త ప్రతినిధులతో ఏర్పడిన సర్వ ప్రతినిధి మండలి సమావేశంలో పార్టీ అధ్యక్షుడిగా స్టాలిన్‌ను పార్టీ నేతలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమిళనాడులోని అన్ని ఎంపీ స్థానాల్లో పార్టీ గెలిచేందుకు కృషిచేయాలని పథాధికారులకు సూచించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నేత దురైమురుగన్, కోశాధికారిగా టీఆర్ బాలు ఎంపికయ్యారు. ఈ ముగ్గురూ వరసగా రెండోసారి ఈ పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికవడం గమనార్హం. ఉప ప్రధాన కార్యదర్శిగా కనిమొళి ఎన్నికయ్యారు. వ్యవస్థాగత ఎన్నికల్లో భాగంగా పార్టీ చీఫ్ సహా పార్టీలో అన్ని స్థాయిల్లో పదవులకు ఎన్నికలు నిర్వహించారు.

ప్లీనరీలో జిన్‌పింగ్ వర్క్ రిపోర్ట్

16న చైనా కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సదస్సు

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదివారం అధికార కమ్యూనిస్ట్ పార్టీ ప్లీనరీ నిర్వహించారు. తన పాలనలో సాధించిన విజయాలు, భవిష్యత్తు దార్శనికతపై ఒక వర్క్ రిపోర్ట్‌ను ఈ సందర్భంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 400 మంది సీనియర్ నేతలు పాల్గొన్నారు. కొన్ని కీలక విధానాలు, డాక్యుమెంట్లపై చర్చించారు. ఈ నెల 16న జరగబోయే కమ్యూనిస్ట్ పార్టీ 20వ జాతీయ సదస్సుకు సన్నాహకంగా ఈ ప్లీనరీని నిర్వహించినట్లు తెలుస్తోంది. జిన్‌పింగ్ పదవీ కాలాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తూ జాతీయ సదస్సులో తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. ఆయన గత పదేళ్లుగా పదవిలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. చైనా కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సదస్సును ఐదేళ్లకోసారి నిర్వహిస్తారు. చైనా అధ్యక్షుడు పదేళ్లకు మించి అధికారంలో ఉండడానికి వీల్లేదు. కానీ, 2018లో రాజ్యాంగాన్ని సవరించారు. పదేళ్ల పదవీ కాలం నిబంధనను తొలగించారు. జిన్‌పింగ్ మరో ఐదేళ్లు అధ్యక్షుడిగా పదవీలో ఉండడానికి వీలు కల్పించారు.

గుజరాత్ బీజేపీ శ్రేణుల రహస్య మద్దతు మాకే: కేజ్రీవాల్

ధరంపూర్: గుజరాత్‌లోని బీజేపీ నేతలు, కార్యకర్తల్లో చాలా మంది రహస్యంగా తమ ఆప్‌నకు మద్దతిస్తున్నారని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. వీరంతా తనను కలిసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ ఓటమిని కోరుకుంటున్నామని చెప్పారన్నారు. గుజరాత్ రాష్ట్రం గిరిజన ప్రాబల్య వల్సాద్‌లో ఆదివారం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. 'మీకు మీ సొంత వ్యాపారాలున్నాయి. మాతో కలిస్తే మీ వ్యాపారాలు దెబ్బతినవచ్చు. అందుకే మాకు రహస్యంగా మద్దతివ్వండి. కాంగ్రెస్ శ్రేణులు మాత్రం భయపడాల్సిన అవసరం లేదు. మీ పార్టీని మర్చిపోయి ఆప్‌లో చేరండి' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. తనను హిందూ వ్యతిరేకి అని పేర్కొంటూ పట్టణంలో వెలిసిన పోస్టర్లపై ఆయన స్పందిస్తూ.. 'వీటిని వేయించిన వారు రాక్షసులు' అంటూ బీజేపీని తిట్టిపోశారు.

కడియాల కోసం వృద్ధురాలి కాళ్లు నరికేశారు!

జైపూర్: శతాధిక వృద్ధురాలు ధరించిన వెండి కడియాల కోసం దుండగులు ఏకంగా ఆమె కాళ్లను నరికేశారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. గల్తాగేట్ ప్రాంతం మీనా కాలనీకి చెందిన జమునా దేవి(108) తన కూతురు, మనవరాలితో కలిసి ఉంటోంది. కుటుంబసభ్యులంతా నిద్రిస్తుండగా ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో గుర్తు తెలియని దుండుగులు జమునా దేవి ఇంట్లో ప్రవేశించారు. కదల్లేని స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలిని బయట ఉన్న బాత్‌రూంలోకి ఈడ్చుకెళ్లారు. పదునైన ఆయుధంతో రెండు కాళ్లు నరికి వెండి కడియాలు దోచుకుని పరారయ్యారు. రక్తం మడుగులో పడి ఉన్న వృద్ధురాలిని గంట తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. సీసీపుటేజీ ఆధారంగా దుండగుల కోసం పోలీసులు వేట ప్రారంభించారు.

వయస్సు మీద పడుతుండటంతో నితీశ్ అలా మాట్లాడుతున్నారు


ప్రశాంత్ కిశోర్

పట్నా: జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్(71) వయస్సు మీద పడుతుండటంతో పొంతనలేకుండా మాట్లాడుతున్నారని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. జేడీయూను కాంగ్రెస్‌లో కలిపేయాలని ప్రశాంత్ కిశోర్ తనకు సలహా ఇచ్చారంటూ నితీశ్ కుమార్ చెప్పడంపై ఆయన స్పందించారు. తన చుట్టూ ఉన్న వారిని నమ్మలేని నితీశ్ రాజకీయంగా ఏకాకి అయి, భ్రమలో మునిగి అర్థం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. 'బీజేపీకి పక్షపాతిగా నేను వ్యవహరిస్తున్నట్లు నితీశ్ అనుమానిస్తున్న పక్షంలో జేడీయూ విలీనం ద్వారా కాంగ్రెస్ బలపడే సలహా ఎందుకు ఇస్తాను?' అని అన్నారు.

సోనాలీ ఫోగాట్ హత్యకు రూ.10 కోట్ల డీల్!



న్యూఢిల్లీ: బీజేపీ నాయకురాలు, టిక్‌టాక్ స్టార్, నటి సోనాలీ ఫోగాట్(42) హత్యకు రూ.10 కోట్ల డీల్ కుదిరిందని, ఈ మేరకు తమ కుటుంబానికి ఇటీవలే రెండు లేఖలు అందాయని ఆమె బావ అమన్ పూనియా తాజాగా చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఈ రెండు లేఖలు వచ్చినట్లు తెలిపారు. ఒక లేఖలో రూ.10 కోట్ల డీల్ గురించి, మరో లేఖలో పలువురు రాజకీయ నాయకుల పేర్లు ఉన్నాయన్నారు. లేఖల్లో కీలక సమాచారముంది కాబట్టి వీటిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సోనాలీ ఫోగాట్ ఆగస్టు 23న గోవాలో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో చనిపోయినట్లు తొలుత ప్రచారం జరిగింది. కానీ, ఆమె శరీరంపై పలుచోట్ల గాయాలున్నట్లు పోస్టుమార్టంలో తేలింది. విచారణ చేపట్టిన పోలీసులు సోనాలీ సహాయకులైన సుధీర్ సంగ్వాన్, సుఖ్వీందర్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రస్తుతం సీబీఐ ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



ఆదివారం ఇటలీలోని ట్రీస్టెలో ఏడ్రియాటిక్ సముద్ర తీరం వెంట జరుగుతున్న 54వ బార్కొలానా పడవపందెంలో దూసుకెళ్తున్న తెరచాప పడవలు

ఆర్థిక క్రమశిక్షణతోనే అభివృద్ధి వేగవంతం

- ఈశాన్య రాష్ట్రాలనుద్దేశిస్తూ హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్య
- ఎన్‌ఈసీ 70వ ప్లీనరీ ముగింపు సమావేశంలో హోం మంత్రి పిలుపు



కార్యక్రమంలో కిషన్ రెడ్డి, అమిత్ షా

గువాహటి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలంటే ఈశాన్య రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గువాహటిలో ఈశాన్య రాష్ట్రాల మండలి(ఎన్‌ఈసీ) 70వ ప్లీనరీ ముగింపు సమావేశంలో అమిత్ పాల్గొని ప్రసంగించారు. అవసరమైన చోట నిధుల సద్వినియోగం, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెడితే అభివృద్ధి ఫలాలు త్వరగా చేతికొస్తాయన్నారు. కేంద్రనిధులతో పాటు రాష్ట్రాల ఆదాయాల విషయంలోనూ ఇదే విధానం అవసరమన్నారు. 'ఇతర రాష్ట్రాలతో సమానంగా ఈశాన్య రాష్ట్రాలకు అభివృద్ధి చెందేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయి. ఇందుకోసం ఈశాన్య రాష్ట్రాలన్నీ సంపూర్ణ సమన్వయంతో పనిచేయాలి' అని ఎన్‌ఈసీ చైర్మన్ హోదాలో అమిత్ సూచించారు. అమిత్, కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్ రెడ్డి, 8 రాష్ట్రాల సీఎంలు పాల్గొని ఈశాన్య రాష్ట్రాల భవిష్యత్ కార్యాచరణ, సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు.

ఆరోగ్యకర పోటీ అవసరం : కిషన్‌రెడ్డి

కేంద్రం ఇస్తున్న 10 శాతం నిధుల సద్వినియోగం విషయంలో ఈశాన్య రాష్ట్రాల మధ్య ఆరోగ్యకర పోటీతోపాటు ప్రత్యేక దృష్టిసారిస్తే పురోగతి సాధ్యమని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని 4,700 గ్రామాల్లో టెలికమ్యూనికేషన్ అనుసంధానత కోసం 500 రోజుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.

యాత్ర తర్వాత కొత్త రాహుల్‌ను చూస్తారు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్య



తురువుకెరె(కర్ణాటక): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఐక్య భారతానికి ప్రతీకగా మారారని ఆ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అభివర్ణించారు. ఆదివారం దిగ్విజయ్ పీటీఐకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖాముఖిలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. ' కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా కొనసాగే భారత్ జోడో యాత్ర సమాప్తమయ్యాక మరింత పటిష్టమైన నాయకత్వ లక్షణాలను సంతరించుకున్న రాహుల్‌ను చూస్తారు. ఆయన కొత్త అవతారం మొదలుకానుంది. యావత్ ప్రజానీకంలో కాంగ్రెస్ పట్ల మరింత సానుకూల వైఖరిని పాదయాత్ర పెంచుతుందనడంలో సందేహమే లేదు. చాన్నాళ్ల తర్వాత దేశంలోని ప్రతి పల్లెలోనూ కాంగ్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు. తొలి నుంచీ కడదాకా యాత్రలో రాహుల్ మమేకమైన విధానం చూసి జనం బాగా మెచ్చుకుంటున్నారు. యాత్రతో పార్టీ మరింత బలాన్ని పుంజుకుంటుంది. మన దేశంలో త్యాగధనులందరికీ సరైన మన్నన దక్కుతుంది. ప్రధాని పదవిని సోనియా గాంధీ త్యజించారు. ఇప్పుడు రాహుల్ మండుటెండలో చెమటోడుస్తూ, హోరు వానలో తడుస్తూ, అబద్ధపు వార్తలు, ప్రతిష్ట దిగజార్చే వ్యాఖ్యలను ఎదుర్కొంటూ జనం కోసం ముందుకు సాగుతున్నారు. భారత్ జోడోకు సిసలైన సంకేతంగా నిలిచారు. యాత్ర తర్వాత కొత్త రాహుల్‌ను చూడటం ఖాయం . అనుకున్న లక్ష్యంగా కోసం రాహుల్ అవిశ్రాంతంగా కృషిచేస్తారు. సానుకూల దృక్పథమే స్ఫూర్తిగా పనిచేస్తారు' అని దిగ్విజయ్ అన్నారు. ''క్రియాశీలక కార్యకర్తల సంఖ్య పరంగా చూస్తే బీజేపీ 'ఆర్గనైజేషన్' కంటే కాంగ్రెస్ కాస్త వెనుకబడిందనే చెప్పాలి. కాంగ్రెస్ ముఖ్య నేతల మధ్య సమన్వయం తగ్గింది. అయితే, ఇప్పుడు భారత్ జోడో యాత్ర ద్వారా లక్షలాది మంది స్వస్థలాలను వదిలి మరీ పాదయాత్రలో కదం తొక్కుతున్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇలాంటి జనోద్యమాల ద్వారానే నాయకులు పుట్టుకొస్తారు' అని వ్యాఖ్యానించారు. ''పార్టీ ఘన గత చరిత్రతో పోలిస్తే ఇప్పుడు క్షేత్రస్థాయిలో బలహీనంగా తయారై సమస్యలను ఎదుర్కొంటోంది. యాత్ర ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీని మళ్లీ బలోపేతం చేసేందుకు యత్నిస్తున్నాం. గ్రామాలు, పట్టణాలు ఇలా ప్రతిస్థాయిలో యాత్రలో సమన్వయం కోసం ప్రతీ రాష్ట్రంలో, జిల్లాలో సమన్వయకర్తలను నియమించాం. యాత్రలో కార్యకర్తలు మొదలుకొని నేతలంతా భాగస్వాములయ్యేలా చేశాం. ఇది పార్టీ క్షేత్రస్థాయి పటిష్టతకు బాటలుపరుస్తుంది. ఇంటింటికీ వెళ్లి అభిప్రాయాలు సేకరించాలని స్థానిక నేతలకు సూచించాం. యాత్రతో చేకూరిన మేలు ఏంటంటే.. అది మీడియా దృష్టిలో పడటం' అని అన్నారు.

సాక్షి విజయనగరం

సోమవారం । 10 । అక్టోబర్ । 2022

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు గణేష్



బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగికి చెందిన రాపాక గణేష్ ఈనెల 15 నుంచి 19 వరకు బెంగళూరులో జరగబోయే 61వ ఓపెన్ నేషనల్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున 100మీటర్లు, 200మీటర్లు పరుగు పోటీలకు ఎంపికై తన ప్రతిభ చాటుకున్నాడు. బిలాస్‌పూర్‌లో జరిగే అండర్ 23కు 100మీటర్లు, 200మీటర్ల పరుగు పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పి.సతీష్ తెలిపారు. గణేష్‌ను పలువురు అభినందించారు.

ఏయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

విజయనగరం అర్బన్: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 10, 11 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఈ నెల 19, 20 తేదీలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మార్పును విద్యార్థులు గమనించి ఆయా తేదీలలో పరీక్ష రాయడానికి హాజరు కావాలని తెలిపారు.

నేడు దేవదాయ శాఖ మంత్రి జిల్లాకు రాక

విజయనగరం టౌన్: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ సోమవారం జిల్లాకు వస్తున్నారు. సోమవారం రాత్రి నగరానికి చేరుకుంటారు. 11న మంగళవారం ఉదయం 9 గంటలకు పైడితల్లి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం 10.30 గంటలకు విశాఖ బయలుదేరి వెళ్లనున్నారు.

న్యూస్‌రీల్

'మడ్డువలస'లో పెరిగిన నీటి మట్టం



ప్రాజెక్టు వద్ద విడిచిపెడుతున్న నీరు

వంగర: మండలంలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద 16వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఆదివారం నమోదైంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 16,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. దీంతో 62.47 మీటర్ల లెవెల్‌కు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు వద్ద రెండు గేట్లు ఎత్తి 16వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్లు ఏఈ నితిన్ తెలిపారు.

రామతీర్థంలో వైభవంగా మహా పూర్ణాహుతి



ఉమాసదాశివాలయంలో మహాపూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో కామాక్షి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం కామాక్షి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించి కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు హోమాలు చేపట్టి మహా పూర్ణాహుతి జరిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటరుగా నమోదు కావాలి : కలెక్టర్



పార్వతీపురం సెయింట్ పీటర్స్ పాఠశాలలో ఓటరు నమోదుపై ఆరా తీస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: యువత ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చా రు. పార్వతీపురం సెయింట్ పీటర్స్ పాఠశాల, మండల పరిధిలోని అడ్డాపుశీలలోని పాఠశాల, గరుగుబిల్లి మండల కేంద్రంలోని పాఠశాలలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఓటర్లు గా నమోదు కావాలని పిలుపునిచ్చారు. బూత్‌స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓటరు నమోదుకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నవంబర్ 19, 20, డిసెంబర్ 3, 4తేదీలలో జరుగుతుందన్నారు. 2023 జనవరి 5వ తేదీన తుది జాబితా ప్రచురించనున్నట్టు తెలిపారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నవంబర్ 7వరకు చేసుకోవచ్చునని కలెక్టర్ వెల్లడించారు. గతంలో వున్న పట్టభద్రుల ఓటరు జాబితా రద్దయిందని, ప్రతీ పట్టభద్రుడు కొత్తగా ఓటరుగా నమోదు కావాలన్నారు.

బంజకుప్పలో ఒంటరి ఏనుగు



సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

కొమరాడ: గజరాజులు గుంపు నుంచి విడిపోయిన ఒంటరి ఏనుగు శనివారం అర్ధరాత్రి విక్రంపురం, దంగభద్ర రహదారిపై హల్‌చల్ చేసింది. ఆదివారం సాయంత్రానికి జంఝావతి రబ్బరు డ్యాం దాటి బంజకుప్ప గ్రామ సమీపంలోకి వచ్చింది. ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

ఉత్సవం... తరగని ఉత్సాహం



ఎడతెరిపిలేని వర్షాలు ఒక వైపు...తరగని ఉత్సాహం మరోవైపు... వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు విజయనగరం ఉత్సవాల్లో తొలి రోజు అడుగులు వేశారు...అంతే వేలాదిగా ప్రజలు ఉల్లాసంగా వారి వెంట నడిచారు. ఉత్సవాల తొలి రోజున ఫుల్ జోష్ నింపారు. ర్యాలీతో పట్టణమంతా సందడి నెలకొనగా.. ఫల పుష్ప ప్రదర్శన, కళా జాతరలు, విద్యార్థుల బ్యాండ్ మేళాలు.. ఇలా దేనికదే విజయనగరం ఉత్సవాల్లో తొలి రోజు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

- వర్షంలోనూ ఉల్లాసంగా భారీ ర్యాలీ
- పురవీధుల్లో జానపద కళల జాతర
- ర్యాలీని ప్రారంభించిన మంత్రి బొత్స సత్యనారాయణ
- చిందేసిన ఎమ్మెల్సీ రఘురాజు, ఆర్డీఓ సూర్యకళ



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన



విజయనగరం ఉత్సవంలో ఆకట్టుకున్న గురుకుల చిన్నారుల నృత్య ప్రదర్శన

విజయనగరం అర్బన్:

అబ్బురపరిచే కళారూపాలు.. ఆకట్టుకొనే జానపద ప్రదర్శనలు, ఉరకలెత్తే ఉత్సాహంతో విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ ర్యాలీని శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పెనుమత్స సురేష్‌బాబు, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎస్పీ ఎం.దీపిక, జేసీ మయూర్ అశోక్ తదితరులు తిలకించారు. వివిధ జానపద కళారూపాలు, విద్యార్థుల ప్రదర్శనలతో వర్షంలో సైతం ర్యాలీ ఆద్యంతమూ ఉత్సాహంగా సాగింది. కేరళ కళాకారులతో ఎమ్మెల్సీ రఘురాజు, డీఆర్‌ఓ సూర్యకళ పాదం కలిపి చిందేయడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారిని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సైతం ఉత్సాహ పరిచారు. జిల్లా ఉత్సవాల చరిత్రలో అత్యంత భారీ ర్యాలీని నిర్వహించారు. రోలర్ స్కేటర్స్, పైడితల్లి అమ్మవారి ఘటాలు, నాదస్వరం, నవదుర్గలు, ఆగమ, పండితుల బృందం, సంగీత కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల ర్యాలీ, జిల్లా కవులు, రచయితల ర్యాలీ, థింసా నృత్యం, సచివాలయాల బృందం, వలంటీర్లు, బాలికల బ్యాండ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తప్పెటగుళ్లు, పట్టణ లెటరింగ్ కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహాత్మాగాంధీ, నెహ్రూ, అంబేద్కర్, కందుకూరి, టంగుటూరి, గురజాడ, ఆదిభట్ల నారాయణదాసు వేషధారణ, కోలాటం, అల్లూరి, గిడుగు, కోడి రామ్మూర్తి వేషధారణలో చిన్నారులు అలరించారు. మెడికల్, ఇంజినీరింగ్ విద్యార్థులు, కేరళ డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ బ్యాండ్, టీటీడీ భక్తుల కోలాటం, దేవుడి దాసులు, డప్పు వాయిద్యాలు, వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ సూర్యకళ, ర్యాలీ సమన్వయం కర్త సుధాకర్, ఇన్‌చార్జ్ అధికారులు, పలువురు ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ ర్యాలీలో గురుకుల చిన్నారుల నృత్యాలు

విజయనగరం కీర్తిని ఇనుమడింపజేయాలి

- ఉత్సవ కార్యక్రమాలు విజయవంతం చేయాలి
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం టౌన్:

విజయనగరం ఉత్సవాలలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేసి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఉత్సవాల ప్రారంభం రోజున ఆదివారం నిర్వహించిన ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆనందగజపతి ఆడిటోరియంలో జరిగిన ప్రారంభోత్సవ సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అశేష ప్రజానీకం ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసారని, ఇదంతా అమ్మవారి కృపా కటాక్షమని పేర్కొన్నారు. కోవిడ్ వల్ల గత రెండేళ్లుగా ఉత్సవాలకు దూరంగా ఉన్నామని, ఈ ఏడాది ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా ఒక్కటై ఉత్సాహంగా ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, చక్కగా కార్యాచరణను రూపొందించారని కలెక్టర్‌ను అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి శాసనసభ ఉప సభాపతి పదవిని ఇచ్చి గౌరవించడం జిల్లా గౌరవాన్ని పెంచినట్లయ్యిందని పేర్కొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం : ఉప సభాపతి కోలగట్ల

జిల్లా నుంచి అనేక మంది కళాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తాను చాటుతున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా కళాకారులను అన్నివిధాలా ఆదుకుంటున్నారని ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. విజయనగరం ఉత్సవాలలో వినోదాన్ని పంచాలనే పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాకు చెందిన కళలకు ఆదరణ తగ్గకూడదనే పులివేషాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నాటకరంగం కళాకారుల కో సం పలు నాటకాలు, నాటికలు, ఏకపాత్రాభినయా లు, పోటీలు ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు.

మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాలి : కలెక్టర్

వరుణుడు పరీక్ష పెట్టినా తగ్గేదేలే అంటూ ముందుకు వెళ్లామని, అందరి సహకారంతో ర్యాలీ విజయవంతమైందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వా సులంతా బాధ్యతాయుతంగా పాల్గొనడం విశేష మని, ఈ ఉత్సవం అందరి మదిలో తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుందని అన్నారు. ఉత్సవాల కోసం విరాళాలు అందించిన వారికీ పేరు పేరునా ధన్యవాదాలని అన్నారు. సభా సమావేశం అనంతరం మహారాజ సంగీత కళాశాల ఆధ్వర్యంలో గాత్ర కచేరి జరిగింది. అనంతరం సంగీత నృత్య పోటీల లో పాల్గొన్న వారికీ సెమీఫైనల్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు డా.సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, కడుబండి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయ ర్ రేవతిదేవి, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, ఎస్పీ దీపిక, డీఆర్వో గణపతిరావు పాల్గొన్నారు.



విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ సూర్యకుమారి

అట్టహాసంగా...

విజయనగరం: అబ్బురపరిచే కళారూపాలు, ఆకట్టుకొనే జానపద ప్రదర్శనలు, ఉరకలెత్తే ఉత్సాహంతో విజయనగర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. ర్యాలీ మహారాజా కోట మీదుగా సింహాచలం మేడ వరకు సాగింది. సుమారు 52 విభాగాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. అనంతరం 9 వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ముఖ్యఅతిథులు ప్రారంభించారు.

నేటి కార్యక్రమాలు

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా అయోధ్య మైదానంలో సాయంత్రం 6 గంటలకు మెగా మ్యూజికల్ నైట్, ఉదయం 10 గంటల నుంచి డ్వాక్రా బజారు, ఫుడ్ ఫెస్టివల్, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి పెట్‌షో ఉంటాయి. అదే విధంగా ఆనందగజపతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి శాస్త్రీయ సంగీత నృత్యపోటీలు నిర్వహించనున్నారు. గురజాడ కళాభారతిలో ఉదయం 10 గంటల నుంచి ఏకపాత్రాభినయ నాటికల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ఫల, పుష్ప ప్రదర్శన, మహారాజ కోటలో సైన్స్ ఫేర్, ఫొటో ఎగ్జిబిషన్, స్టాంప్స్, కాయిన్ ఎగ్జిబిషన్, శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రాచీన గ్రంథ ప్రదర్శనలు, అష్టావధానం, కవి సమ్మేళనం, పద్యపఠనం ఉంటాయి. రాజీవ్ స్టేడియంలో ఉదయం 10.30 గంటలకు బ్యాడ్మింటన్ ఫైనల్స్ విజేతలకు బహుమతి ప్రదానం, వివిధ ఆటల పోటీలు, లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు జానపద కళలు, క్రీడలు నిర్వహిస్తారు.

తొలి ఏరుకు వేళాయె..

సిరుల తల్లి పండగంటేనే సర్వత్రా సంతోషం. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల పాలిట కొంగుబంగారం శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో కీలక ఘట్టమైన తొలేళ్ల ఉత్సవానికి తెర లేచింది. సోమవారం జరగనున్న తొలేళ్ల ఉత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజవంశీకులు అమ్మవారికి ఆనవాయితీ ప్రకారం పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

- నేడు పైడితల్లి తొలేళ్ల ఉత్సవం
- సిరిమానోత్సవం రేపు
- పట్టువస్త్రాలు సమర్పించనున్న రాజవంశీకులు

విజయనగరం టౌన్:

శ్రీపైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరానికి సర్వం సిద్ధమైంది. అమ్మవారి అనుగ్రహంతో వచ్చిన విత్తనాలను వేసి నాగలి (ఏరు)తో తొలుత దున్నాలి. దానినే తొలి ఏరు అని.. తొలేళ్లని పిలుస్తారు. అమ్మవారి సిరిమానోత్సవానికి ముందు రోజు దీన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. పంటకు ఎలాంటి విపత్తులూ, చీడపీడల బాధలూ, దరి చేరకూడదనేది రైతు కోరిక. వారి కోసం నిర్వహించేదే తొలేళ్ల ఉత్సవం. తొలేళ్ల రోజు రాత్రి చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలను కోటలోకి తీసుకువెళతారు. అక్కడ కోటకు పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వచనం పొందిన విత్తనాలను బస్తాలతో ఉంచుతారు. సిరిమాను పూజారి చేతులతో ఆ విత్తనాలను అందించి అమ్మ ఆశీర్వదిస్తుంది. ఆ విత్తనాలను రైతులు తమ బస్తాలలో కలిపి పొలాల్లో చల్లుతారు. మంచి దిగుబడులు సాధిస్తారు.



అమ్మవారికి ఘటాలను తీసుకువెళ్తున్న భక్తులు

పండగ శోభ

విజయాలకు ప్రతీకగా నిలిచిన విద్యల నగరమైన విజయనగరి అమ్మవారి తొలేళ్ల సంబరాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం వరకూ అమ్మవారి దర్శనభాగ్యం భక్తులకు కలిగించే విధంగా ఏర్పాట్లు చేశారు. వీఐపీ పాసులు ఎవరికీ లేకుండా భక్తులందరికీ దర్శనం కలిగేలా చేశారు. సుమారు మూడు వేల మంది పోలీసు బలగాలను ఉత్సవ విధులకు కేటాయిస్తూ ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలు జారీ చేశారు. ఇటు రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి, మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ప్రాంతమంతా విద్యుత్ శోభతో అలరారుతోంది. మరోవైపు విజయనగర ఉత్సవాల సందడితో చారిత్రాత్మక కట్టడాలన్నీ విద్యుత్ అలంకరణలతో శోభయామానంగా తయారైంది. మహారాజ కోట, గంటస్తంభం, ఆనందగజపతి కళాక్షేత్రం, మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, మయూరి కూడలి నుంచి రైల్వేస్టేషన్ వనంగుడి మీదుగా సీఎంఆర్ జంక్షన్ వరకూ విద్యుత్ లైట్లు ఆకట్టుకుంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించడంతో పాటూ పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారు ఆలయమంతా పుష్పశోభితంగా విరాజిల్లుతోంది. తల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, అధికారులు, నాయకులు సన్నద్ధమయ్యారు.


తొలేళ్ల రోజు ప్రధాన ఘట్టాలు



పైడితల్లి అమ్మవారు

- వేకువజామున 3 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరుగుతాయి.
- ఉదయం రాజవంశీకులు, మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు.
- రాత్రి 10.30 గంటలకు భాజాభజంత్రీలతో అమ్మవారి ఘటాలకు పూజలు చేసేందుకు కోటలోకి పూజారులు వెళ్తారు. కోటశక్తికి, అమ్మవారి ఘటాలకు పూజాధికాలు నిర్వహిస్తారు.
- ఘటాలను తిరిగి చదురుగుడి వద్దకు తీసుకు వచ్చి గుడి ఎదురుగా ఉన్న బడ్డీలా ఏర్పాటు చేసిన వాటిపై భక్తుల సౌకర్యార్థం ఉంచుతారు. అమ్మవారి దర్శనానికి అవకాశం లేని వారందరూ అక్కడే పసుపు,కుంకుమలను సమర్పించి, మొక్కుబడులు చెల్లిస్తారు.
- ఘటాలను తీసుకువచ్చిన తర్వాత పూజారి అమ్మవారి చరిత్ర చెప్పి రైతులకు ధాన్యాన్ని పంచుతారు. రైతులు ఆ విత్తనాల కోసం బారులు తీరుతారు.

ప్రకృతి కనువిందు



ప్రకృతి అందాలకు ప్రత్యక్ష తార్కాణంలా ఈ చిత్రం చూపరులను ఆదివారం కట్టిపడేసింది. పచ్చని చెట్లు..కొండలను తాకుతూ పలకరించేలా మేఘాలు ఇలా కనువిందు చేశాయి. నెల్లిమర్ల పట్టణంలో చంపావతి నది వద్ద మిమ్స్ సమీపంలో ఈ దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది. - నెల్లిమర్ల

ఎస్పీ స్పందన రద్దు

విజయనగరం క్రైమ్: శ్రీపైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలెవరూ రావద్దని కోరారు.

క్లుప్తంగా

వైద్యాధికారి పోస్టుకు ఇంటర్వ్యూ

పార్వతీపురం టౌన్: వైద్యాధికారి పోస్టు నియామకానికి ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఒప్పంద ప్రాదిపదికన పార్వతీపురం మన్యం జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో ఒక ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ఈ నియామకం జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూ ఈనెల 13న ఉదయం 11 గంటలకు విజయనగరం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జరుగుతుందని అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహా గెజిటెడ్ అధికారి సంతకాలతో జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ ధ్రువీకరణ పత్రంతో పాటు మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసి ఉండాలని స్పష్టం చేశారు.

పెన్షనర్ల నెలవారీ సమావేశం వాయిదా

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్ల నెలవారీ సమావేశాన్ని ఈనెల 17కు వాయిదా వేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎ.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా రెండో సోమవారం సమావేశం జరగాల్సి ఉందని తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా, విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల దృష్ట్యా సమావేశాన్ని ఈనెల 17కు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈవిషయాన్ని పెన్షనర్లు గమనించాలని కోరారు.

రైలు ప్రమాద మృతుడి గుర్తింపు

నెల్లిమర్ల: పట్టణ పరిధిలో శనివారం జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందిన వృద్ధుడిని మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన మీసాల పైడితల్లి(65)గా గుర్తించినట్లు శ్రీకాకుళం జీఆర్పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రాస్పత్రికి మృతుడి బంధువులు ఆదివారం విచ్చేసి, గుర్తించినట్లు చెప్పారు. పైడితల్లి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మరణించినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు అబ్బాయిలున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు చెప్పారు.

మతిస్థిమితం లేని మహిళకు అంత్యక్రియలు


మృతిచెందిన వృద్ధురాలు అచ్చియ్యమ్మ

జామి: మతిస్థిమితం లేని వృద్ధ మహిళకు పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా మహరాణి పేటకు చెందిన గోరిశెట్టి అచ్చియ్యమ్మ(65) మండలంలోని జాగరం గ్రామం సమీపంలో రహదారి పక్కన మృతిచెంది ఉడి ఉంది. స్థానికులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమచారం అందించారు. దీంతో ఏఎస్సై నర్సింగరావు ఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. మతిస్థిమితం లేకుండా అనాథలా తిరుగుతోందని స్థానికులు తెలిపారు.దీంతో వీఆర్వో నారయణరావు, ఏఎస్సై నర్సింగరావు తదితరులు వృద్ధురాలికి అంత్యక్రియలు జరిపించారు. వృద్ధురాలికి భర్త, పిల్లలు ఎవరూలేరు. ఆమె దూరపు బంధువులు విషయం తెలుసుకుని వచ్చి మతిస్థిమితం లేక తిరుగుతోందని పోలీసులకు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు.

ఆవు, కోళ్లు సజీవ దహనం


కొల్లాయివలసలో అగ్నిప్రమాదంలో మృతి చెందిన ఆవు

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఆవు, 10 కోళ్లు సజీవ దహనం చెందాయి. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చేట్ల ఆదోడు తన పూరిపాకలో ఆవులతో పాటు కోళ్లను ఎప్పటిలాగా రాత్రి వేళ ఉంచాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో పూరిపాకలో అగ్ని ప్రమాదం సంభవించి ఒక ఆవు, 10 కోళ్లు ప్రమాదంలో మృతిచెందాయి. మరో రెండు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. మృతి చెందిన ఆవు, కోళ్లను పశువైద్యాధికారి పరిశీలించి ఘటనపై వివరాలు సేకరించారు. గాయపడిన ఆవులకు పశువైద్యాధికారులు చికిత్స చేస్తున్నారు. పిడుగు పడి అగ్నిప్రమాదం సంభవించిందా? లేదా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా ఘటనకు పాల్పడ్డారా? అనే విషయమై ఆరా తీస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	50,200–00
బంగారం(22కె. 10గ్రా.)	46,000–00
వెండి (కిలో)	60,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

అభాగ్యులకు అండదండలు

- మన ఊరు–మన పోలీస్ వినూత్న కార్యక్రమం
- గ్రామసుల్త సమస్యల పరిష్కారం కోసం అమలు
- బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక దాడుల నిర్మూలనే ధ్యేయం
- వారంలో మూడు రోజుల పాటు నిర్వహణ




సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు(ఫైల్)

జిల్లాలో గ్రామాల వివరాలు	
మండలాలు	15
సచివాలయాలు	312
పంచాయతీలు	451
రెవెన్యూ గ్రామాలు	980
మహిళా పోలీసులు	312 మంది
పోలీస్ స్టేషన్లు	21
పోలీసు సిబ్బంది	800 మంది

పార్వతీపురంటౌన్: గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు యంత్రాంగం రాష్ట్రంలో తొలిసారిగా మన ఊరు–మన పోలీస్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 980 రెవెన్యూ గ్రామాల పరిధిలో గిరిజన, మారుమూల, సుదూర ప్రాంతాలు ఎక్కువ ఉండడంతో చట్టాలపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి వారిలో మూఢనమ్మకాలను తొలగించి చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం. బాల్య వివాహాలు, బాలికలపై లైంగికదాడులు, మూఢనమ్మకాలు, సారా తయారీ, విక్రయం వంటి సామాజిక రుగ్మతలు పలు చోట్ల కన్పిస్తున్న నేపథ్యంలో వాటిని తరిమికొట్టడానికి జిల్లా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి వారంలో మూడు రోజుల పాటు ఎస్పీ స్థాయి అధికారి నుంచి ఎస్సై స్థాయి అధికారి ప్రతి గ్రామంలో కనీసం ఒక గంట పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. ప్రజల సమస్యలు, వారి అవసరాలు తదితర అంశాలను సేకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారు. మిగిలిన వివరాలు కలెక్టర్‌కు అందజేసి పరిష్కారం చూపిస్తారు. గ్రామాల్లో సామాజిక రుగ్మతలు పోవాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు, పోలీసు యంత్రాంగాన్ని మరింత చేరువ చేయనున్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట

జిల్లాలో బాల్యవివాహాలు జరగకూడదనే లక్ష్యంతో పోలీసులు అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా బాలల సంరక్షణతో పాటు ఐసీడీఎస్ అధికారులతో ప్రతి గ్రామంలో పోలీసు సిబ్బంది అవగాహన కల్పిస్తారు.

మూఢనమ్మకాలకు బలికాకుండా..

జిల్లాలో ఎక్కువగా గిరిజన గ్రామాలు, పట్టణానికి మారుమూలన, సుదూరంగా ఉండడం వల్ల ప్రజలు మూఢనమ్మకాలకు బలికాకుండా ప్రతి గ్రామంలో అవగాహన కల్పించనున్నారు. మూఢనమ్మకాల పట్ల చైతన్యం పెంచుకునేలా, చదువుపై దృష్టి సారించేలా మహిళా పోలీసులతో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మూఢనమ్మకాలు, క్షుద్రపూజల పేరిట హత్యలు జరగకుండా చర్యలు చేపట్టారు. చిల్లంగి, చేతబడి చేశారన్న గొడవలు, హత్యలకు పాల్పడితే వేసే శిక్షలపై అవగాహన కల్పిస్తారు.

సారా రక్కసిని తరిమికొట్టేందుకు..

ఇప్పటికే 170 గ్రామాల్లో సారా తయారీ విక్రయాలు, వాటిపై ఆదాయం, ప్రత్యామ్నాయ జీవనోపాధి తదితర అంశాలపై మహిళా పోలీసులతో సర్వే చేపట్టారు. వాటిపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. గ్రామాలలో సారా తయారీ, రవాణా, అమ్మకాల వల్ల జరిగే నష్టాలు, విధించే శిక్షలపై ఎస్ఈబీ అధికారులతో ప్రతి గ్రామంలో అవగాహన కల్పించనున్నారు.

గ్రామాల్లో సామాజిక రుగ్మతలు లేకుండా చేసేందుకే



గ్రామాల్లో సామాజిక రుగ్మతలు లేకుండా చేసేందుకే మన ఊరు–మన పోలీస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. బాల్య వివాహాలు, బాలికలపై లైంగికదాడులు, మూఢనమ్మకాలు, సారా వంటి సామాజిక రుగ్మతలు లేకుండా అవగాహన కల్పిస్తాం. ప్రజల సమస్యలు వారి అవసరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతాం. జిల్లాలోని 980 రెవెన్యూ గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాం. ప్రజలకు, పోలీసు యంత్రాంగం మరింత చేరువ చేసేందుకే ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా జిల్లాలో ప్రారంభిస్తున్నాం.

– విద్యాసాగర్‌నాయుడు, ఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా

నిర్దేశిత ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్



రూట్ మ్యాప్

విజయనగరం క్రైమ్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ ఎం.దీపిక ఆదివారం తెలిపారు. అమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేకంగా వివిధ పార్కింగ్ ప్రదేశాలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు పోలీస్‌సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్ స్థలాల వివరాలను విడుదల చేశారు.

వాహనాల పార్కింగ్ ప్రాంతాలు

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా అయోధ్యా మైదానం, రాజీవ్‌స్టేడియం, ప్రకాశం పార్కు, ఇండోర్ స్టేడియం, రామానాయుడు రోడ్డు, పెద్దచెరువు గట్టు, అయ్యకోనేరు గట్టు, ఫోర్ట్‌సిటీ స్కూల్ రోడ్డు, ఎస్‌వీఎన్.నగర్ రోడ్డు, బొబ్బాది టిఫిన్ సెంటర్, ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకూ గల రింగురోడ్డు ప్రాంతాల్లో ప్రజలు వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు స్థలాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు సూచనలు, సమాచారం ఇచ్చేందుకు వాహనాలకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్ ఏర్పాటుచేశారు.

- చీపురుపల్లి, నెల్లిమర్ల పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొత్తపేట నీళ్లట్యాంక్ జంక్షన్ నుంచి రాజీవ్ స్టేడియం, ప్రకాశం పార్క్, ఇండోర్ స్టేడియంలో పార్కింగ్ చేసుకోవాలి.
- బొబ్బిలి, గజపతినగరం ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు కలెక్టరేట్ మీదుగా ఎత్తుబ్రిడ్జి, మయూరి జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్‌కు వచ్చి అయోధ్యా మైదానంలో పార్కింగ్ చేసుకోవాలి.
- ఎస్.కోట, గంట్యాడ మీదుగా వచ్చేవాహనాలు కలెక్టరేట్ మీదుగా బాలాజీ మార్కెట్, గూడ్స్‌షెడ్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, పెద్దచెరువుగట్టు మీదుగా వచ్చి రామానాయుడు రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి.
- విశాఖ, కొత్తవలస నుంచి వచ్చే వాహనాలు జిల్లా కోర్టు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా వచ్చి అయోధ్యా మైదానంలో పార్కింగ్ చేసుకోవాలి.
- ఐనాడ, ధర్మపురి ప్రాంతాల మీదుగా వచ్చే వారు ఐస్ ఫ్యాక్టరీ, రింగురోడ్డులో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలి.
- శ్రీకాకుళం, డెంకాడ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు రాజీవ్ నగర్ కాలనీ, దాసన్నపేట వచ్చి అయ్యకోనేరు గట్టు వద్ద పార్కింగ్ స్థలంలోనూ, మరికొన్ని వాహనాలు రాజీవ్‌నగర్ కాలనీ మీదుగా ఎస్‌వీఎన్ నగర్, ఫోర్ట్‌సిటీ స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలి.

వీఐపీ పార్కింగ్ ప్రదేశాలు

వీఐపీ వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బొంకుల దిబ్బ, కోటలోపల, టీటీడీ కల్యాణ మంటపం, గురజాడ కళాక్షేత్రంలో పార్కింగ్ చేసుకోవాలి.

ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి

- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స


కలెక్టరేట్ జంక్షన్ వద్ద ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం రాజకీయాలకు అతీతంగా జిల్లా కేంద్రం విజయనగరంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ విషయంలో డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నారని చెప్పారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి గురించి ఎవరైనా అవాస్తవాలు మాట్లాడితే వారి విజ్ఞతకే వదిలేస్తామని కొట్టిపారేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక దాసన్నపేటలో ఉన్న నీలాటి చెరువు వద్ద విజయనగరం కార్పొరేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐలాండ్‌ను, వాకింగ్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే కలెక్టర్ ఆఫీస్ జంక్షన్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ అభివృద్ధి చేసిన పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ నగరాన్ని నవీకరణ దిశగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి స్వీయ పర్యవేక్షణలో అన్ని ప్రాంతాలలో అభివృద్ధి జరుగుతోందన్నారు. పట్టణం నుంచి కార్పొరేషన్ స్థాయికి రూపాంతరం చెందిన తర్వాత అదే తరహాలో పట్టణాన్ని అన్ని విధాలా తీర్చిదిద్దుతుండడం అభినందనీయమన్నారు. కలెక్టర్ ఆఫీస్ జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ అభివృద్ధి చేస్తూ ఫౌంటెన్ ఏర్పాటు చేయడం చూపరులను ఆకట్టుకుంటుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేసేందుకే తమ ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. నగరంలో తాగునీరు, పారిశుద్ధ్యం, లైటింగ్, రహదారుల కల్పన వంటి మౌలిక సదుపాయాలను ప్రణాళికా బద్ధంగా కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ఏఎంసీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదగా ప్రవర్తించండి : డీఐజీ


పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ, ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులతో భద్రతా సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సూచించారు. అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవ సంబరాల విధులను నిర్వహించేందుకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సెక్టార్లలో ఏర్పాటుచేసిన బందోబస్తులో ఎవరు, ఏ విధమైన విధులు నిర్వహించాలన్న విషయాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. వారు విధులు నిర్వహించే ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. క్రైమ్ టీమ్‌లు గస్తీలు నిర్వహించాలని, అనుమానితులు, పాత నేరస్తులను గుర్తించి ముందుగా అదుపులోకి తీసుకోవాలన్నారు. ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా వెంటనే సెక్టార్ ఇన్‌చార్జిల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఏ సెక్టారులో సమస్య ఉన్నా సామరస్యంగా వ్యవహరించి, పరిష్కరించాలన్నారు. అదనపు సిబ్బంది అవసరమైతే కమాండ్ కంట్రోల్‌కి సమాచారమిస్తే వెంటనే అక్కడకు సిబ్బంది సకాలంలో చేరుకుంటారన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సిరిమానోత్సవం ముగిసిన తర్వాత ఎవరూ బాధ్యతారాహిత్యంగా విధుల నుంచి వెళ్లిపోవద్దన్నారు. ఉన్నతాధికారులు తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకూ తమకు కేటాయించిన ప్రాంతంలోనే బందోబస్తు విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.శ్రీదేవీరావు, అదనపు ఎస్పీ పి.సత్యన్నారాయణరావు, విజయనగరం ఇన్‌చార్జి డిఎస్పీ టి.త్రినాథ్, డీఎస్పీలు ఎల్.మోహనరావు, బి.మోహనరావు, ఎ.సుభాష్, ఆర్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, మహేష్, ప్రసాదరావు, వెంకట అప్పారావు, శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రి, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

- నేడు విజేతలకు బహుమతి ప్రదానం


బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా, స్థానిక రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన విజయనగరం ఓపెన్ మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 17 మంది విజేతలుగా నిలిచారు. వారికి సోమవారం ఉదయం 10.30 గంటలకు బహుమతి ప్రదానం జరగనుంది. పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామానందం, జిల్లా యువజన సంక్షేమాధికారి విక్రమాదిత్య, చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు పర్యవేక్షించారు. పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు

ఉత్సవాల్లో భాగంగా రాజీవ్‌క్రీడామైదానం ప్రాంగణంలో ఉత్తరాంధ్ర స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఈశ్వర్ కౌశిక్, కాళ్ల సూరిబాబులు తెలిపారు. ఒక్క రోజు పాటు నిర్వహించే పోటీలు అర్ధరాత్రి వరకు సాగుతాయన్నారు. ఈ పోటీలను ప్రేక్షకులు వీక్షించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

కడుపునొప్పితో వ్యక్తి మృతి

గంట్యాడ: కడుపునొప్పి బాధ పడుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. గంట్యాడ మండలం బుచ్చి అప్పారావు జలాశయం(తాటిపూడి) ఆవతల ఉన్న దిగువ కొండపర్తి గ్రామానికి చెందిన కరాచి జోగులు (46)కు ఆదివారం ఉదయం కడుపు నొప్పి రావడంతో కుటుంబసభ్యులు డోలీ సహాయంతో ఎస్.కోట ఆస్పత్రికి తీసుకు వెళ్లడానికి గోస్తనీ నది వద్దకు వచ్చారు. అయితే నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోస్తనీ నది ఉధృతంగా ప్రవహించడంతో నదిదాటించలేక ఇంటికి తీసుకువెళ్లిపోయారు. కడుపు నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక జోగులు చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అబ్బుర పరిచిన ఫల, పుష్ప ప్రదర్శన

- తిలకించిన మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- వివిధ పండ్లు, చెట్ల ప్రదర్శన ఏర్పాటు చేసిన ఉద్యానశాఖ


ఫల, పుష్ప ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావులు


సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న జేసీ మయూర్ అశోక్


సంగీత కళాశాలలో పండ్ల ప్రదర్శన


పుష్పప్రదర్శన

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో ఎం.ఆర్.సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన అబ్బురపరిచింది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పండ్లు, కూరగాయలు, చెట్లు, ఔషధమొక్కలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల నమూనాలను తిలకించి బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నగర్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, కలెక్టర్ సూర్యకుమారి, ఎస్పీ దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో గణపతిరావు, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఎ.డి శైలజ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా తాండ్ర

ఈ ఏడాది ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనలో జామ, బొప్పాయి, ద్రాక్ష, పైనాపిల్, సపోటా, తాటి, మామిడి పండ్లతో తయారు చేసిన తాండ్రలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా మరుగుజ్జు మొక్కలను కూడా చాలా మంది ఆశక్తిగా తిలకించారు. చింత చెట్టు (20 సంవత్సరాలు), రావి చెట్టు (28 సంవత్సరాలు), జువ్వి చెట్టు (18 సంవత్సరాలు) గంగిరావి (10 సంవత్సరాలు), మర్రి చెట్టు (25 సంవత్సరాలు) వంటి మరుగుజ్జు చెట్లను, కూరగాయలకు సంబంధించి శాశ్వత పందిళ్లు, నిలువు పందిళ్లు, మిద్దె తోటలు, పెరటి తోటలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్

ఫల, పుష్ప ప్రదర్శనలో ప్రకతి వ్యవసాయంపై ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. దేశీయ వరి రకాలైన నవారా, బ్లాక్ రైస్, రెడ్ రైస్, చిట్టి ముత్యాలు తదితర వరి రకాలు, చిరుధాన్యాలైన చోడి, ఊద, సామ, కొర్ర రకాలను ప్రదర్శనలో ఉంచారు. అదేవిధంగా ప్రకృతి సాగు పద్ధతిలో పురుగులు, తెగులు నివారించడానికి వినియోగించే ద్రవజీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, ఘనాజీవామృతం ప్రదర్శించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోటప్రాంగణంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఒక్కో ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను విద్యార్థులు సందర్శకులకు వివరించారు. సంబంధిత సైన్స్‌ఫెయిర్‌ను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించి కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు,డిప్యూటీ డీఈఓలు కె.వాసుదేవరావు, ఎన్‌టి నాయుడు, ఉపాధ్యాయులు సన్యాసిరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

13న వైద్యాధికారి పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన వైద్యాధికారి పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ ఎస్.వి.రమణకుమారి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న మూడు వైద్యాధికారి పోస్టుల్లో అర్హులైన వారిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పొందడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కౌన్సిల్ నందు రిజిస్టర్ అయి ఉండాల్సి ఉంటుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై ఏడాది కాలం పనిచేయుటకు కూడా అదేరోజు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రక్తదాతలే.. ప్రాణదాతలు


రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదాతలే ప్రాణదాతలని జిల్లా సైనిక సంక్షేమ విభాగం అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. భారత వాయుసేన 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక యూత్ హాస్టల్‌లో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ఆరోగ్యమే తప్ప ఎటువంటి నష్టం లేదన్నారు. ఎంతోమంది రక్తం ఇస్తే ఏమైనా అవుతుందేమోనన్న భయంతో రక్తదానానికి ముందుకు రావడం లేదన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయొచ్చని, రక్తదానంపై ఉన్న అపోహలను వీడాలని కోరారు. ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారావు 175వ సారి రక్తదానం చేసి, స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో మురళీధర్, నాగభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్

విజయనగరం టౌన్: జిల్లా తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుపేద తెలగ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లుఅందిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు యెజ్జు మురళీకృష్ణ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి, 2021–22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి, పదో తరగతిలో 500 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన వారు ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఈనెల 23వ తేదీలోగా అభ్యర్థులు 9949356150, 9966778779 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అలరించిన అష్టావధానం


హరికథా గానం చేస్తున్న కళాకారిణి నిర్మల

విజయనగరం టౌన్: సకల కళల సమాహారమైన విద్యలనగరం విజయనగరం ఉత్సవాల్లో భాగంగా కొత్తపేట మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన అష్టావధానం, ప్రాచీన గ్రంథ ప్రదర్శన అలరించాయి. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. రాజమండ్రికి చెందిన తాతా సందీపశర్మ అవధానం చేసి సాహితీవేత్తలను అలరించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కె.బాబూరావు ఆధ్వర్యంలో ఎనిమిది మంది కవులు పద్యపఠనం చేశారు. అలాగే కాళ్ల నిర్మల హరికథా గానం వీక్షకులకు వీనులవిందు చేసింది. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి ఎస్.గోవిందరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతిరావు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికే గ్రామసభలు

రాజాం సిటీ: గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని ఎంజేవలసలో ఆదివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీలో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని, మనం–మన పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్తులకు అవసరమైన అభివృద్ధి పనులు గుర్తించి ఉపాధి నిధులతో చేపట్టాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం, కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణే రామాయణ సారం

బొబ్బిలి రూరల్: ధర్మ పరిరక్షణే రామాయణ సారమని టీటీడీ ప్రచారక్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యుడు బోధనాపల్లి గౌరీనరసింహ ప్రసాద్ తెలిపారు. వాల్మీకి జయంతి పురస్కరించుకుని, మండలంలోని రాముడువలస గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో రామాయణ పారాయణం ఆదివారం చేపట్టారు. తొలుత వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం రామాయణం సారాన్ని నరసింహ ప్రసాద్ వివరించారు.

పైడితల్లి అమ్మవారి చదురుగుడి వద్ద భక్తుల రద్దీ


విద్యుత్ వెలుగుల్లో గంటస్తంభం ప్రాంతం


నగరానికి ఉత్సవ శోభ

- ఘనంగా విజయనగరం ఉత్సవాలు ప్రారంభం
- విద్యుత్ దీపాలంకరణతో కోట, గంట స్తంభం, ఆలయాలకు సరికొత్త రూపు
- యాత్రికులతో కిటకిటలాడుతున్న ప్రధాన రోడ్లు
- పైడితల్లి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు


మద్యంలో మానవుడు నాటికలో ఓ సన్నివేశం


నిమజ్జనం నాటికలో కళాకారుని ప్రదర్శన


విజయనగరం టౌన్: కార్యక్రమాన్ని తిలకిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం:

కళలకు కాణాచి.. విద్యలకు నిలయం.. సాంస్కృతిక రాజధానిగా పేరొందిన విజయనగరం ఉత్సవ శోభను సంతరించుకుంది. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కోవిడ్ మహమ్మారి విజృంభణతో గత రెండేళ్లు ఉత్సవాలకు దూరమైన ప్రజలు ఈ ఏడాది నేరుగా పండగ వాతావరణం వీక్షించేందుకు అవకాశం లభించడంతో నగరంలో సందడి నెలకొంది. మూడు లాంతర్ల జంక్షన్, మెయిన్‌రోడ్డు, డీసీసీబీ రోడ్డు, కోట జంక్షన్, సింహాచలం మేడ జంక్షన్, బాలాజీ జంక్షన్, అయోధ్య మైదానం రోడ్డు పరిసరాలన్నీ ఉత్సవాలు చూసేందుకు వచ్చిన వారితో వారితో కిటకిటలాడుతున్నాయి. ఓ వైపు జోరునా వర్షం కురుస్తున్నా తగ్గని భక్తులు, యాత్రికులు, పర్యాటకుల తాకిడితో నగరం కళకళలాడుతోంది.


అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు

కార్పొరేషన్ సేవలు ప్రారంభం..

మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనుండడంతో ఉత్సవ శోభను తిలకించేందుకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న విజయనగరం కార్పొరేషన్ యంత్రాంగం తమ సేవలను ఇప్పటికే ప్రారంభించింది. విజయనగరం ఉత్సవాలు నిర్వహిస్తున్న 9 వేదికల వద్ద పారిశుద్ధ్య పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. బయో టాయిలెట్లు ఏర్పాటు చేయడం దగ్గర నుంచి మినరల్ వాటర్ సరఫరా కేంద్రాల సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కేంద్రాలను ముందుస్తుగానే ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారంతా బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా ఉండేలా ఈ ప్రత్యేక బయోటాయిలెట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పారిశుద్ధ్య చర్యలపై అధికార యంత్రాంగం, ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి కనబరుస్తున్నారు. ఎప్పకటిప్పుడు అపారిశుధ్య వాతావరణం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో సున్నం, బ్లీచింగ్‌ను పిచికారీ చేయిస్తున్నారు. దీంతో పాటు ప్రధాన మార్గాల వెంబడి నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే ప్రక్రియను టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టారు.

ప్రత్యేక ఆకర్షణగా గంటస్తంభం..

ఉత్సవాల నేపథ్యంలో విజయనగరంలోని ప్రధాన వీధులు, కూడళ్లు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరమంతటా ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలతో నగరం ధగధగలాడుతోంది. ప్రధానంగా ఈ ఏడాది ఆధునీకరణ చేసిన గంటస్తంభం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే విద్యుత్ కాంతులీనుతున్న మహారాజ కోట, వీధి దీపాల స్తంభాలు ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆద్యంతం.. అత్యద్భుతం..

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో కళాకారులు ఏకపాత్రాభినయాలతో చూపరులను ఆకట్టుకున్నారు. నాటక రంగ కళాకారులు నాలుగెస్సుల రాజు, గెద్ద వరప్రసాద్, ఈపు విజయ కుమార్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రదర్శనల్లో స్థానిక కళాకారులు నాటికలు, పౌరాణిక నాటకాల్లోని ప్రధాన ఘట్టాలు, ఏకపాత్రాభినయాలతో అలరించారు. నిమజ్జనం, మద్యంలో మానవుడు, పగ, కోటికొక్కడు, వంటి నాటకాల ప్రదర్శనతో పాటు 20 మంది ఏకపాత్రాభినయం ప్రదర్శనలు చేశారు. సోమవారం నైవేద్యం, కన్యాశుల్కం, రాయి, పద్మవ్యూహం నాటకాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.


సంగీత వాయిద్యాల ప్రదర్శన


సంగీత కళాశాలలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన


నగర ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- హుకుంపేటలో తాగునీటి కుళాయిలు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రానున్న రోజుల్లో నగరంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఆదివారం మండలంలోని హుకుంపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి కనెక్షన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుకుంపేట, జగన్నాథపురం ప్రాంతాల్లోని మొత్తం 400 మందికి తాగునీటి సౌకర్యం కల్పించేలా వీటిని చేయడం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్నప్పుడు తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. హుకుంపేటలో పర్యటించేటప్పుడు మహిళలు తాగునీటి ఇక్కట్లు తెలపగా, బుచ్చన్న కోనేరు, తూర్పు, పశ్చిమ గట్టు ప్రాంతాల వాసులు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని అభ్యర్థించారని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో కుళాయిల ఏర్పాటుకు అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఇప్పుడు దశల వారీగా తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. హుకుంపేటలో పైడితల్లమ్మ ఉత్సవానికి ప్రాధాన్యం ఉండడంతో యుద్ధప్రాతిపదికన కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలో బుచ్చన్న కోనేరు ప్రాంతంలో కూడా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎల్.వరలక్ష్మి, కార్పొరేటర్ ఎం.రమాదేవి, కో–ఆప్షన్ సభ్యురాలు పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


హుకుంపేటలో తాగునీటి కుళాయి ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఆకట్టుకున్న జానపద కళల ప్రదర్శన

- జిల్లా నలుమూలల నుంచి 200 మంది కళాకారులు హాజరు

విజయనగరం: విద్యలనగరం విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని, నగరంలోని లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జానపద కళల ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పులివేషాలు, చిన్నారుల కర్రసాములు, పెద్దల కత్తిసాము విన్యాసాలు, చెక్క భజనలు, జముకుల కథ, కోయ, థింసా నృత్య ప్రదర్శనలతో పాటు డప్పు వాయిద్యాల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 200 మంది కళాకారులు పాల్గొని, తమలోని కళానైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ ప్రదర్శనలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజులు ప్రారంభించగా, కళలకు పుట్టినిల్లుగా పేరొందిన విజయనగరంలో జానపద కళల ప్రదర్శన నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. భావితరాలను కళల వైపు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, భూగర్భ జల విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌వీకే దుర్గాప్రసాద్, స్పార్క్ సొసైటీ ప్రతినిధి భవానీ పద్మనాభం పాల్గొన్నారు.


ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

పాడిరైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

రామభద్రపురం: పాడిరైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాల నాయుడు అన్నారు. స్థానిక పాలసొసైటీ–1 కేంద్రంలో రామభద్రపురం, బాడంగి మండలాలకు చెందిన దాదాపు 40 పాలసొసైటీలకు చెందిన వేతన కార్యదర్శులకు విశాఖ డెయిరీ సరఫరా చేసిన దుస్తులను ఆదివారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాలసొసైటీలకు పాలు సరఫరా చేస్తున్న రైతులు, సొసైటీల సిబ్బంది అనారోగ్యం బారిన పడినప్పుడు సుదూర ప్రాంతంలోని విశాఖ డెయిరీ ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఈ జిల్లాలోనే ఆయా సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలకు డెయిరీ యాజమాన్యానికి తెలియజేయాలని వేతన కార్యదర్శులు కోరారు. అనంతరం ఆయా నేతలు మాట్లాడుతూ ఇదే విషయాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, డైరెక్టర్ శంబంగి అమ్మలు ద్వారా డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. పాడిపశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా పాడిరైతులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందని, వాటిని రైతులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పాల దిగుబడి పెరిగేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణ, వేతన కార్యదర్శులు సీహెచ్ లక్ష్మణ, సీహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.


పాలసొసైటీ వేతన కార్యదర్శులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తదితరులు

వికేంద్రీకరణను అడ్డుకుంటే ఇబ్బందులు తప్పవు

సంతకవిటి: వికేంద్రీకరణతోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. సంతకవిటిలో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. అమరావతిలో రాజధాని రైతుల పేరుతో టీడీపీ కార్యకర్తలు చేస్తున్న పాదయాత్ర ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చేస్తున్న దండయాత్ర అని విమర్శించారు. వికేంద్రీకరణతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖపట్నానికి పరిపాలనా రాజధాని రాకుండా అడ్డుకుంటున్న టీడీపీ నేతలకు ప్రజా సంగ్రామంలో ఇబ్బందులు తప్పవన్నారు. అనంతరం మండలంలో కొండగూడేం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కెంబూరు సూర్యారావు ఇటీవల ప్రమాదానికి గురికావడంతో ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

బొబ్బిలి రూరల్: గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బాడంగి మండలంలోని పింద్రంగివలస గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై ఆ గ్రామ సర్పంచ్ రావాడ తిరుపతి, ఉపసర్పంచ్ కర్రి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కర్రి సత్యారావు, గ్రామ పెద్దలు కొత్తల సత్యనారాయణ, పువ్వల శ్రీను, రౌతు రామకృష్ణ బొబ్బిలి మండలంలోని పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నివాసానికి ఆదివారం వెళ్లి, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో సీసీ రోడ్లు, తాగు, సాగునీరు పుష్కలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

రాజాం సిటీ: హరిహర సుతుడు అయ్యప్పస్వామి దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక శాస్త్ర సమాజంలో గురుస్వామి ఉమాపతిశేషు ఆధ్వర్యంలో పలువురు అయ్యప్పభక్తులు మాలధారణ చేపట్టారు. మండల కాలం ఈ దీక్షలు కొనసాగుతాయని గురుస్వామి తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విజయనగరం పూల్‌బాగ్: నగరంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు బీకేవీ ప్రసాద్, ఐ.శ్రీనివాసరావు, టి.కృష్ణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆచారి కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షుడు ముద్దాడ మధు మాట్లాడుతూ ఆయన రాసిన మహోన్నతమైన ఇతిహాసం రామాయణం ద్వారా శ్రీరాముని చరిత్ర, వారి తత్వబోధను మనకు తెలియజేశారని కొనియాడారు. కార్యక్రమంలో రౌతు భాస్కర రెడ్డి, గొంప అప్పలరాజు పాల్గొన్నారు.

విజయనగరం క్రైమ్: నగరంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణ మహాకావ్యంలో శ్రీరాముని జీవిత చరిత్రను చాలా చక్కగా వివరించారని తెలిపారు. అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని, జీవనం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ సత్యనారాయణరావు

వేడుకగా మిలాద్ ఉన్ నబీ


మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: మహమ్మద్ ప్రవక్త జయంతి పురస్కరించుకుని, నగరంలోని ముస్లిం సోదరులంతా మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హాజరై, ముస్లిం సోదరులకు అభినందనలు తెలిపారు. సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ఆ దేవుని కృపను పొందడానికి నిత్యం ప్రార్థనలు చేయాలని కోరారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ముస్లింలు ర్యాలీ నిర్వహించి, మహమ్మద్ ప్రవక్త బోధనలను ప్రచారం చేశారు. మాజీ వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్, కార్పొరేటర్ షకీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానంతో దొంగ ఓట్లకు చెక్

రామభద్రపురం: ఓటరు కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లకు చెక్ పెట్టవచ్చని తహసీల్దారు పి.గణపతిరావు అన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానానికి సంబంధించి, మండలంలో బూత్‌లెవల్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 62 శాతం ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తయిందన్నారు. ఇది చేయడం ద్వారా ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండే అవకాశం ఉండదన్నారు


తెర్లాం: మండలంలో నిర్వహించిన ఓటర్ కార్డు–ఆధార్ అనుసంధానం ప్రత్యేక డ్రైవ్‌ను తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్‌కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. దీంతో వచ్చే ఎన్నికల్లో పారదర్శకమైన ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని, ఓటర్లంతా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు.


ఆధార్ అనుసంధాన ప్రక్రియ వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దారు గణపతిరావు

క్లుప్తంగా

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- నాగార్జునసాగర్ 10 గేట్లు ఎత్తి నీటివిడుదల


శ్రీశైలం జలాశయం రెండు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/సత్రశాల(రెంటచింతల): శ్రీశైలం జలాశయానికి ఆదివారం సాయంత్రానికి 1,17,729 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. రెండుగేట్లను పదడుగులు ఎత్తి 55,966 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం 66,729 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతికి 338 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 884.80 అడుగుల మట్టంలో 214.8450 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయానికి 1,31,098 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. పదిగేట్లను ఐదడుగులు ఎత్తి 80,790, విద్యుదుత్పాదనతో 33,130.. కలిపి మొత్తం 1,13,920 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాల్వలు, వరద కాలువ, ఎస్‌ఎల్‌బీసీలకు మొత్తం 17,178 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 590.80 అడుగుల మట్టంలో 311.4474 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు 1,13,920 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. ఏడుగేట్లు ఎత్తి 1,06,923, విద్యుదుత్పాదన ద్వారా 7,340.. కలిపి మొత్తం 1,14,263 క్యూసెక్కుల నీటిని పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

వాల్మీకులకు అండగా సీఎం వైఎస్ జగన్

- మహర్షి వాల్మీకి జయంతి సభలో మంత్రి గుమ్మనూరు


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎ.మధుసూదన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి జయరాం మాట్లాడుతూ పాదయాత్రలో ఆయన దృష్టికి తీసుకెళ్లిన వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ అంశంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. ఈ విషయం మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పలు కీలకమైన పదవులను వాల్మీకులకు ఇచ్చారని గుర్తు చేశారు. ముందుగా మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎం.ఎ.హఫీజ్‌ఖాన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, నగర మేయర్ బి.వై.రామయ్య తదితరులు హాజరయ్యారు.

తల్లిపాలలోనూ ప్లాస్టిక్!

- అమ్మ పాలలో ప్లాస్టిక్ అవశేషాలను గుర్తించిన ఇటలీ శాస్త్రవేత్తలు
- 34 మంది నుంచి పాలు సేకరించి.. రామన్ మైక్రో స్పెక్ట్రోస్కోపీతో విశ్లేషణ
- అందులో 26 మంది పాలలో మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు గుర్తింపు
- ఇవి పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపవచ్చన్న అంచనాలు
- ఆహారం నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, తినడం.. ఇలా అన్ని దశల్లో చేరుతున్న ప్లాస్టిక్
- సూక్ష్మ కణాలతో కలుషితమై గాలి ద్వారా ఊపిరితిత్తుల్లోకి..
- ఇటీవల మనుషుల రక్తంలోనూ ప్లాస్టిక్ అవశేషాలను గుర్తించిన శాస్త్రవేత్తలు
- ఈ మైక్రో ప్లాస్టిక్‌తో దుష్పరిణామాలపై స్పష్టత లేదంటున్న ఐసీఎంఆర్



విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో ప్రమాదం

సాక్షి, హైదరాబాద్: సృష్టిలో స్వచ్ఛమైన పదార్థమంటే ఠక్కున గుర్తొచ్చేది అమ్మ పాలే. కానీ ఇప్పుడా తల్లి పాలు సైతం కలుషితం అవుతున్నాయి. విచ్చలవిడిగా పెరిగిపోయిన ప్లాస్టిక్ రక్కసి చివరికి తల్లి పాలలోనూ చేరుతోంది. ఆ రూపంలో శిశువుల శరీరంలోనికీ వెళుతోంది. పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయేవరకు ప్రతి పనిలో, ప్రతిచోటా ప్లాస్టిక్‌తో ముడిపడిపోయిన పరిస్థితే దీనికి కారణమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు, డబ్బాలు, పాత్రల్లో వేసిన ఆహారాన్ని తీసుకుంటున్నప్పుడు, ప్లాస్టిక్ బాటిళ్లతో నీళ్లు, ఇతర పానీయాలు తాగుతున్నప్పుడు అతి సూక్ష్మ ప్లాస్టిక్ ముక్కలు మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. పీల్చే గాలి ద్వారా ప్లాస్టిక్ కణాలు ఊపిరితిత్తుల్లోకి చేరుతున్నాయి. మనుషుల రక్తంలో కూడా ప్లాస్టిక్ ముక్కలు ఉన్నట్టు కొద్దిరోజుల కింద శాస్త్రవేత్తలు తేల్చారు. అలాంటిది చివరికి తల్లిపాలలోనూ ప్లాస్టిక్ చేరినట్టు ఇటలీ వైద్య విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు.

పరిశీలన సాగిందిలా..

స్త్రీ వైద్యులు, శాస్త్రవేత్తల బృందం యూనివర్సిటీ ఆస్పత్రిలో 34 మంది తల్లుల నుంచి నిర్ణీత మొత్తంలో పాల నమూనాలను సేకరించింది. వాటిని రామన్ మైక్రో స్పెక్ట్రోస్కోపీ సాంకేతికత సాయంతో విశ్లేషించింది. ఈ సందర్భంగా 26 మంది పాలలో సూక్ష్మ ప్లాస్టిక్ అవశేషాలను గుర్తించారు. ఆ మైక్రో ప్లాస్టిక్ కణాలు ఏ రకమైనవి, వాటి పరిమాణం, రంగులను నిర్ధారించారు. కొందరి పాలలో అయితే రెండు, మూడు రకాల మైక్రో ప్లాస్టిక్‌లు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఇవన్నీ కూడా ఆహారాన్ని ప్యాకింగ్ చేయడానికి, నిల్వ చేయడానికి, రవాణా చేయడానికి ఉపయోగించే ప్లాస్టిక్ రకాలేనని తేల్చారు.

రకరకాలుగా కలుషితం

ఆహారం, కలుషిత గాలి ద్వారా ప్లాస్టిక్ మన శరీరంలోకి చేరుతోందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆహార పదార్థాల ఉత్పత్తి మొదలు.. నిల్వ, రవాణా, వండటం, వడ్డించడం, చివరికి ప్లాస్టిక్ చెంచాలతో తినడం వరకు అన్ని స్థాయిల్లో ప్లాస్టిక్ చేరుతోంది. ఆహారం ద్వారా శరీరంలోకి వెళుతోంది. ఇక ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో అతి సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు గాలిలో చేరుతున్నాయి. శ్వాస ద్వారా ఊపిరితిత్తుల్లోకి, వాటి నుంచి రక్తంలో ప్రవేశించి శరీర భాగాలన్నింటికీ వెళుతున్నాయి. సముద్రాలు, నదులు, చెరువులు, ఇతర నీటి వనరుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం 3.6 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లో చేరినట్టు అంచనా. ప్లాస్టిక్ ఉత్పత్తులు నీటిలో కలవడం, వాటి నుంచి అతిచిన్న ముక్కలు నీటిలోకి, జలచరాల్లోకి చేరడం, వాటిని ఆహారంగా తీసుకుంటున్న మన శరీరంలోకి చేరడం జరుగుతోంది. ఇదంతా అత్యంత సూక్ష్మస్థాయిలో ముంచుకొస్తున్న ప్రమాదమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

ప్రమాదం ఎంత వరకు?

తల్లి పాలలోని ప్లాస్టిక్ అవశేషాలతో బిడ్డకు ప్రమాదం కలగవచ్చని ఈ పరిశోధనలో పాల్గొన్న వైద్య నిపుణులు చెప్తున్నారు. చిన్నారుల మెదడు, నాడీ మండలంపై ప్రభావం చూపడంతోపాటు హార్మోన్ల అసమతుల్యతకు దారి తీయవచ్చని.. ఇది ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. అయితే తల్లి పాలలోని మైక్రోప్లాస్టిక్ ద్వారా జరిగే దుష్పరిణామాలపై ఎలాంటి రుజువులు లేవని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) పేర్కొంది. ఇప్పటివరకు ఈ అంశంపై మన దేశంలో ఎలాంటి పరిశోధన జరగలేదని, పాశ్చాత్య దేశాల్లో కూడా లోతైన పరిశోధనలేవీ లేవని తెలిపింది.

ఐదుగురు తల్లుల పాల నమూనాల పరిశీలన ఫలితాలివీ

వయసు	పాల పరిమాణం	మైక్రో ప్లాస్టిక్స్	రంగు	పాలిమర్ మ్యాట్రిక్స్
28	8.44 గ్రాములు	2	నారింజ	నైట్రో సెల్యులోస్
32	4.92 గ్రాములు	1	నారింజ	పాలీఇథిలిన్
32	5.83 గ్రాములు	1	నీలి	పాలీఇథిలిన్
38	5.09 గ్రాములు	2	నలుపు	పాలీవినైల్ క్లోరైడ్
36	7.08 గ్రాములు	2	ఎరుపు	పాలీవినైల్ క్లోరైడ్

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిందే..



భారత ఆహార ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ), ఐసీఎంఆర్ సంస్థల వివరాల ప్రకారం మన దేశంలో మానవాళిపై ప్లాస్టిక్ కణాల ప్రభావంపై పరిశోధన జరగలేదు. ప్రపంచ దేశాల్లో ఎక్కడా కూడా ఈ అంశంలో సరైన స్పష్టత లేదని ఐసీఎంఆర్ అంటోంది. తల్లిపాలలోనూ ప్లాస్టిక్ కణాలు చేరుతున్నాయని తేలిన నేపథ్యంలో ఈ అంశంపై పరిశోధనలు మరింతగా జరగాల్సి ఉంది. మన దేశంలో ప్లాస్టిక్ వినియోగం చాలా ఎక్కువగా ఉంది. దీన్ని తగ్గించాల్సిన అవసరముంది.

– డాక్టర్ కిరణ్ మాదల, క్రిటికల్ కేర్ విభాగాధిపతి, నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల

గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి



తల్లిపాలలో ప్లాస్టిక్‌తోపాటు లెడ్ వంటి భారలోహాల అవశేషాలు ఉన్నాయన్న కోణంలో పరిశోధనలు జరుగుతున్నాయి. తల్లి పాలలో ప్లాస్టిక్, లెడ్ అవశేషాలతో జరిగే నష్టంపై ప్రస్తుతం ఎలాంటి స్పష్టతా లేదు. కానీ పుట్టినబిడ్డకు తల్లి పాలు అత్యంత కీలకం. అందువల్ల గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్ వినియోగానికి వీలైనంత దూరంగా ఉండాలి.

– డాక్టర్ బబిత మాటూరి, సీనియర్ గైనకాలజిస్ట్

పరిశ్రమలకు సముద్రపు నీరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తొలిసారిగా సముద్రపు నీటిని శుద్ధిచేసి మంచినీటిగా మార్చే డీశాలినేషన్ ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరం ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు సముద్రపు నీటిని శుద్ధిచేసి సరఫరా చేయడానికి రూ.400 కోట్లతో డీశాలినేషన్ ప్లాంట్‌ను ఏపీఐఐసీ అభివృద్ధి చేస్తోంది. పైడి భీమవరం ప్రాంతంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో వంటి 26కుపైగా ఫార్మా, రసాయన పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ పరిశ్రమలకు అవసరమైన నీటికోసం అత్యధికంగా భూగర్భజలాలపై ఆధారపడుతున్నారు. తీరప్రాంతంలోని పరిశ్రమలకు సముద్రపు నీటిని శుద్ధిచేసి సరఫరా చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా తొలి డీశాలినేషన్ ప్లాంట్‌ను పైడి భీమవరం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం మెంటాడ వద్ద సుమారు 50 ఎకరాల్లో దీన్ని నెలకొల్పనున్నారు. తొలిదశలో రోజుకు 35 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధిచేసే విధంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రానున్న కాలంలో దీన్ని వంద మిలియన్ లీటర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఐఐసీ శ్రీకాకుళం జోనల్ మేనేజర్ యతిరాజులు తెలిపారు. ఇక్కడ శుద్ధిచేసిన నీటిని పైప్‌లైన్ల ద్వారా పైడి భీమవరం పారిశ్రామికవాడ, దాని చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలకు అందించనున్నారు. దీనివల్ల భూగర్భ జలాల వినియోగం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ యూనిట్‌లో భాగస్వామ్యం కోసం ఆసక్తి గల సంస్థల నుంచి ఏపీఐఐసీ బిడ్లను ఆహ్వానిస్తోంది. బిల్డ్ ఓన్ ఆపరేట్ (బీవోవో), బిల్డ్ ఓన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోవోటీ) విధానంలో ఆహ్వానిస్తున్న ఈ టెండర్లలో పాల్గొనడానికి ఈ నెల 13 చివరితేదీ.

నాలుగుపైసలకే లీటరు నీరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి అతిచౌకగా నీటిని అందించే డీశాలినేషన్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించారు. 2019 ఆగస్టులో ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లినప్పుడు ముఖ్యమంత్రి అక్కడ ఉన్న హెచ్2ఐడీ డీశాలినేషన్ ప్లాంట్‌ను సందర్శించారు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఇజ్రాయిల్‌కు చెందిన కొంతమంది ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి డీశాలినేషన్‌లో ఐడీఈ టెక్నాలజీని వినియోగించడం ద్వారా ఖర్చు తక్కువ అవుతుందని తెలిపారు. కేవలం నాలుగు పైసలకే లీటరు నీటిని ఉత్పత్తిచేసే అవకాశం డీశాలినేషన్‌లో ఉండటంతో తీరంలో పరిశ్రమలు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్న పైడి భీమవరంలోని రసాయన పరిశ్రమలకు డీశాలినేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారాన్ని చూపిస్తోంది.

విద్యుత్ సరఫరాలో ఆధునిక సాంకేతికత

- వ్యవసాయ రంగానికి విద్యుత్ కొరత లేకుండా చర్యలు
- విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఆధునిక, అంతర్జాతీయ సాంకేతికత వినియోగించుకోవాలని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. వ్యవసాయ రంగానికి పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు కొరతలేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇంధనశాఖ అధికారులతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాసా తాజా టెక్నాలజీని ప్రస్తావించారు. పర్డ్యూ యూనివర్సిటీ పరిశోధకులు భవిష్యత్ అంతరిక్ష మిషన్ల కోసం అభివృద్ధి చేసిన టెక్నాలజీతో భూమిపై ఒక ఎలక్ట్రిక్ కారును 5 నిమిషాల్లోనే చార్జింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం స్వాగతించాల్సిన అంశమని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ)ల వినియోగం పెరుగుతుందన్నారు. చౌక విద్యుత్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇంధన భద్రతకు విద్యుత్ పొదుపు కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

గోవా సదస్సుకు ఏపీఎస్ఈసీఎం

ఈ నెల 11, 12 తేదీల్లో గోవాలో జరగనున్న రాష్ట్రాల డిజిగ్నేటెడ్ నోడల్ ఏజెన్సీస్ (ఎస్డీఏ) జాతీయ సదస్సుకు రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈఓను పంపుతున్నట్లు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి విజయానంద్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, మోడల్ స్కూల్స్, గ్రామీణ నీటి సరఫరా పంపుసెట్లు, పంచాయతీల్లో వీధి లైట్లు, కోర్టు భవనాలు వంటి చోట్ల విద్యుత్ ఆదా కార్యక్రమాల అమలుకు చర్యలు చేపడుతున్నాయని ఆయన వివరించారు. సమావేశంలో ఏపీ జెన్‌కో ఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి, నెడ్ క్యాప్ వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి, ఏపీ ఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

బస్సులో మహిళపై టీడీపీ ఎమ్మెల్యే 'నిమ్మల' దౌర్జన్యం

- రాష్ట్ర ప్రభుత్వం, సీఎంపై బురదజల్లేందుకు యత్నం
- కౌంటర్ ఇచ్చిన మహిళలు
- ఈ సంభాషణ వీడియోను రికార్డుచేసిన మరో మహిళ
- దీంతో ఆమె చేతిలోని సెల్ లాక్కుని రెచ్చిపోయిన 'నిమ్మల'
- మరోచోట.. మూడు రాజధానులకే మా మద్దతన్న బస్సు ప్రయాణికులు
- కంగుతిన్న మాజీ మంత్రి పితాని, నిమ్మల



పాలకొల్లు– పెనుగొండ మార్గంలో ఆర్టీసీ బస్సులో ఓ మహిళ చేతిలోని సెల్‌ను బలవంతంగా లాక్కుంటున్న నిమ్మల రామానాయుడు. ఫోన్ ఇవ్వమని ఆయన మెడలోని కండువా, చొక్కా లాగుతున్న మహిళ

పాలకొల్లు అర్బన్/పోడూరు: ఆర్టీసీ బస్సులో మహిళలపై పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు దౌర్జన్యం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాలకొల్లు నుంచి పెనుగొండ వరకు ఆదివారం అమరావతి పాదయాత్ర సాగింది. ఈ మార్గంలో ఓ ఆర్టీసీ బస్సు ఎక్కిన 'నిమ్మల'.. ప్రయాణికులతో మాటామంతీ కలుపుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైన, సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపైన బురదజల్లే ప్రయత్నం చేయబోయారు. దీంతో ఆ మహిళలు.. సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, ఇంటి స్థలాలు ఇస్తున్నారని వాదించడంతో ఎమ్మెల్యే అవాక్కయ్యారు. ఈ దృశ్యాన్ని ఒక మహిళ వీడియో తీసింది. దీంతో రెచ్చిపోయిన ఎమ్మెల్యే రామానాయుడు ఆ మహిళ చేతిలోని సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కున్నారు. ఆ దృశ్యాలను తీసేస్తాను తన సెల్‌ఫోన్ తనకు ఇవ్వాలని ఆ మహిళ ప్రాధేయపడుతున్నా ఎమ్మెల్యే వినకుండా సెల్‌ఫోన్‌ను పక్కనే ఉన్న మరో టీడీపీ నేతకు ఇవ్వడం.. ఆ మహిళ ఎమ్మెల్యే మెడలోని పచ్చకండువాను, చొక్కాను లాగడం.. ఎమ్మెల్యే కేకలు వేయడం ఆ వీడియోలో స్పష్టంగా రికార్డయ్యాయి. దీంతో ఆయన మహిళల ముందు అభాసుపాలయ్యారని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.

పితాని, నిమ్మలకు ఝలక్..

మరోవైపు.. ఇదే జిల్లా పోడూరు మండలం కవిటం లాకుల వద్ద కూడా బస్సు ప్రయాణికుల నుంచి పాదయాత్రలోని మాజీమంత్రి పితాని, ఎమ్మెల్యే నిమ్మలకు ఝలక్ తగిలింది. పాదయాత్ర పేరుతో టీడీపీ నాయకులు బలప్రదర్శనకు దిగడం.. ట్రాఫిక్ స్తంభించడంతో ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు వారిపై మండిపడ్డాడు. గతంలో టీడీపీ హయాంలో చంద్రబాబు రాష్ట్రానికి చేసిన అన్యాయం, ఆ ప్రభుత్వం చేసిన మోసం చాలదా? ఇప్పుడు రైతుల ముసుగులో పాదయాత్ర చేస్తూ ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారంటూ టీడీపీ నేతలను నిలదీశాడు. దీంతో పాదయాత్ర చేస్తున్న పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీమంత్రి పితాని సత్యనారాయణ తదితరులు కంగుతిన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినట్లుగా మూడు రాజధానుల నిర్ణయానికి మద్దతు తెలుపుతామని ప్రయాణికులు తెగేసి చెప్పారు.



పండుగ ముగిసింది.. తిరుగు పయనం

బండెనక బండికట్టి పదహారు బండ్లు కట్టి పట్నం పోదాం.. అన్న విధంగా.. బారులు తీరిన వాహనాలు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై కనిపించాయి. దసరా సెలవులు ముగియడంతో హైదరాబాద్ జంట నగరాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు పయనం కావడంతో వాహనాల రద్దీ ఏర్పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

• తెలంగాణ

మునుగోడులో ఉమ్మడి అభ్యర్థిగా గద్దర్?

- ప్రజాస్వామిక వాదుల తరపున పోటీ!
- గద్దర్‌తో ప్రొఫెసర్ కోదండరాం చర్చలు

అల్వాల్: నల్లగొండ జిల్లా మునుగోడు ఉప ఎన్నికలో తెలంగాణ అస్తిత్వం కాపాడుకోవడం కోసం ప్రజాస్వామిక శక్తులు ఐక్యం కావాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా గాయకుడు గద్దర్ పిలుపునిచ్చారు. మునుగోడు ఎన్నికలో కేఏ పాల్ ఆధ్వర్యంలోని ప్రజాశాంతి పార్టీ తరపున గద్దర్ పోటీ చేయనున్నారన్న వార్తల నేపథ్యంలో ఆదివారం కోదండరాం ఇతర నాయకులతో కలిసి గద్దర్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల్లో గద్దర్ ఒకరని, ప్రజాశాంతి పార్టీ నుంచి కాకుండా ప్రజాస్వామిక వాదుల ఉమ్మడి అభ్యర్థిగా ఆయనను పోటీ చేయించడానికి చర్చలు జరుపుతున్నామని కోదండరాం తెలిపారు. కాగా, ప్రజా సంఘటన ద్వారానే మునుగోడులో పోటీ చేయాలని నిర్ణయించామని, అయితే దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని గద్దర్ చెప్పారు.

రాజగోపాల్‌రెడ్డిని పోటీకి అనర్హుడిగా ప్రకటించండి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు టీఆర్ఎస్ నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉపఎన్నికల్లో పోటీకి మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని టీఆర్ఎస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను కోరారు. రూ.18వేల కోట్ల ప్రాజెక్టు తీసుకుని బీజేపీలో చేరానని ఓ న్యూస్ ఛానల్‌కు స్వయంగా చెప్పిన ఆయనను పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే కిశోర్, పార్టీ జనరల్ సెక్రటరీలు శ్రీనివాస్‌రెడ్డి, సోమ భరత్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ లింగయ్యయాదవ్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు తీసుకున్నట్లు ఓ టీవీ చానల్‌కు స్వయంగా చెప్పారని, ఇది ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అవహేళన చేసే చర్యని విమర్శించారు. ఎన్నికల కమిషన్ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి రాజగోపాల్‌రెడ్డిని మునుగోడులో పోటీ చేయకుండా అనర్హుడిని చేయాలని కోరారు.

టీఆర్ఎస్ పనైపోయింది

- కేసీఆర్ పాలనపై ప్రజలు విరక్తితో ఉన్నారు: కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్

నర్సాపూర్/ చౌటుప్పల్: రాష్ట్రంలో టీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రజలు సీఎం కేసీఆర్ పాలనపై విరక్తితో ఉన్నారని కేంద్ర కార్మిక మంత్రి భూపేంద్రయాదవ్ పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా పదవి పొందిన తర్వాత.. రాష్ట్రాన్ని పక్కనపెట్టి తన కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నారని ఆరోపించారు. దళిత బంధు వంటి పథకాలు లబ్ధిదారులకు చేరడం లేదని.. అవి కేవలం టీవీల్లో ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఆదివారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని భూపేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు రాష్ట్ర ప్రజలకు చేరడం లేదన్నారు. సీఎం కేసీఆర్ అరాచక, అవినీతి పాలన నచ్చకనే టీఆర్ఎస్ నాయకులు బీజేపీ వైపు వస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు.

బాబు పాలనలో వెంటిలేటర్‌పై వైద్యశాఖ

- జగనన్న వచ్చాకే జీవం నింపుతున్నారు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజిని
- మార్కాపురం నియోజకవర్గంలో ఆస్పత్రుల ప్రారంభోత్సవం


మార్కాపురం ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి రజిని. చిత్రంలో సురేశ్, బాలినేని తదితరులు

మార్కాపురం: చంద్రబాబు పాలనలో వైద్య, ఆరోగ్యశాఖను వెంటిలేటర్‌పై ఉంచారని ఆ శాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ శాఖకు జీవం నింపుతున్నారని, పేదలకు మేలుచేసే విషయంలో ఎవరైనా ఆయన తర్వాతనేనని చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, కొనకనమిట్ల, పొదిలి ఆస్పత్రుల్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. తొలుత మార్కాపురంలో రూ.80 లక్షలతో నిర్మించిన యూపీహెచ్‌సీని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖకు చంద్రబాబునాయుడు చేసింది శూన్యమని, ఆయన రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఆస్పత్రులు కట్టకుండా, ఉన్న ఆస్పత్రులను పట్టించుకోకుండా ఈ శాఖను నిర్వీర్యం చేశారన్నారు. అమరావతి రాజధాని పేరుతో పాదయాత్ర అంటూ ఓ బూటకపు నాటకానికి తెరలేపారని దుయ్యబట్టారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అత్యంత వేగంగా, సులువుగా, ఉచితంగా అందించేందుకు రూ.16 వేలకోట్లకు పైగా నిధులతో వైద్య వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. రూ.1,692 కోట్లతో గ్రామగ్రామాన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తున్నారన్నారు. రూ.8 వేలకోట్లకు పైగా నిధులతో 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్నారని తెలిపారు. 1,126 పీహెచ్‌సీలను కొత్తగా నిర్మించడం, లేదా ఆధునికీకరించడం కోసం రూ.665 కోట్లు ఖర్చుచేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా 184 యూహెచ్‌సీల ఆధునికీకరణ, 344 యూహెచ్‌సీల నిర్మాణం కోసం రూ.392 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో రానున్న ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంలో ప్రభుత్వ వైద్యులు ఇళ్లకే వచ్చి వైద్యసేవలు అందిస్తారని ఆమె తెలిపారు. మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కె.పి.నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

మంచి మాట

ఏది నిజమైన సంపద?

సంపద అంటే చాలామంది దృష్టిలో, భవంతులు, పొలాలు. మరికొందరికి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు. ఇంకొందరి భావనలో వాహనాలు, ఇళ్ళ స్థలాలు. కృషీవలుడికి పంట, పశువులు, పండితుడికి జ్ఞానం... ఇలా సంపదను ఎన్నో రకాలుగా భావించి నిర్వచించవచ్చు. ఇది లౌకిక దృష్టి, సహజమైనది. ఆ రకమైన సంపద మన జీవనానికి అవసరమైనది. అయితే, సంపదంటే కేవలం ఇదే కాదు, ఈ భావనలకు లేదా మరికొన్ని ఇటువంటి భావనలకే ఈ మాట అర్థాన్ని పరిమితం చేయలేం. ఇది అర్థమయితేనే దాని లోతైన, విస్తృతార్థం బోధపడుతుంది.



ఇహపరమైన సంపద ఏ రూపంలో ఉన్నా, తరతరాలకు తరగనిదైనా ఎవరి దగ్గర ఉన్నా వారికి తృప్తి అనేది ఉండాలి. తమ శక్తి మేరకు కూడబెట్టామన్న ఆలోచన రావాలి. ఇంకా ఎక్కువ పొందాలి అన్న తీవ్రమైన కోరిక కూడదు. అది ఉన్నవారు ప్రశాంతతకు దూరమవుతారు. అపార సంపన్నులైనా పరిమిత ప్రాథమిక అవసరాలతో, కోరికలతో నిరాడంబర జీవితం గడపగలగాలి. తమ తోటి వారికి ఆర్థిక సహాయం చేయగలిగే దృష్టి రావాలి. ఆపన్నులకు చేయూత నివ్వాలన్న భావన రావాలి. ఇలా ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన నిజమైన సంపద. ఈ తృప్తి, నిరాడంబర జీవితం, పక్క వారిని ఆదుకోవాలన్న ఆలోచన ఉన్నవారు ఎంత పేదవారైనా ఐశ్వర్యవంతులే. ఆ ఆలోచన లేని వారు ఎంత ధనవంతులైనా అభాగ్యులే.

> ఒక దేశంలోని అద్భుత కట్టడాలు సృజనశీలురు వారి అపురూప సృష్టి. సంగీత, సాహిత్య ప్రవాహాలు, శిల్ప సంపద, జీవనవిధానం, ఆహారం, నాట్యం, చలనచిత్రాలు, శాస్త్రవేత్తల అద్భుత మేధస్సు.. వీటి కలయిక ఆ దేశ సంస్కృతిగా భావన చేస్తారు. ఈ సంస్కృతి ఆ దేశ సంపదవుతుంది. వీటికి మనం జత చేయవలసిన అంశాలు ఆ దేశ ప్రజల నీతి, నిజాయితీ, నైతిక వర్తన, నిబద్ధత, వ్యక్తిత్వం, వారి ఆలోచనా తీరు. ఇవి వారికి వారసత్వసంపదగా వచ్చిన సంస్కృతిని మరింత ఉదాత్తంగా చేస్తుంది.

గురువుల నుండి నేర్చుకున్న విద్యకు మెరుగులు దిద్ది మన పరిశీలనా దృష్టితో దానిని మరింతగా వృద్ధి చేసుకోవాలి. ఇతరులకు అందివ్వగలగాలి. అపుడు అదెంతో సుసంపన్నమవుతుంది. ఇలా గురువులే కాదు ఇతరులూ చేయవచ్చు. గురువుల జ్ఞానం లేదా పాండిత్యం వారి శిష్యప్రశిష్యుల ద్వారా సర్వవ్యాపితమై ఆ దేశం జ్ఞాన సంపదగా నిక్షిప్తమవుతుంది.

'మిడాస్ టచ్' అనే కథలో ఒక రాజు తను ముట్టుకున్నది ప్రతిది బంగారంగా మార్చగల వరం పొందాడు. ఇక తన ఆనందానికి అవధులే లేవనుకుంటూ తన రాజభవనంలోని ప్రతి దానిని ముట్టుకుని హేమమయం చేసుకున్నాడు. తను తినే ఆహారం, తాగే మంచి నీరు, చివరకు తన కూతురు బంగారు విగ్రహంగా మారి పోవటం చూసి నిశ్చేష్టుడై, తన వరాన్ని వెనుకకు తీసుకోమని ఆ దేవతను వేడుకున్నాడు. నిజమైన ప్రేమ, అనుబంధాలు ముఖ్యమైన వని, అవే నిజమైన సంపదని గ్రహించాడు.

> ఇహపరమైన సంపదే కాకుండా ప్రతి ఒక్కరికీ సహజసిద్ధమైన చక్కని లక్షణాలు ఉంటాయి. వాటిలో ఒకటి ఆలోచనలు. మనల్ని సక్రమమార్గంలో పయనింపచేసే పథాలు. మనలోని అంతర్గత శక్తులకు సరైన ఆకృతి వీటివల్లే వస్తుంది. ఆలోచనలు మనిషి వ్యక్తిత్వ వికాసాన్నే కాదు సమాజ, దేశ వికాసాన్ని చాలా ప్రభావితం చేస్తాయి. దేశ ప్రజల సక్రమ ఆలోచనా సరళి దేశ సంపదగానే భావించాలి.

నిజమైన సంపద ఇహపరమైనది కాదు. దానిని మన భౌతిక సంపదతో కొలవలేం. మన వ్యక్తిత్వం, గుణశీలత, మానవీయతలను మన ముందు తరాలవారికి వారసత్వంగా ఇవ్వగలగాలి. అదే నిజమైన సంపద.

– **బొడ్డపాటి చంద్రశేఖర్**, అంగ్లోపన్యాసకులు

ఇస్లాం వెలుగు

ఆ కారుణ్య ఛాయలో...

అది ముహమ్మద్ ప్రవక్త (స) ధర్మ ప్రచారం చేస్తున్న తొలి దినాల మాట. ఒకసారి ఆయన మక్కా వీధిగుండా వెళుతున్నారు. కూడలిలో ఒక వృద్ధురాలు నిలబడి ఉంది. చేతిలో ఉన్న మూటలు బరువుగా ఉండడంతో దారిన వెళ్ళేవారిని బతిమాలుతోంది కాస్త సాయం చేయమని. కాని, ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతలో ముహమ్మద్ ప్రవక్త అటుగా వెళుతూ, ఆ వృద్ధురాలిని చూసి, ఆమెను సమీపించారు. 'బాబ్బాబూ.. నీకు పుణ్యముంటుంది. ఈ మూట చాలా బరువుగా ఉంది. మోయలేకపోతున్నాను. కాస్త సాయం చేస్తే నేను వెళ్ళిపోతాను' అన్నదా వృద్ధురాలు ఆశగా.

'అయ్యో! దీనికేం భాగ్యం' అంటూ మూట భుజానికెత్తుకొని, ఆమె కోరిన చోటుకు చేర్చారు ప్రవక్తమహనీయులు.

'బాబూ! దేవుడు నిన్ను చల్లగా చూడాలి. ఏ తల్లి కన్నబిడ్డవో గాని ముక్కూ మొహం తెలియని నాలాంటి ముసలిదానికి ఇంత సహాయం చేశావు. బాబూ! ఒక్క మాట వింటావా. ఎవరో ముహమ్మద్ అట, ఏదో కొత్తమతాన్ని ప్రచారం చేస్తున్నాడట. అతని మాటల్లో ఏముందో గాని చాలామంది అతని ప్రభావంలో పడిపోతున్నారు. జాగ్రత్త! అతని మాటల్లో పడకు. నేను అందుకే ఊరు విడిచి వెళ్ళిపోతున్నాను'. అని హితవు పలికింది. 'సరేనమ్మా' అంటూ ఆమె చెప్పిందంతా ఓపిగ్గా విని, వినయ పూర్వకంగా అభివాదం చేసి సెలవు తీసుకున్నారు ముహమ్మద్ ప్రవక్త(స).

ఆ మహనీయుని మంచితనానికి, వినయ పూర్వకమైన ఆ వీడ్కోలుకు ఆనందభరితురాలైన వృద్ధురాలు ఒక్కసారిగా భావోద్రేకానికి లోనై,'బాబూ!' అని పిలిచింది ఆప్యాయంగా. 'అమ్మా'! అంటూ దగ్గరికి వచ్చిన ప్రవక్త తలపై చేయి వేసి నుదుటిని ముద్దాడుతూ, 'బాబూ!' నీ పేరేమిటి నాయనా' అని ప్రశ్నించింది. కాని ప్రవక్త ఏమీ మాట్లాడకుండా తలవంచుకొని మౌనం వహించారు.

'బాబూ! పేరైనా చెప్పు గుర్తుంచుకుంటాను.' అంటూ అభ్యర్థించింది.

అప్పుడు ప్రవక్తమహనీయులు, 'అమ్మా! నా పేరు ఏమని చెప్పను? ఏ ముహమ్మద్‌కు భయపడి నువ్వు దూరంగా వెళ్ళిపోతున్నావో ఆ ముహమ్మద్ ను నేనేనమ్మా!' అన్నారు తలదించుకొని.


దీంతో ఒక్కసారిగా వృద్ధురాలు అవాక్కయింది. ఎవరి ముఖం కూడా చూడకూడదని పుట్టి పెరిగిన ఊరినే వదిలేసిందో, అతనే తనకు సహాయం చేశాడు. సహాయం కంటే ఎక్కువగా ఆ మాట, మంచితనం, వినమ్రత, మానవీయ సుగుణం ఆమెను మంత్రముగ్ధురాల్ని చేశాయి. కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలుతుండగా, 'బాబూ ముహమ్మద్! నువ్వునిజంగా ముహమ్మద్ వే అయితే, నీనుండి పారిపోవాలనుకోవడం నా దురదృష్టం. ఇక నేను ఎక్కడికీ వెళ్ళను. నీ కారుణ్య ఛాయలోనే సేద దీరుతాను.' అంటూ అదే క్షణాన ప్రవక్తవారి ప్రియ శిష్యురాలిగా మారిపోయింది.



ఇదీ ప్రవక్త వారి ఆచరణా విధానం. ప్రజల పట్ల, ముఖ్యంగా నిస్సహాయులు, బడుగు, బలహీనులు, పీడిత తాడిత, శ్రామిక వర్గాల పట్ల అవలంబించిన ఆచరణా శైలి. ఇందులో కొంతైనా మనం ఆచరించగలిగితే, నేటి మన సమాజం ఎంత అందంగా ఉంటుందో!

– **ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

అప్పుడు ఆపుడే.. మరిప్పుడో..!!!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కమలములు నీటబాసిన/కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్/ తమ తమ నెలవులు దప్పిన/ తమ మిత్రులె శత్రులగుట తథ్యము సుమతీ...అన్నాడు బద్దెన సుమతీ శతకంలో. నీళ్ళల్లో ఉన్న తామర మొగ్గ విచ్చుకోవడానికి కారణమయిన సూర్యనారాయణుడు, అదే తామరతూడును నీళ్ళల్లో నుంచి తీసి ఒడ్డున పెడితే ...ఆయన వాడివేడి కిరణాలు సోకి అది వాడిపోతుంది, కమలాప్తుడు అంటే నీళ్ళల్లో ఉన్న కమలానికి బంధువు, నీళ్ళనుంచి బయటికి వచ్చిన పిదప శత్రువయిపోయాడు.

విభీషణుడు రావణునికి సోదరుడు. కానీ ఎప్పుడూ ధర్మం వైపే నిలబడతాడు. అన్నగారు అధర్మానికి పాల్పడినప్పుడల్లా హెచ్చరిస్తూ ఉంటాడు. అలా చెప్పే వారు మన శ్రేయోభిలాషులని గుర్తించకపోతే చాలా ప్రమాదకరం. హనుమ రాయబారం తరువాత రావణాసురుడు కోపంతో హనుమ కంఠాన్ని నరికేయమన్నాడు. ఆయన్ని సంహరించబోతున్నారు. విభీషణుడు జోక్యం చేసుకొన్నాడు.'అన్నయ్యా! నీకు తెలియని ధర్మం లేదు కదా... అతను దూత. ఎవరో చెప్పి పంపినవి ఆయన చెబుతున్నాడు. అవి దూత అభిప్రాయాలు కావు కదా. దూత పరిధి దాటాడనిపిస్తే స్వల్పంగా శిక్షించవచ్చు. అంతేకానీ సంహరిస్తానంటే ఎలా..? పైగా నీవితన్ని సంహరిస్తే నీ అభిప్రాయాలు అవతలివారికి ఎలా చేరవేయగలవు? కాబట్టి వద్దు.. అన్నాడు. రావణుడు నిర్ణయాన్ని మార్చుకున్నాడు. అటువంటి ధర్మాత్ముడు పక్కన ఉన్నంతకాలం ... ఉపద్రవాలు ప్రాణాంతకం కాకుండా ఉన్నాయి. కానీ తరువాత జరిగిన పరిణామాలవల్ల విభీషణుడు రాముడి పక్కన చేరిపోయాడు.

ఇంద్రజిత్తు రాముడిపై యుద్ధానికి బయలుదేరుతున్నాడు. బ్రహ్మగారు ఒకానొకప్పుడు ఆయనకు వరం ఇస్తూ...''నికుంభిలా (దట్టమైన అడవిలో ఉన్న ఒక దేవాలయం. అక్కడికి చేరుకోవడం చాలా ప్రమాదకరం) కు వెళ్ళి హోమం చెయ్యి. దానిలోంచి వచ్చిన రథం మీద కూర్చొని యుద్ధానికి బయల్దేరితే... నువ్వు మేఘాలలో ఉండి దుర్నిరీక్షవుడవుతావు. నిన్ను యుద్ధంలో గెలవడం ఎవరికీ సాధ్యం కాదు.'' అని వరమిస్తూనే...''నువ్వు నికుంభిలా చేరకపోయినా, చేరి హోమాన్ని పూర్తి చేయలేక పోయినా, నువ్వు ఆయుధాన్ని ధరించి ఉండగా నీపై యుద్ధానికి వచ్చినవాడే నీ ప్రాణాలను హరిస్తాడని గుర్తించు'' అని హెచ్చరించాడు. ఈ రహస్యం విభీషణుడికి తెలుసు. ఇప్పుడాయన రాముడి పక్షంలో ఉన్నాడు. అదంతా రాముడికి తెలిపి... ఇపుడు ఇంద్రజిత్తు నికుంభిలా చేరుకున్నాడు... అని కూడా చెప్పి రాముడి ఆజ్ఞతో లక్ష్మణస్వామిని తీసుకొని వెళ్ళాడు. ఇంద్రజిత్తు హోమాన్ని మధ్యలోనే ఆపేసి యుద్ధానికి వచ్చాడు. ఆ తరువాత లక్ష్మణుడి చేతిలో చచ్చాడు. అంటే విభీషణుడు స్థానం తప్పిన కారణంగా లంకకు, రావణాసురుడికి చేటు వచ్చింది. అందుకే బద్దెన చెప్పింది.. ఒక్కొక్కసారి ఒక్కొక్కస్థానంలో మిత్రుడిగా ఉన్నవాడు, స్థానం తప్పితే శత్రువయిపోతాడు. మన పక్కన ఉన్నవారి లో మన శ్రేయస్సు కోరి కొన్ని కఠినమైన సలహాలు ఇచ్చినా, వాటిని పరిశీలించి ఓర్పుతో, విచక్షణతో మసలుకొన్నప్పుడు అవాంఛిత ప్రమాదాలు మాత్రం ఎదురుకాకుండా ఉంటాయన్నదే బద్దెన ఇస్తున్న సలహా.

ప్రతి అవసరాన్ని తీర్చు దేవుడు

సువార్త

దేవుడు తన ఐశ్వర్యము చొప్పున...మీ ప్రతి అవసరమును తీర్చును (ఫిలిప్పీ 4:19). పౌలు తాను రాసిన పత్రికలలో దేవుని ఔన్నత్యాన్ని గూర్చి తన జనులపట్ల ఆయనకున్న శ్రద్ధను గూర్చి రాశాడు. దేవుడు సకలైశ్వర్యవంతుడు. అయన్ను మించిన భాగ్యవంతులు ఈ విశ్వంలో ఎవరున్నారు? ప్రతి ఏటా మనుష్యుల ఆస్తిని అంచనా వేసేవారు తమ బాధ్యతను నెరవేర్చి ఫలానా వ్యక్తి అందరి కంటే గొప్పవాడని చెబుతుంటారు. సర్వశక్తుడైన దేవుని ఆస్తిని, ఆయన స్వాస్థ్యాన్ని అంచనా వేయడం ఎవరికి సాధ్యం? అవసరాలు తీర్చబడడం లేదనే నిరుత్సాహం నీలో ఉందా? అయితే విను! తన రూపులో తన పోలికలో నిన్ను చేసుకొన్న దేవుడు నిన్ను ఎందుకు వదిలిపెడతాడు? ఆయన నిన్ను సదాకాలం నడిపిస్తానని వాగ్దానం చేశాడు కదా! మరచిపోయావా? నన్ను ఎవ్వరూ పట్టించుకోవట్లేదు అన్న ఆలోచన ఎందుకు వస్తుంది?

ఐగుప్తునుండి బయటకు వచ్చిన ఇశ్రాయేలీయులను దేవుడు నలభై సంవత్సరాలు అరణ్యంలో తన దివ్య మహిమతో నడిపించాడు. అతి తీవ్రమైన ఎండ వేడిమి నుండి వారిని తప్పించడానికి పగలు మేఘస్తంభమై, ఎముకలు కొరికే చలి నుండి వారిని కాపాడడానికి రాత్రి అగ్ని స్తంభమై వారిని నడిపించుటయే గాక పరలోకపు ఆహారంతో వారిని అన్నివిధాలుగా తృప్తిపరిచాడు. కనాను దేశానికి నడిపిస్తానని మాట ఇచ్చాడు గనుక వారి ప్రయాణంలో అవసరాలను కూడా దేవుడే తీర్చాడు. ఆనాడు ఇశ్రాయేలును అరణ్యంలో నడిపిన దేవునిలో మార్పు వచ్చిందా? ఆయన మారిపోయాడా? వాస్తవాన్ని పరిశీలిస్తే అప్పటికంటే ఇప్పుడు తన బిడ్డలపై ఇంకా ప్రేమ పెరిగింది. తనను నమ్మిన వారికి ఏదేదో చేసేయాలన్న ధ్యాస పెరిగింది. తన



బిడ్డలను ఉన్నత స్థలాల్లో నిలపాలనే ఆశ పెరిగింది. వారికి ఏ కీడు రాకూడదని వారిని తన కౌగిట్లో నిత్యం భద్రం చేసుకోవాలనే కోరిక రోజురోజూ పెరుగుతూనే ఉంది. చూడు! నా అరచేతుల్లో నిన్ను చెక్కుకున్నాను అన్న మాటను గమనిస్తే తన వారిని ఉద్ధరించాలని దేవుడు తహతహలాడుతున్నాడన్న సత్యం మనకందరికి అర్థమౌతుంది.

ప్రియ మిత్రమా! సహాయం కోసం దేవుని వైపు చూడు! నీవు ఆరాధించే దేవుడు సంపన్నుడని గుర్తించు! ఆయన కేవలం నీ యజమానుడే కాదు... నిన్ను తన కృపగల హస్తాల్లో చెక్కుకున్న ప్రేమామయుడు. నీవు ఆయన గుప్పిట్లో ఉంటే చాలు...ఆ గుప్పిట్లోనే సర్వసమృద్ధి ఉంది. సర్వజీవులను తృప్తిపరిచే పిడికిలి అది. నీ మనసులో చెలరేగే దురాశలను పక్కనపెట్టి నీ అవసరమేంటో హృదయపూర్వకంగా చెప్పు... ఆయన చెవులు నీతిమంతుల ప్రార్థనల వైపు ఉన్నవనేది లేఖన సత్యం. దేవుడు మిమ్మును దీవించును గాక!

– **డా. జాన్ వెస్లీ**, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా

ప్రతి సంవత్సరం దీపావళి సందర్భంగా సినిమాలు రిలీజ్ కావడం కామన్. ఈ నెల 24న దీపావళి పండగ. కానీ కొత్త సినిమాల రిలీజ్‌లతో మూడు రోజులు ముందుగానే టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ దీపావళి వెలుగులతో మెరవనుంది. యాక్షన్ టపాసులు, ప్రేమ కాకరపువ్వొత్తులు, నవ్వుల చిచ్చుబుడ్డులు ఆడియన్స్ కోసం సిద్ధం అవుతున్నాయి. ఇక పండగ సందర్భంగా వస్తున్న సినిమాల వివరాల్లోకి ఓసారి వెళదాం.



పండగ పటాస్‌లు రెడీ

దీపావళికి యాక్షన్ 'జిన్నా'గా వస్తున్నారు మంచు విష్ణు. ఈషాన్ సూర్య దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, సన్నీ లియోన్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రంలో ఓ టెంట్ హౌస్‌ను రన్ చేసే జిన్నా అనే యువకుడి పాత్రలో కనిపించనున్నారు మంచు విష్ణు. తన వాళ్ల కోసం జిన్నా ఎలాంటి రిస్కులు తీసుకున్నాడు? ఎవరి రాక కారణంగా జిన్నా లైఫ్ టర్న్ అయ్యింది? అనేది సినిమా కథ. డా. మోహన్ బాబు ఆశీస్సులతో అవ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై రూపొందిన ఈ సినిమా ఈ నెల 21న రిలీజ్ కానుంది. మరో వైపు 'ఓరి దేవుడా..!' అంటూ ప్రేక్షకులను నవ్వించడానికి రెడీ అవుతున్నారు విశ్వక్ సేన్. ఈ సినిమాలో దేవుడి పాత్రలో వెంకటేశ్ నటించారు. తమిళ దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెలుగుకి పరిచయమవుతున్న చిత్రం ఇది. 'వైఫ్‌లో ఫ్రెండ్‌ను చూడొచ్చు సార్.. కానీ ఫ్రెండే వైఫ్‌లా వచ్చిందా..!' అనే డైలాగ్ 'ఓరి దేవుడా..!' ట్రైలర్‌లో ఉంది. సో.. పెళ్లి చేసుకున్న తర్వాత ఓ యువకుడి జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయి? అనే అంశం ఆధారంగా ఈ సినిమా కథనం ఉంటుందన్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో మిథిలా పాల్కర్, ఆశా భట్ హీరోయిన్లుగా నటించారు. ప్రసాద్ వి. పొట్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఇక తెలుగులో మంచి పాపులారిటీ సంపాదించుకున్న తమిళ హీరో కార్తీ 'సర్దార్'గా రానున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రాశీ ఖన్నా చేయగా, కీలక పాత్రలో లైలా నటించారు. ఓ గూఢచారి చేసే పోరాటం నేపథ్యంలో 'సర్దార్' సాగుతుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సినిమాను ప్రముఖ హీరో, నిర్మాత అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.



'జిన్నా', 'ఓరి దేవుడా..!', 'సర్దార్' చిత్రాలు రిలీజ్ అవుతున్న రోజునే 'ప్రిన్స్' కూడా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. శివ కార్తికేయన్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిన ఈ సినిమాకు 'జాతి రత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకుడు. ఉక్రెయిన్ బ్యూటీ మరియా ర్యాబోషప్క హీరోయిన్‌గా చేశారు. ఇండియన్ కుర్రాడికి, బ్రిటిష్ అమ్మాయికి మధ్య సాగే ప్రేమకథగా ఈ చిత్రం ఉంటుంది. సునీల్ నారంగ్, డి. సురేష్‌బాబు, పి. రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విజయ్ దేవరకొండ ఆదివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు.





ప్రస్తుతానికి ఈ నాలుగు సినిమాలు దీపావళికి కన్ఫార్మ్ అయ్యాయి. మరికొన్ని చిత్రాలు పండగ రేసులో నిలిచే అవకాశం ఉంది.

అమ్మా.. అప్పా...



● పిల్లలను ముద్దాడుతూ నయన, విఘ్నేష్

విఘ్నేష్ శివన్–నయనతార జీవితాల్లో కొత్త అధ్యాయం ఆరంభమైంది. విఘ్నేష్, నయన తల్లిదండ్రులు అయ్యారు. ఈ విషయాన్ని విఘ్నేష్ ఆదివారం సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ''నేను, నయనతార.. అమ్మా.. అప్పా (నాన్న) అయ్యాము. మగ శిశువు (కవలలు)లను పొందాం. మా ప్రాణం, ప్రపంచా (పిల్లలను ఉద్దేశించి)లకు మీ ఆశీర్వాదాలు కావాలి'' అని ట్వీట్ చేశారు విఘ్నేష్. ఈ ఏడాది జూన్ 9న విఘ్నేష్, నయన పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత బ్రేక్ తీసుకోకుండా హిందీ 'జవాన్, తెలుగు 'గాడ్ ఫాదర్' చిత్రాల షూటింగ్‌లో పాల్గొన్నారు నయన. కాగా.. 'సరోగసీ' ద్వారా విఘ్నేష్–నయన అమ్మా.. అప్పా అయ్యుంటారనే ఊహాగానాలు ఉన్నాయి.

కొత్త ప్రయాణం

కొత్త సినిమాకు కొబ్బరికాయ కొట్టారు హీరో ఆర్య. ముత్తయ్య దర్శకత్వంలో ఆర్య, సిద్ధి ఇద్నాని జంటగా ఈ సినిమా చెన్నైలో ప్రారంభమైంది. జీ స్టూడియోస్, డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నాయి. ''ఆర్య విలక్షణ నటుడు. ప్రేక్షకుల పల్స్ తెలిసిన దర్శకుడు ముత్తయ్య. వీరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ సినిమా వినోదాత్మకంగా ఉంటుంది'' అని అన్నారు జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ కేజ్రీవాల్.



● సిద్ధి, ఆర్య

క్యాసెట్ కథేంటి?



● స్వాతి

బ్రహ్మానందం, సముద్రఖని, స్వాతి రెడ్డి, శివాత్మిక రాజశేఖర్, రాహుల్ విజయ్, నరేష్ అగస్త్య, దివ్య శ్రీపాద ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'పంచతంత్రం'. హర్ష పులిపాక రచన, దర్శకత్వంలో అఖిలేష్ వర్ధన్, సృజన్ ఎరబోలు నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 9న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ఓ వీడియో ద్వారా స్పష్టం చేసింది. పంచతంత్రం అని రాసి ఉన్న క్యాసెట్‌ని బ్రహ్మానందం చూస్తున్నట్లుగా వీడియో ఆరంభమై, చిత్రంలోని ఇతర పాత్రలను చూపిస్తూ, చివరికి స్వాతి అదే క్యాసెట్‌ని చూస్తుండటంతో ముగుస్తుంది. ఈ సందర్భంగా సృజన్ ఎరబోలు, అఖిలేష్ వర్ధన్ మాట్లాడుతూ– ''ఇప్పటివరకూ విడుదల చేసిన బ్రహ్మానందం ప్రచార చిత్రాలు, ఫస్ట్ గ్లింప్స్, 'ఏ రాగమో..', 'అరెరే.. అరెరే.. మాటే రాదే..', 'ఏ రాగమో నన్నే రమ్మని పిలుస్తున్నదే..' లిరికల్ వీడియో సాంగ్‌లకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది'' అన్నారు. హర్ష పులిపాక మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో వేదవ్యాస్ పాత్రలో బ్రహ్మానందంగారు జీవించారు. ఆయన, స్వాతి పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో బలమైన ముద్ర వేస్తాయి. ఇందులో నటించినవారంతా చక్కని నటనను కనబరిచారు'' అన్నారు.



● విజయశాంతి, గణపతి రెడ్డి, మల్లిక్

సమయం మారింది

\- **విజయశాంతి**

ఓ గంగిరెద్దుల అబ్బాయి, జోగిని అమ్మాయి ప్రేమలో పడితే.. ఆ ఊరి దొర, గ్రామ ప్రజలు ఎలా వ్యతిరేకత కనబరిచారు అనే కథాంశంతో వస్తున్న చిత్రం 'శరపంజరం'. టి. గణపతిరెడ్డి, మామిడి హరికృష్ణ సహకారంతో నవీన్ కుమార్ గట్టు, లయ జంటగా నవీన్ కుమార్ గట్టు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలోని రెండో పాట 'రావయ్యా నందనా రాజా నందన..' పాటను ప్రముఖ నటి విజయశాంతి విడుదల చేశారు. మల్లిక్ ఎంవీకే స్వరపరచిన ఈ పాటను జానపద కళాకారుడు గిద్దె రాంనర్సయ్య రాసి, పాడారు. విజయశాంతి మాట్లాడుతూ– ''ఆనాడు దొరలు స్వార్థం కోసం ఆడవాళ్లని ఎలా వాడుకున్నారో తెలిసిన విషయమే. ఈనాటి దొర కూడా ఎలా చేస్తున్నాడో తెలిసిన విషయమే. సమయం మారింది కానీ వ్యక్తి మనస్తత్వం మారలేదనడానికి ఈ సినిమా ఒక నిదర్శనంగా నిలుస్తుంది'' అన్నారు.



● రిషబ్ శెట్టి

నీ ఆవేశం నీ శత్రువు కాకూడదు

కన్నడ దర్శక–నటుడు, రచయిత రిషబ్ శెట్టి నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతారా'. 'కేజీఎఫ్' నిర్మాత విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబరు 30న రిలీజైంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో 'కాంతారా' సినిమాను ఇతర భాషల్లోకి కూడా అనువదించి, రిలీజ్ చేస్తున్నారు. గీతా ఆర్ట్స్ సంస్థ అధినేత అల్లు అరవింద్ 'కాంతారా' తెలుగు థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను దక్కించుకుని, గీతా ఫిలింస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా తెలుగులో ఈ నెల 15న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. 'ఒక ఊరిలో ఒక రాజు ఉండేవాడట. అతను ఏదో ఒక రాయి కోసం విశాలమైన భూమిని తన ఊరివాళ్లకు ఇచ్చేశాడట', 'ధైర్యం.. ధైర్యం ఉండేది నీలో ఉన్న ఆవేశంలోనే.. కానీ నీలో ఉన్న ఆవేశం నీకు శత్రువు కాకూడదు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

ఫన్నీ బాయ్‌ఫ్రెండ్

విశ్వంత్ దుడ్డుంపూడి, మాళవికా సతీషన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'. వేణుమాధవ్ పెద్ది, కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో విశ్వంత్ మాట్లాడుతూ– ''న్యూ ఏజ్ అండ్ ఫన్ కాన్సెప్ట్ ఫిల్మ్ ఇది. సంతోష్ హార్డ్ వర్క్ చేశారు. వేణు, నిరంజన్‌గార్లు పిల్లర్స్‌లా నిలబడ్డారు'' అన్నారు. ''ఓ కొత్త దర్శకుడికి కావాల్సిన మంచి కథ, మంచి ప్రొడక్షన్ ఈ సినిమాతో నాకు దొరికాయి. విశ్వంత్, నిర్మాతలు ఎంతగానో ప్రోత్సహించారు'' అన్నారు సంతోష్. ''తెలుగు రాష్ట్రాల్లో 350 థియేటర్స్‌లో, యూఎస్‌లో వంద థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నాం'' అన్నారు వేణుమాధవ్.



● మాళవిక, విశ్వంత్

సస్పెన్స్.. థ్రిల్..



● మహేంద్రా రెడ్డి, సముద్ర

ఉత్తేజ్, బ్రహ్మాజీ, ప్రభాస్ శ్రీను, ప్రొఫెసర్ దేవన్న, బేబి ధార్వి కీలక పాత్రల్లో ఓ చిత్రం ప్రారంభమైంది. ఊర శ్రీను దర్శకత్వంలో ఈ చిత్రాన్ని లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో దర్శకుడు వి. సముద్ర, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, నిర్మాత బాల బ్రహ్మాచారి, మన్నెపల్లి అప్పారావు, శ్రీలక్ష్మి, పి. జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ''సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. హీరో హీరోయిన్లుగా కొత్తవారు నటిస్తున్నారు'' అన్నారు నిర్మాతలు.



జొకోవిచ్ ఖాతాలో 90వ టైటిల్

సెర్బియా టెన్నిస్ దిగ్గజం జొకోవిచ్ వారం వ్యవధిలో రెండో టైటిల్‌ను సాధించాడు. గతవారం టెల్ అవీవ్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన ఈ మాజీ నంబర్‌వన్ తాజాగా అస్తానా ఓపెన్ టోర్నీ టైటిల్ నెగ్గాడు. కజకిస్తాన్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 6-3, 6-4తో సిట్సిపాస్ (గ్రీస్)పై గెలిచాడు. ఈ సీజన్‌లో జొకోవిచ్‌కిది నాలుగో టైటిల్‌కాగా కెరీర్‌లో 90వ టైటిల్. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 3,55,310 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 2 కోట్ల 94 లక్షలు) దక్కింది.

మరో విజయమే లక్ష్యంగా...

మహిళల ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత జట్టు నేడు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్ జట్టుతో ఆడనుంది. బంగ్లాదేశ్ వేదికగా ఏడు జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఐదు మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు సాధించి, ఒక మ్యాచ్‌లో ఓడింది. మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



తెలుగు టైటాన్స్ ఓటమి



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా రెండో పరాజయం చవిచూసింది. బెంగాల్ వారియర్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 25–45 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. టైటాన్స్ తరఫున వినయ్ ఎనిమిది పాయింట్లు, మోనూ గోయట్ ఏడు పాయింట్లు స్కోరు చేశారు. బెంగాల్ జట్టులో రెయిడర్లు మణీందర్ సింగ్ 11 పాయింట్లు, దీపక్ హుడా 11 పాయింట్లు, శ్రీకాంత్ జాదవ్ ఏడు పాయింట్లు స్కోరు చేశారు. ఇతర మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్ 41–39తో పుణేరి పల్టన్‌పై, జైపూర్ పింక్ పాంథర్స్ 35–30తో పట్నా పైరేట్స్‌పై నెగ్గాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో యు ముంబా; గుజరాత్ జెయింట్స్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

న్యూజిలాండ్‌కు తొలి గెలుపు


కాన్వే

క్రైస్ట్‌చర్చ్: ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు తొలి విజయం నమోదు చేసింది. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఎనిమిది వికెట్లతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులు చేసింది. ఓపెనర్ నజ్ముల్ హుస్సేన్ (33; 4 ఫోర్లు), నూరుల్ హసన్ (25 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. కివీస్ బౌలర్లలో బౌల్ట్, సౌతీ, సోధి, బ్రేస్‌వెల్ రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి గెలిచింది. కివీస్ ఓపెనర్ డెవాన్ కాన్వే (51 బంతుల్లో 70 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీ సాధించగా... విలియమ్సన్ (30; 1 ఫోర్), గ్లెన్ ఫిలిప్స్ (9 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు.

‘శత’క్కొట్టిన శ్రేయస్

- భారత వైస్ కెప్టెన్ అజేయ సెంచరీ
- రెండో వన్డేలో దక్షిణాఫ్రికాపై ఏడు వికెట్లతో టీమిండియా విజయం
- మెరిసిన ఇషాన్ కిషన్, సిరాజ్
- రేపు ఢిల్లీలో ఆఖరి వన్డే


‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శ్రేయస్


ఇషాన్ కిషన్


సిరాజ్

రాంచీ: శ్రేయస్ అయ్యర్ (111 బంతుల్లో 113 నాటౌట్; 15 ఫోర్లు) అజేయ శతకం... ‘ఇషాన్’దార్ (84 బంతుల్లో 93; 4 ఫోర్లు, 7 సిక్సర్లు) ఇన్నింగ్స్ భారత్‌ను సిరీస్‌లో నిలబెట్టాయి. రెండో వన్డేలో ఏడు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై టీమిండియా గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. సిరీస్ నిర్ణాయక మూడో వన్డే మంగళవారం ఢిల్లీలో జరుగుతుంది. రెండో వన్డేలో టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (89 బంతుల్లో 79; 7 ఫోర్లు, 1 సిక్స్), రీజా హెండ్రిక్స్ (76 బంతుల్లో 74; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. భారత బౌలర్లలో సిరాజ్ (10-1- 38-3) ఆకట్టుకున్నాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ 45.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 282 పరుగులు చేసి గెలిచింది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున షహబాజ్ అహ్మద్ అరంగేట్రం చేశాడు. సఫారీ జట్టులో ఫామ్‌లో లేని కెప్టెన్ బవుమా, స్పిన్నర్ షమ్సీల స్థానాల్లో ఫోర్టున్, హెండ్రిక్స్ బరిలోకి దిగారు. దీంతో కేశవ్ మహరాజ్ సారథ్యం చేపట్టాడు.

రాణించిన హెండ్రిక్స్, మార్క్‌రమ్

డాషింగ్ ఓపెనర్ డికాక్ (5)ను క్లీన్‌బౌల్డ్ చేసిన సిరాజ్ సఫారీని గట్టిదెబ్బే తీశాడు. కాసేపటికి మలాన్ (31 బంతుల్లో 25; 4 ఫోర్లు)ను షహబాజ్ అహ్మద్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. 40 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయిన సఫారీని హెండ్రిక్స్, మార్క్‌రమ్ ఆదుకున్నారు. హెండ్రిక్స్ 58 బంతుల్లో, మార్క్‌రమ్ 64 బంతుల్లో ఫిఫ్టీలను పూర్తి చేసుకున్నారు. చాలాసేపు భారత శిబిరాన్ని ఇబ్బంది పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు సిరాజే విడగొట్టాడు. దీంతో 129 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన క్లాసెన్ (26 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిల్లర్ (34 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు) వేగంగా ఆడారు. ఆఖరి 10 ఓవర్లను భారత బౌలర్లు కట్టడి చేయడంతో 57 పరుగులే వచ్చాయి.

కిషన్ సిక్సర్లు

కెప్టెన్ ధావన్ (13), గిల్ (26 బంతుల్లో 28; 5 ఫోర్లు) మళ్లీ నిరాశపరిచారు. దాంతో భారత్ 48 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. గత మ్యాచ్ ఫలితం, సిరీస్ చేజార్చుకోవడం తప్పదనిపించింది. ఈ దశలో ఇషాన్, శ్రేయస్ ‘లెఫ్ట్-రైట్’ కాంబినేషన్‌తో అదరగొట్టారు. మొదట ఆచితూచి ఆడిన ఈ జోడీ మ్యాచ్ సాగేకొద్దీ దంచేసే పనిలో పడింది. 20.3 ఓవర్లో భారత్ వంద స్కోరు దాటింది. కేశవ్ వేసిన 21వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదిన ఇషాన్ తర్వాత నోర్జేనూ చితకబాదాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ చక్కని ప్లేసింగ్‌తో చూడముచ్చటైన బౌండరీలతో అలరించాడు. ముందుగా ఇషాన్ 60 బంతుల్లో (2 ఫోర్లు, 3 సిక్సర్లు), ఆ తర్వాత అయ్యర్ 48 బంతుల్లో (7 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు. కెప్టెన్ కేశవ్ మహరాజ్ మార్చిమార్చి బౌలర్లను ప్రయోగించినా ఈ భాగస్వామ్యాన్ని విడగొట్టలేకపోయాడు. భారత బ్యాటర్లు చెలరేగడంతో 33.3 ఓవర్లో స్కోరు 200 పరుగులు దాటింది. కేవలం 16.3 ఓవర్లలో 79 పరుగుల విజయ సమీకరణం సులువైపోయింది. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న ఇషాన్‌ను ఫోర్టున్ అవుట్ చేశాడు. దీంతో 161 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. తర్వాత సామ్సన్ (30 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి అయ్యర్ అజేయంగా లక్ష్యాన్ని పూర్తిచేశాడు. ఈ క్రమంలో శ్రేయస్ 103 బంతుల్లో (14 ఫోర్లు) వన్డేల్లో తన రెండో శతకాన్ని సాధించాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) సిరాజ్ 5; మలాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షహబాజ్ 25; హెండ్రిక్స్ (సి) షహబాజ్ (బి) సిరాజ్ 74; మార్క్‌రమ్ (సి) ధావన్ (బి) సుందర్ 79; క్లాసెన్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 30; మిల్లర్ (నాటౌట్) 35; పార్నెల్ (సి) శ్రేయస్ (బి) శార్దుల్ 16; కేశవ్ (బి) సిరాజ్ 5; ఫోర్టున్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 278. వికెట్ల పతనం:** 1-7, 2-40, 3-169, 4-215, 5-215, 6-256, 7-277. **బౌలింగ్:** సిరాజ్ 10-1-38-3, వాషింగ్టన్ సుందర్ 9-0-60-1, షహబాజ్ అహ్మద్ 10-0-54-1, అవేశ్ ఖాన్ 7-0-35-0, కుల్దీప్ యాదవ్ 9-0-49-1, శార్దుల్ ఠాకూర్ 5-0-36-1.

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (బి) పార్నెల్ 13; గిల్ (సి అండ్ బి) రబడ 28; ఇషాన్ కిషన్ (సి) హెండ్రిక్స్ (బి) ఫోర్టున్ 93; శ్రేయస్ (నాటౌట్) 113; సామ్సన్ (నాటౌట్) 30; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (45.5 ఓవర్లలో 3 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-28, 2-48, 3-209. **బౌలింగ్:** ఫోర్టున్ 9-1-52-1, వేన్ పార్నెల్ 8-0-44-1, రబడ 10-1-59-1, నోర్జే 8.5-0-60-0, కేశవ్ మహరాజ్ 7-0-45-0, మార్క్‌రమ్ 3-0-22-0.


కృష్ణ చైతన్య-మహేశ్ జోడీకి స్వర్ణం



అహ్మదాబాద్: జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి ఎనిమిదో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన పురుషుల బీచ్ వాలీబాల్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన కృష్ణ చైతన్య-మహేశ్ జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్లో కృష్ణ చైతన్య-మహేశ్ ద్వయం 22-24, 23-21, 15-11తో కృష్ణంరాజు-నరేశ్ (ఆంధ్రప్రదేశ్) జోడీపై విజయం సాధించింది. 2015 కేరళ జాతీయ క్రీడల బీచ్ వాలీబాల్ ఫైనల్లో కృష్ణంరాజు-నరేశ్ జోడీ చేతిలో ఓడిపోయి రజత పతకం నెగ్గిన కృష్ణ చైతన్య ఏడేళ్ల తర్వాత అదే జంటను ఓడించి ఈసారి స్వర్ణ పతకం సాధించడం విశేషం. 2015 కేరళ జాతీయ క్రీడల్లో రవీందర్ రెడ్డితో కలిసి కృష్ణ చైతన్య బరిలోకి దిగాడు. ఈసారి మహేశ్‌తో జతకట్టిన కృష్ణ చైతన్య పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. కనోయింగ్‌లో 1000 మీటర్ల స్ప్రింట్ విభాగంలో తెలంగాణకు చెందిన అమిత్ కుమార్ సింగ్ కాంస్య పతకాన్ని సాధించాడు. అమిత్ రేసును 4ని:31.533 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచాడు. పురుషుల బాక్సింగ్‌లో సర్వీసెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ 57 కేజీల విభాగంలో సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 5-0తో రోహిత్ మోర్ (ఢిల్లీ)పై గెలిచాడు.

వెర్‌స్టాపెన్‌దే ప్రపంచ టైటిల్

జపాన్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన రెడ్‌బుల్ డ్రైవర్



సుజుకా (జపాన్): ఫార్ములావన్ (ఎఫ్1) సీజన్‌లో మరో నాలుగు రేసులు మిగిలి ఉండగానే రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా రెండో ఏడాది ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను గెల్చుకున్నాడు. ఆదివారం జరిగిన జపాన్ గ్రాండ్‌ప్రిలో 25 ఏళ్ల వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. వర్షం కారణంగా ప్రధాన రేసును నిర్ణీత 53 ల్యాప్‌లకు బదులుగా 28 ల్యాప్‌లకు కుదించారు. ‘పోల్ పొజిషన్’తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ దూసుకుపోగా రెండు ల్యాప్‌ల తర్వాత వర్షం రావడంతో రేసు నిలిచిపోయింది. వర్షం తగ్గాక రెండు గంటల్లోపు రేసును ముగించాలనే నిబంధన కారణంగా రేసును 28 ల్యాప్‌లకు తగ్గించారు. వెర్‌స్టాపెన్ 3 గంటల 1ని:44.044 సెకన్లలో అందరికంటే వేగంగా గమ్యానికి చేరి ఈ సీజన్‌లో 12వ విజయాన్ని అందుకున్నాడు. సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్) రెండో స్థానంలో, లెక్‌లెర్క్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. 22 రేసుల ఈ సీజన్‌లో 18 రేసులు ముగిశాక వెర్‌స్టాపెన్ 366 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. పెరెజ్ 253 పాయింట్లతో రెండో స్థానంలో, లెక్‌లెర్క్ 252 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మరో నాలుగు రేసులు జరగాల్సి ఉన్నా... తొలి స్థానంలో ఉన్న వెర్‌స్టాపెన్‌కు రెండో స్థానంలో ఉన్న పెరెజ్ మధ్య 113 పాయింట్ల వ్యత్యాసం ఉంది. ఒకవేళ పెరెజ్ నాలుగు రేసుల్లోనూ గెలిచినా వెర్‌స్టాపెన్‌ను అధిగమించే అవకాశం లేకపోవడంతో ఈ రెడ్‌బుల్ డ్రైవర్‌కు ప్రపంచ టైటిల్ ఖరారైంది. సీజన్‌లోని తదుపరి రేసు యునైటెడ్ స్టేట్స్ గ్రాండ్‌ప్రి టెక్సాస్‌లో ఈనెల 23న జరుగుతుంది.

ముంబై సిటీతో హైదరాబాద్ ఎఫ్‌సీ మ్యాచ్ ‘డ్రా’

పుణే: ఇండియన్ సూపర్ లీగ్ టోర్నీని డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ‘డ్రా’తో ప్రారంభించింది. ముంబై సిటీ ఎఫ్‌సీతో ఆదివారం ఆడిన తమ తొలి మ్యాచ్‌ను హైదరాబాద్ 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. హైదరాబాద్ తరఫున జావో విక్టర్ (45వ, 76వ ని.లో) రెండు గోల్స్, హాలిచరణ్ నర్జారీ (51వ ని.లో) ఒక గోల్ చేయగా... చింగ్లెన్‌సనా సింగ్ ‘సెల్ఫ్ గోల్’ సాధించాడు. ముంబై జట్టుకు గ్రెగ్ స్టివార్ట్ (68వ ని.లో), అల్బెర్టో నొగుయెరా (85వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

285 జియో సైంటిస్ట్ కొలువులు

యూపీఎస్సీ ఎగ్జామ్స్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డులో కేటగిరీ 1, కేటగిరీ 2 పోస్టులను భర్తీ చేయనున్నారు. యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. మంచి హోదాతోపాటు ఆకర్షణీయ వేతనాలను పొందవచ్చు. ఈ నేపథ్యంలో.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ నోటిఫికేషన్ వివరాలు, భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..

వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్

మొత్తం పోస్టుల సంఖ్య 285

- **కేటగిరీ 1:** జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ మైన్స్‌లో జియాలజిస్ట్ గ్రూప్-ఏ- 216పోస్టులు,జియో ఫిజిస్ట్(గ్రూప్-ఏ)21 పోస్టులు,కెమిస్ట్(గ్రూప్-ఏ)19 పోస్టులున్నాయి.
- **కేటగిరీ 2:** సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, మినిస్ట్రీ ఆఫ్ జల్ శక్తి,డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్స్, రివర్ డెవలప్‌మెంట్ అండ్ గంగా రెజువెనేషన్‌లో.. సైంటిస్ట్ బి(హైడ్రో జియాలజి) గ్రూప్ ఏ-26 పోస్టులు, సైంటిస్ట్ బి(కెమికల్) గ్రూప్ ఏ-01 పోస్టులు, సైంటిస్ట్ బి(జియో ఫిజిక్స్) గ్రూప్ ఏ-02 పోస్టులున్నాయి.

అర్హతలు

- జియాలజీ లేదా అనుబంధ విభాగాల్లో పీజీ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అర్హులు. కెమిస్ట్ పోస్టులకు కెమిస్ట్రీలో పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జియోఫిజిసిస్టు పోస్టులకు ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్‌లో పీజీ చదివిన వారు అర్హులు.
- 01.01.2023 నాటికి కేటగిరి 1 పోస్టులకు గరిష్టంగా 32 ఏళ్లు, కేటగిరి 2 పోస్టులకు 35 ఏళ్లు మించరాదు. రిజర్వేషన్ కేటగిరీలకు గరిష్ట వయసులో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

కంబైన్డ్ జియో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. స్టేజ్-1 ప్రిలిమ్స్, స్టేజ్-2 మెయిన్స్, స్టేజ్-3 ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

స్టేజ్-1

- ప్రిలిమినరీ(స్టేజ్-1) పరీక్షను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు. మొత్తం 400 మార్కులకు స్టేజ్ 1 ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి.
- పేపర్-1లో జనరల్ స్టడీస్ 100 మార్కులకు ఉంటుంది. ఈ పేపర్ అభ్యర్థులందరికి ఉమ్మడిగానే నిర్వహిస్తారు.
- పేపర్-2 దరఖాస్తు చేసుకున్న పోస్టును బట్టి మారుతుంది. పేపర్-2 సంబంధిత సబ్జెక్టులో 300 మార్కులకు ఉంటుంది.
- జియాలజీ, హైడ్రోజియాలజిస్ట్ పోస్టులకు జియాలజీ/హైడ్రోజియాలజీ విభాగం నుంచి ప్రశ్నలు వస్తాయి. జియో ఫిజిసిస్ట్/సైంటిస్ట్ పోస్టులకు జియో ఫిజిక్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. జియో కెమిస్ట్ పోస్టులకు కెమిస్ట్రీ నుంచి ప్రశ్నలు వస్తాయి.
- పేపర్-1, పేపర్-2 ఒక్కో పరీక్ష సమయం 2 గంటలు. రుణాత్మక మార్కులున్నాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది. తప్పు సమాధానాలకు ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల నుంచి మూడో వంతు కోతను విధిస్తారు.

స్టేజ్-2

ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది. మెయిన్స్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగం నుంచి 3 పేపర్లుంటాయి. ఒక్కో పేపర్‌కూ 200 చొప్పున 600 మార్కులకు స్టేజ్-2 నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు పరీక్ష సమయం 3 గంటలు.

స్టేజ్-3

చివరి దశ ఇంటర్వ్యూ. దీనికి 200 మార్కులు కేటాయించారు. కనీస అర్హత మార్కుల నిబంధన లేదు. అభ్యర్థులు సంబంధిత పోస్టులకు తగిన వారా లేదా అనేది గమనిస్తారు. నాయకత్వ లక్షణాలు, ఇతర సామర్థ్యాలను అంచనా వేసి మార్కులు కేటాయిస్తారు.

విధులు.. ఇలా

జియోసైంటిస్ట్‌లు క్షేత్ర అధ్యయనాల ప్రణాళికలను అమలు చేయడం వీరి ప్రాధానమైన విధి. క్షేత్రస్థాయిలో, ప్రయోగశాలల్లో టెక్నీషియన్ల విధులను పర్యవేక్షించడం, ఇతర శాస్త్రవేత్తలతో విధులను సమన్వయ పరచడం వంటివి చేస్తారు. నేలలు, పదార్థాలు, ప్రక్రియల అధ్యయనం చేస్తారు. అలాగే శిలల ఉద్భవించిన తీరు, మార్పులు జరిగిన తీరుతెన్నులను పరిశీలిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** అక్టోబర్ 11, 2022
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 19, 2023
- **వెబ్‌సైట్:** https://upsc.gov.in

కెరీర్ డిజైన్.. యూసీడ్!

అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్.. సంక్షిప్తంగా.. యూసీడ్. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. ప్రతిష్టాత్మక ఐఐటీ క్యాంపస్‌ల్లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో చేరే అవకాశం లభిస్తుంది! ఈ కోర్సు పూర్తి చేసుకోవడం ద్వారా డిజైన్, ఫ్యాషన్ ప్రపంచంలో ఉజ్వల కెరీర్ సొంతం చేసుకునే వీలుంది. తాజాగా యూసీడ్-2023కు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. యూసీడ్‌కు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి యూసీడ్
- ఐఐటీ-ముంబై ఆధ్వర్యంలో ఎంట్రన్స్ నిర్వహణ
- అయిదు క్యాంపస్‌లలో అందుబాటులో కోర్సులు
- యూసీడ్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

ఆట బొమ్మల నుంచి ఆటోమొబైల్స్ వరకు.. హ్యాండిక్రాఫ్ట్స్ నుంచి హెలికాప్టర్స్ దాకా.. ఇంటీరియర్ డెకరేషన్ నుంచి ఇంటర్నెట్ వెబ్‌సైట్స్ వరకు.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వినియోగదారులను ఆకట్టుకోవడంలో డిజైన్ కీలక పాత్ర పోషిస్తోంది. అంతేకాదు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో ప్రధానంగా నిలిచే సాధనం డిజైన్. సంబంధిత నిపుణులను తీర్చిదిద్దే కోర్సులే.. డిజైన్ కోర్సులు. ఇలాంటి కోర్సులను టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదివేందుకు మార్గం..యూసీడ్. ఈ పరీక్షలో ర్యాంకు ద్వారా ఐఐటీ-ముంబై, ఢిల్లీ, గువహటి, హైదరాబాద్, ఐఐఐటీడీఎంలలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో చేరొచ్చు. ప్రతి ఏటా ఐఐటీ-ముంబై ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంట్రన్స్‌కు సంబంధించి యూసీడ్-2023 నోటిఫికేషన్ విడుదలైంది.

అర్హతలు

- 2022లో ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణులైన వారు, 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు మాత్రమే అర్హులు. ఐఐఐటీడీఎం-జబల్‌పూర్, ఐఐటీ-గువహటిలలో సీటు కోరుకునే విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో తప్పనిసరిగా ఎంపీసీ గ్రూప్ చదివుండాలి.
- **వయసు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులు అక్టోబర్ 1,1998 తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అక్టోబర్ 1, 1993 తర్వాత జన్మించి ఉండాలి.

అయిదు క్యాంపస్‌లు..199 సీట్లు

- యూసీడ్ ఎంట్రన్స్‌లో ర్యాంకు ఆధారంగా.. ఐఐటీ-ముంబై, ఐఐటీ-ఢిల్లీ, ఐఐటీ-గువహటి, ఐఐటీ-హైదరాబాద్,ఐఐఐటీడీఎం-జబల్‌పూర్ క్యాంపస్‌లలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో సీట్ల భర్తీ చేస్తున్నారు.
- ఐఐటీ-ముంబైలో 37; ఢిల్లీలో 20, గువహటిలో 56, హైదరాబాద్‌లో 20, ఐఐఐటీడీఎం-జబల్‌పూర్‌లో 66 చొప్పున మొత్తం 199 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- వీటితోపాటు గురుగోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ,యూపీఈఎస్-డెహ్రాడూన్, డి.వై.పాటిల్ యూనివర్సిటీ తదితర 20కి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలు.. యూసీడ్ స్కోర్ ఆధారంగా బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి.

యూసీడ్.. ఇలా

నాలుగు ఐఐటీ క్యాంపస్‌లు, ఐఐఐటీడీఎంలోని బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే యూసీడ్ పరీక్షను రెండు సెక్షన్‌లు పార్ట్ ఏ, పార్ట్ బీగా నిర్వహిస్తారు.మూడు గంటల వ్యవధిలో మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

పార్ట్-ఎ.. 240 మార్కులు

- పార్ట్-ఎలో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి.. ఎన్ఏటీ(న్యూమరికల్ ఆన్సర్ టైప్) ప్రశ్నల సంఖ్య 18-72 మార్కులు, ఎంఎస్‌క్యూ (మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్) ప్రశ్నల సంఖ్య 18-72 మార్కులు, ఎంసీక్యూ(మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్) ప్రశ్నల సంఖ్య 32- 96 మార్కులు. ఇలా.. మొత్తం 68 ప్రశ్నలు-240 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- సెక్షన్-1, 2లలో ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు, సెక్షన్-3లో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. • పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.

పార్ట్-బి.. స్కెచింగ్

- పార్ట్-బిలో స్కెచింగ్ పరీక్ష నిర్వహిస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 60. ఈ విభాగంలో అభ్యర్థులకు ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి.. దానికి సంబంధించిన డ్రాయింగ్ వేయమని అడుగుతారు. ఈ పరీక్షను పెన్, పేపర్ విధానంలో నిర్వహిస్తారు. • ఇలా.. మొత్తం రెండు సెక్షన్లు కలిపి 300 మార్కులకు పరీక్ష ఉంటుంది.

విజయం సాధించాలంటే

- యూసీడ్ పరీక్షలో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు క్రియేటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి. దాని ఆధారంగా తమ ప్రిపరేషన్‌ను సాగించాలి.
- పార్ట్-ఎకు సంబంధించి విజువలైజేషన్ అండ్ స్పేషియల్ ఎబిలిటీ, అబ్జర్వేషన్ అండ్ డిజైన్ సెన్సిటివిటీ, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సోషల్ అవేర్‌నెస్,అనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ అండ్ క్రియేటివిటీ, డిజైన్ థింకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాలపై దృష్టి పెట్టాలి.
- పార్ట్-బికు సంబంధించి.. ప్రొడక్ట్ డ్రాయింగ్, సిట్యుయేషన్ బేస్డ్ డ్రాయింగ్ అంశాలపై పట్టు సాధించాలి.
- పార్ట్-ఎలో ప్రశ్నలను న్యూమరికల్ ఆన్సర్ టైప్, మల్టిపుల్ సెలక్ట్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ విధానంలో అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు సిలబస్‌కు అనుగుణంగా ఆయా అంశాలపై అన్ని కోణాల్లోనూ అవగాహన పెంచుకోవాలి.
- వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలు, ఇంగ్లిష్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీపైనా పట్టు పెంచుకోవాలి.
- దీంతోపాటు.. జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి సామాజిక అభివృద్ధిలో డిజైన్ ప్రాముఖ్యత, పర్యావరణం, కాలుష్యం తదితర అంశాలపై పట్టు సాధించాలి.

ఉమ్మడి కౌన్సెలింగ్

- ఈ ఎంట్రన్స్‌ను పరిగణనలోకి తీసుకునే క్యాంపస్‌లలో సీట్ల భర్తీకి ఉమ్మడి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు.
- ఐఐటీ-ముంబై ఆధ్వర్యంలో యూసీడ్ స్కోర్ ఆధారంగా జాయింట్ సీట్ అలొకేషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. • యూసీడ్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ ప్రక్రియలో పాల్గొని కామన్ అప్లికేషన్ ఫామ్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తు సమయంలో అభ్యర్థులు పేర్కొన్న ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలు, అందుబాటులో ఉన్న సీట్లు, అభ్యర్థులు పొందిన స్కోర్‌లను బేరీజు వేస్తూ సీట్ అలాట్‌మెంట్ చేస్తారు.
- ఈ మొత్తం ప్రక్రియను ఐఐటీ-ముంబైలోని డిజైన్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తుంది.

ఉజ్వల భవిష్యత్తు

- ప్రస్తుత ఆధునిక యుగంలో ఉజ్వల అవకాశాలకు కేరాఫ్‌గా డిజైన్ రంగం నిలుస్తోంది. ముఖ్యంగా ఫ్యాషన్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్; ఆటోమొబైల్ డిజైన్, టాయ్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఆర్కిటెక్చర్ డిజైన్, వెబ్ డిజైనింగ్, గ్రాఫిక్ డిజైన్-యానిమేషన్ ఫిల్మ్ డిజైన్ వంటి రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. • ఉత్పత్తి పరిశ్రమలు, ఎంఎన్‌సీలు, పరిశోధన సంస్థలు ప్రధానమైన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.
- ప్రారంభంలో డిజైన్ ఎగ్జిక్యూటివ్ హోదాలో అడుగుపెట్టి.. రెండు, మూడేళ్ల అనుభవంతో డిజైన్ సూపర్‌వైజర్, డిపార్ట్‌మెంట్ హెడ్, చీఫ్ డిజైనర్ వంటి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు.



క్యాంపస్ డ్రైవ్స్

డిజైన్ రంగంలో నిపుణుల కోసం ఎంటర్‌టైన్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ రంగాలకు చెందిన పలు సంస్థలు క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించి ఆఫర్లు ఖరారు చేస్తున్నాయి. సగటు వార్షిక వేతనం రూ.8 లక్షలుగా ఉంటోంది.

ఉన్నత విద్య

- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్య అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఐఐటీలు, నిఫ్ట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ తదితర ఇన్‌స్టిట్యూట్‌లలో మాస్టర్ ఆఫ్ డిజైన్‌లో తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్ అభ్యసించొచ్చు.

యూసీడ్-2023 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** అక్టోబర్ 21, 2022.
- **రూ.500 ఆలస్య రుసుముతో చివరి తేదీ:** అక్టోబర్ 29.
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** జనవరి 13, 2023 నుంచి.
- **యూసీడ్ పరీక్ష తేదీ:** జనవరి 22, 2023 .
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
- **ఫలితాల వెల్లడి:** మార్చి 9, 2023.
- **వెబ్‌సైట్:** www.uceed.iitb.ac.in/2023

ఆసక్తి ప్రధానం

ప్రస్తుతం డిజైన్ రంగంలో నైపుణ్యాలున్న వారికి డిమాండ్ పెరుగుతోంది. డిజైన్ కోర్సులు పూర్తి చేసుకుంటే కెరీర్ అవకాశాలకు ఢోకాలేదు. ఈ రంగంలో ప్రవేశించాలనుకునే యువతకు ఆసక్తి ఎంతో ప్రధానం. ఎప్పటికప్పుడు మార్కెట్ ట్రెండ్స్, వస్తున్న మార్పులను గమనిస్తూ.. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రొడక్ట్ డిజైన్ చేసే దూరదృష్టి అవసరం.

– ప్రొఫెసర్ బి.కె.చక్రవర్తి, ఐడీసీ స్కూల్ ఆఫ్ డిజైన్, ఐఐటీ-ముంబై

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
31	17
58,191	17,315

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	10,652	▽	421
డోజోన్స్	29,297	▽	630
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,991	▽	6
డాక్స్	12,273	▽	198
షాంఘై (సెప్టెంబర్ 30 ముగింపు)	3,024	▽	17
నికాయ్	27,116	▽	195

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

పెట్టుబడికీ 'ఓకే బంగారం'!



- కష్టకాలంలో ఆదుకునే సాధనం
- సాటిలేని స్టోర్ ఆఫ్ వ్యాల్యూ
- దీర్ఘకాలంలోనే రాబడులు
- స్వల్పకాలం కోసం కానే కాదు
- ద్రవ్యోల్బణం నుంచి రక్షణ
- పెట్టుబడికి ధోకా లేదు
- అత్యంత లిక్విడిటీ కలిగినది...

బంగారం అంటే ఇష్టం లేనిది ఎవరికి? పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఇష్టపడే లోహం ఇది. ఆభరణాలు, పెట్టుబడుల సాధనంగా డిమాండ్ అధికం. ఏటా 800-900 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నాం. ఇక డిజిటల్ బంగారం సాధనాల్లో పెట్టుబడులు వేరే. బంగారం విలువైన లోహమే అయినప్పటికీ ధరల పరంగా ఇందులో అస్థిరతలు కూడా చాలా ఎక్కువ. ఈక్విటీ మార్కెట్లు అంత కాకపోయినా, గోల్డ్‌లోనూ ఆటుపోట్లు అధికమే. ఇక్కడ కూడా ఇన్వెస్టర్ల సహనమే రాబడులకు గీటురాయి అవుతుంది. అసలు బంగారంలో పెట్టుబడి దండగ? అని కొందరు అంటుంటారు. పోర్ట్‌ఫోలియోలో కనీసం 5-10 శాతం అయినా బంగారానికి కేటాయించుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తుంటారు. ఈ భిన్నమైన అభిప్రాయాలు, సూచనలతో ఇన్వెస్టర్లకు అయోమయం ఏర్పడొచ్చు. నిజానికి బంగారంలో పెట్టుబడి వద్దు అని చెప్పడానికంటే.. ఇన్వెస్ట్ చేసుకోండని సూచించడానికే కారణాలు బోలెడు ఉన్నాయి. బంగారం ధరల తీరుతెన్నులు, దీర్ఘకాల చరిత్రను పరిశీలిస్తే ఇందులో పెట్టుబడి పెట్టే విషయమై ఎలా నడుచుకోవాలన్న అవగాహన ఏర్పడుతుంది. పెట్టుబడి సాధనంగా బంగారం ఎంపిక ముందు తెలుసుకోవాల్సిన అంశాలతో కూడిన కథనమే ఇది.



బంగారం ధరల్లో అస్థిరతలు ఎక్కువే. చారిత్రకంగా గరిష్ట ధరల్లో ఎప్పుడు కొనుగోలు చేసినా.. తిరిగి ఆ ధరలను అధిగమించాలంటే ఎన్నో ఏళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి. దేశంలో 1964 నుంచి (55 సంవత్సరాలు) బంగారం ధరల చరిత్రను ఆర్‌బీఐ నివేదికల ఆధారంగా పరిశీలిస్తే.. అస్థిరతల తీరును అర్థం చేసుకోవచ్చు.

1964 నుంచి బంగారం ధరల తీరు

సంవత్సరం	ధర (10 గ్రా. రూ.లలో)
1964	63
1970	184
1975	540
1980	1,330
1981	1,800
1982	1,645
1985	2,130
1988	3,130
1989	3,140
1990	3,200
1992	4,334
1993	4,140
1995	4,680
2000	4,400
2005	7,000
2010	18,500
2012	31,050
2014	28,007
2015	26,344
2019	35,220
2020	48,651
2021	47,470



పెట్టుబడి మార్గాలు..

బంగారం ఆభరణాల రూపంలో కలిగి ఉండాలా? కాయిన్ల రూపంలోనా? లేక ఈటీఎఫ్‌లోనా? ఇలాంటి సందేహాలు రావచ్చు. సార్వభౌమ బంగారం బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ ఎక్సేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు), గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఈ గోల్డ్, 24 క్యారట్ల కాయిన్లు, బార్లు, ఆభరణాలు ఇన్ని రూపాల్లో బంగారాన్ని కలిగి ఉండే వెసులుబాటు ఉంది. వీటన్నింటిలోకి మెరుగైన మార్గాలు ఏవి అంటే ఎస్‌జీబీ, గోల్డ్ ఈటీఎఫ్‌లు అని చెప్పుకోవాల్సిందే. ఆభరణాల రూపంలో బంగారాన్ని కలిగి ఉండొచ్చు. కానీ, పెట్టుబడి మార్గంలో ఆభరణాలను కలిగి ఉండడం కంటే, డిజిటల్ రూపంలో నిర్వహించడమే మెరుగైన ఆప్షన్ అవుతుంది. ముఖ్యంగా సార్వభౌమ బంగారం బాండ్లు అయితే ఎనిమిదేళ్ల కాలవ్యవధితో వస్తాయి. భౌతిక రూపంలోనే బంగారాన్ని కలిగి ఉండేట్టు అయితే.. ఆభరణాలుగా కాకుండా, బ్యాంకుల నుంచి 24 క్యారట్ల కాయిన్ల రూపంలో కొనుగోలు చేసుకోవడం మంచిది. ఎందుకంటే బంగారం ఆభరణాలు అయితే, తయారీ చార్జీలు, తరుగు, వృథా పేరుతో కొంత నష్టపోవాల్సి వస్తుంది. బంగారం కాయిన్లు సైతం రుణాలు పొందేందుకు సాయపడతాయి. ఇక ఆ తర్వాత గోల్డ్ ఈటీఎఫ్‌లు అన్నవి స్టాక్ ఎక్సేంజ్‌ల్లో ట్రేడ్ అవుతుంటాయి. షేర్ల మాదిరే కొనుగోలు విక్రయాలు చేసుకోవచ్చు. దీనికి ట్రేడింగ్, కమ్ డీమ్యాట్ ఖాతా ఉండాలి. మార్కెట్ ధర ఆధారంగానే గోల్డ్ ఈటీఎఫ్‌ల ధరల్లో మార్పు ఉంటుంది. ఇక పలు ఎన్‌బీఎఫ్‌సీలు, వ్యాలెట్లు ఆఫర్ చేసే ఈ-గోల్డ్ (ఎలక్ట్రానిక్ గోల్డ్) అన్నది ఎంత మాత్రం మెరుగైన సాధనం కాదు. ఇందులో తెలియని చార్జీల రూపంలో, సరైన ధరల్లేమి కారణంగా కొంత నష్టపోవాల్సి వస్తుంది. గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ కూడా అంతే. చార్జీల రూపంలో రాబడిలో కొంత త్యాగం చేయాల్సి వస్తుంది. ఎస్‌జీబీల్లో ఏ చార్జీలు ఉండవు.

రాబడులు

1978 నుంచి 1985 వరకు బంగారం ధర ర్యాలీ చేసింది. మళ్లీ 1988 నుంచి 1992 వరకు పెరగడాన్ని చూడొచ్చు. తిరిగి 2002-2012 మధ్య కూడా బంగారం భారీ ర్యాలీ చేసింది. కానీ, మిగిలిన కాలాల్లో అక్కడక్కడే చలించింది. మొత్తానికి దీర్ఘకాలంలో రాబడులు ఇచ్చినట్టు గణాంకాలను పరిశీలిస్తే తెలుస్తుంది. విడిగా చూస్తే బంగారం నికర నష్టాలను ఇచ్చిన సంవత్సరాలు కూడా కనిపిస్తాయి. టేబుల్‌ను గమనిస్తే ఈ విషయం తెలుస్తుంది. బంగారం ధర పెరగడమే కానీ, తగ్గదు? అన్నది నిజం కాదు. 1967 నుంచి 1974 మధ్య బంగారం ధర ఐదు రెట్లు పెరిగింది. 2004-2012 మధ్య కూడా ఐదు రెట్లు పెరిగింది. కానీ, మిగిలిన సంవత్సరాల్లో పెద్దగా పెరుగుదల లేదు. కనుక దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగించినప్పుడే ఈ పెరుగుదల ప్రయోజనం ఇన్వెస్టర్‌కు లభిస్తుంది. బంగారం నిర్ణీత కాలం పాటు అలా స్థిరంగా కొనసాగుతూ.. కేవలం రెండు, ఐదేళ్ల వ్యవధిలో ఎన్నో రెట్లు పెరుగుతుందని చారిత్రక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థల పనితీరు, కరెన్సీ మారకం తదితర అంశాల ప్రభావం బంగారంపై ఉంటుంది. దీర్ఘకాలం పాటు, ఒక సైకిల్ నుంచి మరో సైకిల్ వరకు బంగారంలో పెట్టుబడిని కొనసాగించడం ద్వారా అస్థిరతల ప్రభావం లేని, చక్కని రాబడులు సొంతం చేసుకోవచ్చు.

రాబడి తీరు ఇదీ...

సంవత్సరం	సగటు రాబడి (శాతంలో)
ఏడాది	13.6
మూడేళ్లు	12.9
ఐదేళ్లు	12.4
పదేళ్లు	12.3



పోర్ట్‌ఫోలియో వైవిధ్యం

పెట్టుబడులు అన్నింటినీ ఒకే చోట పెట్టొద్దన్నది ప్రాథమిక సూత్రం. ఈక్విటీలు, డెట్, బంగారం, ప్రాపర్టీ ఇలా వివిధ సాధనాల మధ్య పెట్టుబడులను కేటాయించుకోవాలి. ఒక్కో కాలంలో ఒక్కో సాధనం ప్రతికూలతలను చూస్తుంటుంది. ఈక్విటీలు నేలచూపులు చూస్తున్న సమయాల్లో బంగారం ర్యాలీ చేస్తుంటుంది. అస్థిరతలను అధిగమించేందుకు ఇదొక సాధనం. పైగా ఇది అత్యంత లిక్విడిటీ ఉన్న సాధనం. కనుక పెట్టుబడుల్లో బంగారానికి చోటు ఇవ్వాలన్నది నిపుణుల సూచన. రిస్క్‌ను తగ్గించి దీర్ఘకాలంలో విలువను పెంచేది కనుక దీనికి ప్రాధాన్యం ఇవ్వాలి.



విలువ పెరిగే సాధనం



కరెన్సీ విలువ క్షీణత నుంచి కాపాడే సాధనం బంగారం. 3,000 సంవత్సరాలుగా స్టోర్ ఆఫ్ వ్యాల్యూ కలిగిన సాధనం ఇది. కొని పెట్టుకుంటే విలువ పెరిగే సాధనంగా గుర్తింపు ఉంది. కనుక విలువ తగ్గిపోతుందన్న ఆందోళన లేదు. దీర్ఘకాలంలో విలువ పెరిగే అతి కొద్ది సాధనాల్లో భూమితోపాటు బంగారం కూడా ఉంటుంది. బంగారంతో పోలిస్తే దీర్ఘకాలంలో కరెన్సీల కొనుగోలు విలువ తగ్గిపోవడాన్ని స్పష్టంగా గమనించొచ్చు. ముఖ్యంగా 1900 తర్వాత స్టోర్ ఆఫ్ వ్యాల్యూ విషయంలో బంగారం మెరుగైన స్థానంలో నిలిచింది. స్వల్పకాలంలో కరెన్సీలు బలపడొచ్చేమో కానీ, దీర్ఘకాలంలో బంగారం ముందు కరెన్సీలు చిన్నపోవాల్సిందే.

బంగారంలో ఎందుకు పెట్టుబడి పెట్టాలి?

పెట్టుబడికి ధోకా లేదు



ఒక కంపెనీ షేరులో ఇన్వెస్ట్ చేశారనుకోండి. ఆ కంపెనీ వ్యాపారం దెబ్బతిని కుదేలైపోతే పెట్టుబడి కూడా హరించుకుపోతుంది. కానీ, బంగారంలో పెట్టుబడికి ధోకా లేదు. 3,000 ఏళ్ల చరిత్రలో బంగారం విలువ కానీ, ధర కానీ సున్నా కాలేదు. అందుకే కష్టకాలంలో అసలైన ఆస్తులు ఏవంటే? బంగారం, భూమి అని చెబుతారు. పోర్ట్‌ఫోలియోలో బంగారం ఉంటే, కష్టకాలం ఎదురైతే దీని సాయంతో గట్టెక్కొచ్చన్న భరోసా ఉంటుంది.

అత్యవసరాల్లో ఆదుకుంటుంది..



బంగారం కష్టకాలంలో ఆదుకునే సాధనం అని నిస్సందేహంగా చెప్పొచ్చు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల్లో, స్టాక్ మార్కెట్ పతనాల్లో సురక్షిత సాధనంగా పసిడివైపే చూస్తుంటారు. అత్యవసరంగా డబ్బు అవసరం పడితే, బంగారం విక్రయించి గట్టెక్కొచ్చు. లేదంటే కనీసం ఆ బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం పొందొచ్చు. రుణంపై వడ్డీ రేటు కూడా చాలా తక్కువే ఉంటుంది. ప్రస్తుతం బంగారంపై బ్యాంకులు 8-9%రేటును వసూలు చేస్తున్నాయి.

లిక్విడ్ అసెట్



బంగారం కొనుగోలు, విక్రయం చాలా సులభం. అంటే ఇది లిక్విడ్ అసెట్ అవుతుంది. భూమి/ఇల్లు లిక్విడ్ అస్సెట్ కాదు. ప్రాపర్టీ అనేది కోరుకున్న వెంటనే, అవసరంలో వేగంగా అమ్ముడుపోయే సాధనం కాదు. మార్కెట్ కంటే తక్కువ ధరకు విక్రయిస్తే తప్ప ప్రాపర్టీల విక్రయానికి కొంత సమయం తీసుకుంటుంది. లావాదేవీ ముగిసి, చేతికి డబ్బు అందడానికి కనీసం మూడు నెలలు అయినా సమయం పడుతుంది.

ప్రత్యేక నైపుణ్యాలు అక్కర్లేదు



స్టాక్స్‌లో పెట్టుబడులకు మంచి పరిజ్ఞానం ఉండాలి. ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టాలన్నా కనీస పరిజ్ఞానం లేదా నిపుణుల సాయం కావాలి. భూమి లేదా ఇల్లు కొనుగోలు చేయాలంటే మార్కెట్ ధరల తీరు, భవిష్యత్ వృద్ధి అవకాశాల గురించి అవగాహన ఉండాలి. న్యాయ నిపుణుల సలహాలు కూడా అవసరం పడతాయి. క్రిప్టో కరెన్సీలు అయినా, బాండ్లు అయినా అవగాహనతో కొనుగోలు చేయాల్సిందే. కానీ, బంగారానికి ఇవేమీ అక్కర్లేదు.

ద్రవ్యోల్బణం నుంచి రక్షణ



బంగారాన్ని ద్రవ్యోల్బణానికి హెడ్జ్‌గా పరిగణిస్తుంటారు. ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భాల్లో కరెన్సీ విలువలు క్షీణిస్తుంటాయి. గత దశాబ్ద కాలంలో డాలర్ మారకంలో రూపాయి తన విలువను రెట్టింపు మేర కోల్పోయింది. కానీ, బంగారం ధర గత ఐదేళ్లలో రెట్టింపైంది. గత దశాబ్దంలో నాలుగు రెట్లు పెరిగింది. వడ్డీ రేట్లను దాటుకుని ద్రవ్యోల్బణం పరుగులు తీస్తున్న తరుణంలో బంగారంలో పెట్టుబడితో భరోసా లభిస్తుంది. పదేళ్ల కాలంలో బంగారంలో వార్షిక సగటు రాబడులను గమనిస్తే రెండంకెల్లో ఉన్నట్టు ఇక్కడి టేబుల్ చూస్తే తెలుస్తుంది. అంటే ద్రవ్యోల్బణం కంటే రెట్టింపు రాబడి బంగారంలో సాధ్యమేనని తెలుస్తోంది.

నేటి నుంచి బడ్జెట్ కసరత్తు షురూ..



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సానికి (2023-24) సంబంధించిన బడ్జెట్‌పై నేటి నుంచి (సోమవారం) కేంద్రం కసరత్తు మొదలు పెట్టనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు (ఆర్‌ఈ), రాబోయే సంవత్సరానికి అవసరమైన కేటాయింపులు తదితర అంశాలపై వివిధ శాఖలు, విభాగాలతో సంప్రదింపులతో ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తొలి రోజైన సోమవారం నాడు అటవీ శాఖ, కార్మిక శాఖ, సమాచార .. ప్రసార శాఖ, గణాంకాల శాఖ, యువజన వ్యవహారాల శాఖ ఆర్‌ఈ సమావేశాలు ఉంటాయి. వివిధ శాఖలతో నెల రోజుల పాటు సాగే సమావేశాలు నవంబర్ 10న ముగుస్తాయి. సాధారణంగా ఈ సమావేశాలన్నింటికి ఆర్థిక విభాగం, వ్యయాల విభాగం కార్యదర్శులు సారథ్యం వహిస్తారు. ప్రీ-బడ్జెట్ భేటీల తర్వాత 2023-24 బడ్జెట్ అంచనాలను సూచనప్రాయంగా రూపొందిస్తారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న తరుణంలో వృద్ధికి ఊతమిచ్చే చర్యలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వొచ్చని అంచనాలు నెలకొన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-10-2022	
విశాఖ	430-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	430-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	66.00
9-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	412-00
వరంగల్	414-00
రిటైల్ ధర	4.70

మరో ఖాతా నుంచైనా డెబిట్!

- చెక్ బౌన్స్ కేసుల నిరోధంపై కేంద్రం దృష్టి
- కొత్త అకౌంట్‌లను తెరవకుండా నిషేధం

న్యూఢిల్లీ: చెక్ బౌన్స్ కేసులు దేశంలో భారీగా పెరిగిపోతుండడంపై దీనిని కట్టడి చేయడంపై కేంద్రం దృష్టి సారిస్తోంది. ఈ దిశలో నేరస్తులపై కఠిన చర్యలకు సమాయత్తం అవుతోంది. ప్రస్తుతం, చెక్ జారీ చేసిన అకౌంట్ నుంచే డబ్బు డెబిట్ కావాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలను సవరించాలన్న సూచనలు వస్తున్నాయి. అత్యున్నత స్థాయి వర్గాలు ఈ మేరకు తెలిపిన సమాచారం ప్రకారం, ఇటీవల ఈ సమస్యపై ఆర్థిక శాఖ అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పాల్గొన్న నిపుణుల నుంచి పలు ప్రతిపాదనలు, సూచనలు అందాయి. వీటిలో ప్రధానమైనవి చూస్తే...

- చెక్కు జారీ చేసిన వ్యక్తి ఇన్‌స్ట్రుమెంట్‌కు సంబంధించి అకౌంట్‌లో నిధులు తక్కువగా ఉన్నట్లయితే అతని లేదా ఆమె మరొక ఖాతా నుండి చెక్ అమౌంట్ డెబిట్ చేయాలన్న ప్రతిపాదన ఇందులో ఒకటి.
- అలాగే నేరస్తులు కొత్త ఖాతాలను తెరవడాన్ని నిషేధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సూచనలు అందాయి.
- చెక్ బౌన్స్‌ను రుణ డిఫాల్ట్‌గా పరిగణించడం, నేరస్తుని స్కోర్‌ను అవసరమైనమేర డౌన్‌గ్రేడ్ చేయడం కోసం ఈ సమాచారాన్ని క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు నివేదించడం కూడా ప్రతిపాదనలో ఉంది. ఈ సూచనలను ఆమోదించే ముందు తగిన చట్టపరమైన సలహాలు తీసుకోవడం జరుగుతుందని ఆర్థికశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆయా చర్యలు, బ్యాంకింగ్ టెక్నాలజీ అభివృద్ధి ద్వారా చెక్ బౌన్స్ కేసులను సమర్థవంతంగా తగ్గించవచ్చన్నది నిపుణుల సూచన. దేశ వ్యాప్తంగా దాదాపు 35 లక్షల చెక్ బౌన్స్ కేసులు పెండింగులో ఉన్నాయి.



గాయత్రి ప్రాజెక్ట్స్‌పై దివాలా పిటిషన్

- దాఖలు చేసిన కెనరా బ్యాంక్
- ఎన్‌సీఎల్‌టీలో నేడు తదుపరి విచారణ




న్యూఢిల్లీ: భారీగా పేరుకుపోయిన బాకీలను రాబట్టుకునేందుకు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) సంస్థ గాయత్రి ప్రాజెక్ట్స్‌పై కెనరా బ్యాంక్ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తదుపరి విచారణను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అక్టోబర్ 10న (నేడు) చేపట్టనుంది. గాయత్రి ప్రాజెక్ట్స్ సంస్థ బ్యాంకులకు దాదాపు రూ. 6,000 కోట్లు బకాయిపడింది. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) అత్యధికంగా రుణాలిచ్చాయి.

చిన్న కంపెనీలు అనుకూలమేనా?

స్మాల్‌క్యాప్ ఫండ్స్ దీర్ఘకాలం పెట్టుబడులకు (రిటైర్మెంట్) అనుకూలమేనా? – వర్షిల్ గుప్తా

స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులకు దీర్ఘకాలం ఒక్కటీ సరిపోదు. నష్టాలకు, యూనిట్ల విలువ క్షీణతకు తట్టుకోగలిగి ఉండాలి. దీర్ఘకాలంలో సంపద సృష్టికి స్మాల్‌క్యాప్ పథకాలను పరిశీలించొచ్చు. అయినప్పటికీ స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులు సులభమేమీ కాదు. అవి అదే పనిగా నిర్ణీత సమయాల్లో నష్టాలకు గురవుతుంటాయి. మార్కెట్లో ఇతర విభాగాలు మంచి పనితీరు చూపిస్తూ, స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు నష్టాలను చూపిస్తుంటే ఆందోళన చెందకుండా ఉండడం కష్టం. అందుకనే మీ మొత్తం పెట్టుబడుల్లో 10-15 శాతం మించి స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులుగా పెట్టరాదు. చిన్న కంపెనీని ఎంపిక చేసుకుంటే, అది ఆ తర్వాతి కాలంలో పెద్ద కంపెనీగా మారిందనడానికి వందలాది ఉదాహరణలు ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో సంపద సృష్టి జరుగుతుంది. కానీ, అలా ఎంపిక చేసుకున్న ప్రతి కంపెనీ పెద్దది, ఓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కాదు. సంపదను తుడిచిపెట్టేవీ ఉంటాయి. ఆటుపోట్లను తట్టుకునే బలం చిన్న కంపెనీలకు తక్కువగా ఉంటుంది.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అనుకూలతలు

దీర్ఘకాలంలో చిన్న కంపెనీలు సంపదను సృష్టించగలవు. లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే మంచి వృద్ధిని చూపించగలవు. సాధారణంగా చిన్న కంపెనీలను ఎక్కువ మంది అనుసరించరు. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు మరీ చిన్న కంపెనీలకు దూరంగా ఉంటాయి.

ప్రతికూలతలు

ముఖ్యంగా స్మాల్‌క్యాప్ కంపెనీల విషయానికొస్తే కావాల్సినంత లిక్విడిటీ ఉండదు. చిన్న కంపెనీలు కావడంతో ఫ్రీ ఫ్లోటింగ్ ఈక్విటీ తక్కువే ఉంటుంది. దీంతో మార్కెట్ల కరెక్షన్లలో కొద్ది విక్రయాలకే ఎక్కువ నష్టపోతుంటాయి. మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీలు రిస్క్ ఎక్కువతో ఉంటాయి. మారుతున్న మార్కెట్లకు అనుగుణంగా డైనమిక్‌గా ఉండేవి తక్కువే.

డెట్, ఈక్విటీల మధ్య అస్సెట్ (పెట్టుబడులు) అలోకేషన్ పరంగా ఏ విభాగం డెట్ ఫండ్స్ అనుకూలం? – ఎస్‌కే శర్మ

ఫైనాన్షియల్ సెక్యూరిటీల్లో పెట్టుబడులకు అస్సెట్ అలోకేషన్ ముఖ్యమైనది. ఈక్విటీలు దీర్ఘకాలంలో రాబడులను ఇస్తాయి. డెట్ సాధనాలు తక్కువ రాబడులనే ఇచ్చినా, పోర్ట్‌ఫోలియోకు స్థిరత్వాన్నిస్తాయి. డెట్ ఫండ్స్ రాబడులను వడ్డీ రేట్లు ప్రభావితం చేస్తాయనే దానిపై ఇన్వెస్టర్లకు అవగాహన ఉండాలి. బాండ్ల ధరలు, వడ్డీ రేట్ల మధ్య వ్యతిరేక సంబంధం ఉంటుంది. వడ్డీ రేట్లు పెరుగుతుంటే బాండ్ల ధరలు తగ్గుతాయి. వడ్డీ రేట్లు తగ్గుముఖం పడుతుంటే బాండ్ల ధరలు పెరుగుతాయి. దీర్ఘకాల డెట్ ఫండ్స్‌లో అస్థిరతలు ఎక్కువ. డెట్ ఫండ్స్ పరంగా ఇన్వెస్టర్ల ముందు ఎన్నో ఆప్షన్లు ఉన్నాయి. ఇన్వెస్టర్లు వడ్డీ రేట్ల రిస్క్ లేదా క్రెడిట్ రిస్క్ ఎక్కువగా ఉండకూడదని అనుకుంటే.. అప్పుడు లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ లేదా లో డ్యురేషన్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇవన్నీ కూడా 91 రోజుల నుంచి ఏడాది కాలం సెక్యూరిటీల్లోనే ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అస్సెట్ అలోకేషన్ పరంగా డెట్ విభాగం నుంచి షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌కు చోటు ఇవ్వాలి. ఏడాదిలోపే పెట్టుబడులను తిరిగి తీసుకునేట్టు అయితే లిక్విడ్ లేదా లో డ్యురేషన్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇన్వెస్టర్లు హైబ్రిడ్ ఫండ్స్‌ను కూడా పరిశీలించొచ్చు. కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్స్ అయితే ఎక్కువ పెట్టుబడులను డెట్‌కు, ఈక్విటీలకు 25 శాతం మించకుండా కేటాయింపులు చేస్తుంటాయి. అగ్రెస్సివ్ హైబ్రిడ్ పథకాలు ఈక్విటీలకు 65-80 శాతం వరకు, మిగిలిన మొత్తాన్ని డెట్‌కు కేటాయిస్తుంటాయి. ఇక డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ కూడా ఉన్నాయి. ఈ పథకాల మేనేజర్లు మార్కెట్లు, వడ్డీ రేట్ల ఆధారంగా ఈక్విటీ, డెట్ విభాగాల మధ్య కేటాయింపులు మారుస్తుంటారు. ఈక్విటీలు ఎక్కువ దిద్దుబాటుకు లోనై స్టాక్స్ వ్యాల్యూషన్లు ఆకర్షణీయంగా ఉంటే, అప్పుడు డెట్‌కు కేటాయింపులు తగ్గించి ఈక్విటీలకు పెంచుతారు. ఈక్విటీల వ్యాల్యూషన్లు ఖరీదుగా మారాయని భావించినప్పుడు కొంత మేర విక్రయించి డెట్ పెట్టుబడులు పెంచుతుంటారు.


ఫండ్ స్ట్రీట్

యాక్సిస్ నాస్‌డాక్ 100 ఫండ్ ఆఫ్ ఫండ్..



యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా నాస్‌డాక్ 100 ఫండ్ ఆఫ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఓపెన్ ఎండెడ్ ఫండ్ .. నాస్‌డాక్ 100 టీఆర్‌ఐ ఆధారిత ఈటీఎఫ్ యూనిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. హితేష్ దాస్ దీనికి ఫండ్ మేనేజరుగా వ్యవహరిస్తారు. అక్టోబర్ 7న ప్రారంభమైన ఈ ఫండ్ ఎన్‌ఎఫ్‌వో అక్టోబర్ 21న ముగుస్తుంది. కనీసం రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. పేరొందిన టెక్ కంపెనీలతో పాటు హెల్త్‌కేర్ తదితర రంగాల కంపెనీలు నాస్‌డాక్ 100 సూచీలో భాగం. అంతర్జాతీయ పెట్టుబడులు పెట్టడం ద్వారా లబ్ధి పొందే అవకాశంతో పాటు రూపాయి పతనాన్ని హెడ్జ్ చేసుకునేందుకు కూడా ఈ ఫండ్ ఉపయోగపడగలదని సంస్థ ఎండీ చంద్రేశ్ నిగమ్ తెలిపారు.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ ఫండ్



ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ థీమ్ ఆధారంగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఈ స్కీమును రూపొందించింది. అక్టోబర్ 6న ప్రారంభమైన ఈ న్యూ ఫండ్ ఆఫర్ అక్టోబర్ 20న ముగుస్తుంది. నిఫ్టీ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ సూచీలో భాగమైన రంగాలు/కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధ సెక్యూరిటీల్లో ఈ స్కీము ప్రధానంగా ఇన్వెస్ట్ చేస్తుంది. దేశీయంగా రవాణా మార్కెట్ ఇంకా పూర్తిగా విస్తరించలేదని, ప్రభుత్వం మరింతగా దృష్టి పెడుతున్న నేపథ్యంలో ఈ రంగం వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని సంస్థ హెడ్ (ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, స్ట్రాటజీ) చింతన్ హరియా తెలిపారు. దేశీ లాజిస్టిక్స్ మార్కెట్ దాదాపు 216 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఇందులో సంఘటిత సంస్థల వాటా 6-7 బిలియన్ డాలర్ల మేర ఉంటుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.



Hero
అద్భుతమైన స్టైల్
అసమానమైన
టెక్నాలజీ
GLAMOUR
XTEC
LEAD THE GAME
LED
హెడ్‌ల్యాంప్
నెవిగేషన్
అసిస్ట్
సైడ్ స్టాండ్
ఇంజన్ కట్-ఆఫ్
బ్లూటూత్
కనెక్ట్
బిల్ట్-ఇన్
మొబైల్ ఛార్జర్
ఆకర్షణీయమైన పండుగ ఆఫర్లు
0% వడ్డీ రేటు
2022లో కొనండి, 2023లో చెల్లించండి
క్యాష్ బెనిఫిట్ ₹3000/- వరకు
తక్కువ డౌన్ పేమెంట్ ₹9999/-
ఎక్స్-షోరూమ్ ధర ₹83,488/-
5% EXTRA CASHBACK
SBI card
*Min. Trxn.: ₹20000; Max. Cashback on one Trxn. per card during the offer period: ₹5000. per card. Valid only on EMI Trxn. Validity: Sep 2022 - Oct 2022. T&C Apply.
70116 70116
MISSED CALL TO CONNECT 8367796950
CALL TOLL-FREE 1800 266 0018
Hero GoodLife
₹6500
HeroFinCorp